www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 9-9-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 163 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, బాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: షష్ఠి రా. 9.54 తదుపరి సప్తమి; నక్షత్రం: విశాఖ సా. 6.04 తదుపరి అనూరాధ; వర్జ్యం: రా.10.24-12.08; దుర్ముహూర్తం: మ.12.36-1.25, మ.3.03-3.51; అమృతఘడియలు: ఉ.8.19-10.06; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.05; సూర్యాస్తమయం: 6.18 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

టెస్టుల్లోకి పంత్ పునరాగమనం

బంగ్లాతో తొలిటెస్ట్‌కు టీమిండియా ఎంపిక


పంత్


యశ్ దయాళ్

ముంబై: దాదాపు 20 నెలల తర్వాత రిషభ్ పంత్ టెస్ట్ టీమ్‌లో పునరాగమనం చేశాడు. ఈ నెల 19 నుంచి స్వదేశంలో బంగ్లాదేశ్‌లో జరిగే రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగం మొదటి మ్యాచ్‌లో కోసం 16 మంది సభ్యుల భారత జట్టును బీసీసీఐ ఆదివారం ప్రకటించింది. గతేడాది ఇంగ్లండ్‌తో సిరీస్‌కు దూరమై కోహ్లీ కూడా జట్టులో చోటు దక్కించుకొన్నాడు. రోడ్డు ప్రమాదం నుంచి బయట పడి రీఎంట్రీ ఇచ్చిన తర్వాత పంత్‌ను తొలిసారి టెస్ట్‌లకు ఎంపికయ్యాడు. అయితే, షమి పునరా గమనం మరికొంత ఆలస్యం కానుంది. లెఫ్టామ్ పేసర్ యశ్ దయాళ్‌కు తొలిసారి సెలెక్టర్ల నుంచి పిలుపొచ్చింది. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో ఒక్క మ్యాచ్ మాత్రమే ఆడిన కేఎల్ రాహుల్‌కు మరో అవకాశం లభించింది.

భారత జట్టు (తొలి టెస్ట్): రోహిత్ శర్మ (కెప్టెన్), జైస్వాల్, గిల్, కోహ్లీ, రాహుల్, సర్ఫరాజ్ ఖాన్, పంత్ (వికెట్ కీపర్), ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), అశ్విన్, జడేజా, అక్షర, కుల్దీప్, సిరాజ్, ఆకాష్ దీప్, బుమ్రా, యశ్.

పారాలింపిక్స్

లక్ష్యాన్ని ఛేదించి బలమైన శక్తిగా ఎదిగి..

29 పతకాలతో భారత్ ఘనమైన ముగింపు

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

పది రోజులకుపైగా క్రీడాభిమానులను అలరించిన పారాలింపిక్స్‌కు ఆదివారంతో తెరపడింది. ఈ క్రీడల్లో భారత అథ్లెట్లు నిర్దేశించుకున్న 25 పతకాల లక్ష్యాన్ని అలవోకగా దాటేశారు. టోక్యో పారాలింపిక్స్‌లో 19 పతకాలతో అదరగొట్టడం ఈసారి క్రీడల్లో మనం 25కిపైగా మెడల్స్ సాధిస్తామనే లక్ష్యాన్ని నిర్దేశించుకోనేందుకు ప్రేరణ అయ్యింది. పారిస్‌లో మొత్తం 29 పతకాలు (7 స్వర్ణాలు, 9 రజతాలు, 13 కాంస్యాలు) సొంతం చేసుకున్న భారత్ భవిష్యత్‌లో ఈ క్రీడల్లో బలమైన శక్తిగా ఎదుగుతున్నామని నిరూపించింది. ఇక..ఈసారి మన పతకాల్లో ఏకంగా ఏడు స్వర్ణాలుండడం రికార్డు. 29 పతకాల్లో.. ట్రాక్, ఫీల్డ్ విభాగంలోనే 17 రావడం ఇంకో విశేషం. చైనా 200పైగా మెడల్స్‌తో అగ్రస్థానంలో నిలవగా..భారత్ 18వ స్థానానికి దూసుకొచ్చింది.


సెమా

అదిరే ప్రదర్శన..: 84 మంది భారత బృందంలో పలువురు అథ్లెట్లు చారిత్రక ప్రదర్శనతో పతకాలు పట్టేశారు. మహిళల 100మీ., 200మీ. స్ప్రింట్ టీ35 విభాగాలలో ప్రీతిపాల్ రెండు కాంస్యాలు చేజిక్కించుకుంది. పురుషుల జూడో 60కిలోల జే1 కేటగిరీలో కపిల్ పర్మార్ కూడా కాంస్యం దక్కించుకున్నాడు. ఆర్చరీలో హర్విందర్, క్లబ్ త్రోలో ధరమ్‌బీర్ పసిడి పతకాలతో ఔరా అనిపించారు. మిక్స్‌డ్ టీమ్ విభాగంలో కాంస్యం కైవసం చేసుకున్న చేతులు లేని ఆర్చర్ శీతల్ దేవి ప్రతిభకు పారిస్ ఫిదా అయ్యింది. జావెలిన్ త్రోయర్ సుమిత్, షూటర్ అవనీ లేఖారా తమ స్వర్ణ పతకాలను నిలబెట్టుకొని ‘ఫేవరెట్’ టైటిల్‌కు సార్థకత చేకూర్చారు.

భళా దీప్తి: పారాలింపిక్స్‌లో తలపడిన తెలుగు అథ్లెట్లలో రవి (షాట్‌పుట్), అర్షద్ (సైక్లింగ్), నారాయణ (రోయింగ్) నిరాశ పరచగా.., దీప్తి జీవాంజి మాత్రమే అంచనాలను అందుకుంది. మహిళల 400 మీటర్ల టీ20 పరుగులో ఆమె కాంస్య పతకంతో మెరిసింది.


నవదీప్


నవదీప్ సింగ్

నవదీప్‌కు స్వర్ణం

సిమ్రన్‌కు కాంస్యం

పారిస్: తమ జోరు కొనసాగిస్తూ పారాలింపిక్స్ చివర్లోనూ భారత అథ్లెట్లు పతకాలు కొల్లగొట్టారు. శనివారంనాటి పోటీలలో రెండు పతకాలు సాధించారు. పురుషుల జావెలిన్ ఎఫ్41 విభాగంలో నవదీప్ సింగ్ స్వర్ణ పతకం సొంతం చేసుకోగా, మహిళల 200 మీటర్ల (టీ12) రేసులో సిమ్రన్ కాంస్యం చేజిక్కించుంది. వాస్తవంగా 47.32 మీటర్ల దూరం జావెలిన్‌ను విసిరిన నవదీప్..చైనాకు చెందిన ప్రపంచ రికార్డు హోల్డర్ సన్ పెంగ్ జియాంగ్‌ను వెనక్కు నెట్టి రజత పతకం అందుకున్నాడు. కానీ స్వర్ణం నెగ్గిన ఇరాన్ జావెలిన్ త్రోయర్ (47.64మీ.) అరబిక్ అక్షరాలతో కూడిన నల్లజెండాను ప్రదర్శించడంతో అతడిపై వేటు వేశారు. ఫలితంగా నవదీప్‌కు పసిడి పతకం దక్కింది. అంతకు ముందు కాంస్యంతో సరిపెట్టుకున్న పెంగ్ (44.72మీ.)కు రజతం ప్రకటించారు. నుఖే లావీ (ఇరాక్, 40.46మీ.) కాంస్యం లభించింది.



సిమ్రన్.. బెస్ట్ టైమింగ్


మహిళల 200 మీటర్ల (టీ12)లో వరల్డ్ చాంపియన్ సిమ్రన్ 24.75 సెకన్ల అత్యుత్తమ సమయంతో రేస్‌ను పూర్తిచేసి కాంస్య పతకం చేజిక్కించుకుంది. దృష్టిలోపం ఉన్న రన్నర్లు పాల్గొనే ఈ రేస్‌లో..అథ్లెట్ల గైడ్ కూడా పరుగులో పాల్గొంటారు. దాంతో గైడ్‌గా అభయ్‌సింగ్ పరిగెత్తాడు. డ్యురాండ్ (క్యూబా, 23.62సె.) స్వర్ణం, పెరెజ్ లోపెజ్ (వెనిజులా, 24.19సె.) రజతాలు నెగ్గారు.

షాట్‌పుట్‌లో సెమా కంచు మోత: శుక్రవారం అర్ధరాత్రి జరిగిన పురుషుల షాట్‌పుట్‌లో భారత అథ్లెట్ హొకటో హొటొజె సెమా కాంస్య పతకం సాధించాడు. నాగాలాండ్‌కు చెందిన ఈ మాజీ సైనికుడు ఫైనల్స్‌లో ఇనుప గుండును 14.65 మీటర్లు దూరం విసిరి మూడో స్థానంలో నిలిచాడు. ఇరాన్ అథ్లెట్ యాసిన్ (15.96 మీ.)కు స్వర్ణం, బ్రెజిల్‌కు చెందిన తియాగో (15.06మీ.)కు రజతాలు దక్కాయి.

బెలారస్ భామదే యూఎస్ ఓపెన్

సాహో.. సబలెంక

● ఈ ఏడాది రెండో గ్రాండ్‌స్లామ్ కైవసం
● హోరాహోరీ ఫైనల్లో పెగులాపై విజయం


ట్రోఫీతో సబలెంక

పారిస్: హోరాహోరీగా సాగిన తుది పోరులో అద్భుత విజయం సాధించిన బెలారస్ భామ అర్యానా సబలెంక యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను తొలిసారి సొంతం చేసుకొంది. శనివారం రాత్రి జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో రెండో సీడ్ సబలెంక 7-5, 7-5తో జెస్సికా పెగులా (అమెరికా)ను ఓడించింది. గంటా 53 నిమిషాలపాటు సాగిన పోరులో జెస్సికా కూడా పట్టువదలకుండా పోరాడడంతో ఆధిక్యం చేతులు మారుతూ ఉత్కంఠ రేపింది. అయితే, ఫుల్‌ఫామ్‌లో ఉన్న సబలెంక కీలక సమయంలో ఒత్తిడి తట్టుకొని హార్డ్‌కోర్ట్ క్వీన్‌గా నిలిచింది. 2023లో కొకో గాఫ్ చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచిన ఆమె.. ఈసారి టైటిల్‌తో మురిసింది. మ్యాచ్‌లో అర్యానా 40 విన్నర్లు సంధిస్తే.. పెగులా 17 మాత్రమే కొట్టింది. జెస్సికాతో పోల్చితే సబలెంక ఎక్కువ తప్పిదాలు చేసినా.. బలమైన సర్వీస్‌లతో విరుచుకుపడడంతోపాటు తెలివిగా డ్రాప్ షాట్‌లు ఆడుతూ మ్యాచ్‌ను ఎక్కువగా తన నియంత్రణలోనే ఉంచుకొంది. ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ను నిలబెట్టుకొన్న అర్యానా.. ఫ్లషింగ్ మెడోస్‌లో నెగ్గి సీజన్‌ను గ్రాండ్‌గా ముగించింది.

ఓసీఏ చీఫ్‌గా రణ్‌ధీర్ సింగ్



న్యూఢిల్లీ: భారత వెటరన్ క్రీడాధికారి, మాజీ ఒలింపియన్ షూటర్ రణ్‌ధీర్ సింగ్ ఆసియా ఒలింపిక్ కౌన్సిల్ (ఓసీఏ) అధ్యక్షునిగా ఎన్నికయ్యాడు. ఆదివారం ఇక్కడ జరిగిన ఓసీఏ 44వ జనరల్ బాడీ సమావేశంలో 77 ఏళ్ల రణ్‌ధీర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వాస్తవానికి రణ్‌ధీర్ ప్రస్తుతం ఓసీఏకు తాత్కాలిక అధ్యక్షునిగా కొనసాగుతున్నాడు. ఓసీఏ అధ్యక్షుడు, కువైట్‌కు చెందిన షేక్ అహ్మద్ అల్ ఫహద్ అల్ సబాపై అవినీతి ఆరోపణలతో ఈ ఏడాది మేలో నిషేధం విధించడంతో అతని స్థానంలో రణ్‌ధీర్ ప్రస్తుతం తాత్కాలిక చీఫ్‌గా కొనసాగుతున్నాడు. ఇక నుంచి రణ్‌ధీర్ పూర్తిస్థాయిలో బాధ్యతలు చేపట్టనున్నాడు. పంజాబ్‌కు చెందిన రణ్‌ధీర్ 2028 దాకా ఆ పదవిలో ఉండనున్నాడు. కాగా, ఓసీఏ అధ్యక్షునిగా ఎంపికైన తొలి భారతీయునిగా రణ్‌ధీర్ రికార్డుకెక్కారు.

భారత్ సూపర్ బోణీ

చైనాపై 3-0తో విజయం
హాకీ ఆసియా చాంపియన్స్ ట్రోఫీ

హులున్‌బుయిర్ (చైనా): పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం కొల్లగొట్టి జోరుమీదున్న భారత పురుషుల హాకీ జట్టు ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో అద్భుత శుభారంభం చేసింది. ఆదివారం మొదలైన ఈ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ భారత్ తన తొలి మ్యాచ్‌లో 3-0తో ఆతిథ్య చైనాను చిత్తు చేసింది. సుఖ్‌జీత్‌సింగ్ (14 నిమిషం), ఉత్తమ్ సింగ్ (27), అభిషేక్ (32) గోల్స్ చేశారు. తన రెండో మ్యాచ్‌ను భారత్ సోమవారం జపాన్‌తో ఆడనుంది. ఆదివారం మలేసియా-పాకిస్థాన్, జపాన్-కొరియా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి.

మూడో రోజే ముగించారు

● ఇండియా-డిపై ‘సి’ విజయం ● దులీప్ ట్రోఫీ పోరు

అనంతపురం క్లాక్‌టవర్ (ఆంధ్రజ్యోతి): అనంతపురంలో జరిగిన దులీప్ ట్రోఫీ మ్యాచ్ మూడోరోజే ముగిసిపోయింది. ఈ మ్యాచ్‌లో ఇండియా-డి జట్టుపై ఇండియా సి ఘన విజయం సాధించింది. సి-బౌలర్ మానవ్ సుతార్ రెండో ఇన్నింగ్స్‌లో చెలరేగిపోయి ఏకంగా ఏడు వికెట్లను పడగొట్టడంతో ఇండియా-డి జట్టు కోలుకోలేపోయింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇండియా-డి 164, ఇండియా-సి జట్టు 168 పరుగులు చేశాయి. రెండో ఇన్నింగ్స్‌లో ఇండియా-డి జట్టు 236 పరుగులకు ఆలౌటైంది. అనంతరం 232 పరుగుల లక్ష్యంతో దిగిన ఇండియా-సి 6 వికెట్లు కోల్పోయి 233 పరుగులు చేసి విజయం సాధించింది. ఇండియా-డి జట్టులో అక్షర్ పటేల్ (114 పరుగులు, 3 వికెట్లు) రాణించాడు. ఇక ఇండియా ‘ఎ’తో మరో మ్యాచ్‌లో ఇండియా ‘బి’ 76 పరుగులతో నెగ్గింది. ఈ మ్యాచ్ బెంగళూరు వేదికగా జరిగింది.

అంతర్జాతీయ క్రికెట్‌కు మొయిన్ అలీ వీడ్కోలు



లండన్: ఇంగ్లండ్ స్టార్ ఆల్‌రౌండర్ మొయిన్ అలీ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. ఇంగ్లండ్ తరఫున 2014లో అరంగేట్రం చేసిన అలీ.. ఇప్పటిదాకా 68 టెస్టులు, 138 వన్డేలు, 92 టీ20లు ఆడాడు. అన్ని ఫార్మాట్లలో కలిపి 6,678 పరుగులు చేసిన అలీ.. 366 వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్‌లో బెంగళూరు, చెన్నై సూపర్‌కింగ్స్ జట్లకు ఆడిన అలీ.. 67 మ్యాచ్‌ల్లో 1162 పరుగులు, 35 వికెట్లు సాధించాడు.

బిజినెస్

డిపాజిటర్ల కోసం దావా సూచక్ : డీఐసీజీసీ

న్యూఢిల్లీ: బ్యాంకు డిపాజిటర్ల కోసం డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ (డీఐసీజీసీ) ‘దావా సూచక్’ పేరుతో కొత్త సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఈ సదుపాయం ద్వారా కుప్పకూలిన బ్యాంకుల్లో డిపాజిట్లు ఉన్న ఖాతాదారులు డీఐసీజీసీ వెబ్‌సైట్‌లో తమ మొబైల్ నంబర్‌ను ఎంటర్ చేసి తమ క్లెయిమ్ స్టేటస్ తెలుసుకోవచ్చు. కుప్పకూలిన బ్యాంకుల్లో రూ.5 లక్షల వరకు ఉండే వ్యక్తిగత డిపాజిట్ల చెల్లింపునకు డీఐసీజీసీ హామీ ఇస్తుంది. తన సేవల విస్తరణలో భాగంగా డీఐసీజీసీ ఈ కొత్త సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది.

స్పైస్‌జెట్‌లో 10% వాటా అమ్మకం!

న్యూఢిల్లీ: నిధులు సమీకరించేందుకు బడ్జెట్ ఎయిర్‌లైన్ సంస్థ స్పైస్‌జెట్ అష్టకష్టాలు పడుతోంది. దీంతో కంపెనీ ఈక్విటీలో తనకు ఉన్న 47 శాతం వాటాలో 10 శాతం అమ్మేందుకు ప్రమోటర్ అజయ్ సింగ్ సిద్ధమైనట్టు సమాచారం. కొన్ని షరతులకు ఆమోదిస్తే 10 శాతం కంటే ఎక్కువ వాటా విక్రయించేందుకూ ఆయన సిద్ధంగా ఉన్నట్టు చెబుతున్నారు. పీకల్లోతు ఆర్థిక కష్టాల్లో ఉన్న స్పైస్‌జెట్‌కు రుణాలు ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో అజయ్ సింగ్ తన వాటాలో పది శాతానికిపైగా విక్రయిచేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. క్యూఐపీ ద్వారా ఈ వాటా విక్రయించాలని అజయ్ యోచిస్తున్నట్టు సమాచారం.

చైనాకు అదానీ గ్రూప్ విస్తరణ

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ తన వ్యాపార సామ్రాజ్యాన్ని చైనాకు విస్తరిస్తోంది. ఇందుకోసం గ్రూప్ ప్రధాన కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏఈఎల్).. అదానీ ఎనర్జీ రీసోర్సెస్ (షాంఘై) కంపెనీ (ఏఈఆర్‌సీఎల్) పేరుతో చైనాలో ప్రత్యేక అనుబంధ కంపెనీని ఏర్పాటు చేసింది. సింగపూర్‌లోని తన అనుబబంధ సంస్థ అదానీ గ్లోబల్ పీటీఈ (ఏజీపీటీఈ) ద్వారా ఏఈఎల్ ఈ కంపెనీని ఏర్పాటు చేసింది. ఏఈఆర్‌సీఎల్ చైనాలోని కంపెనీలకు సప్లయ్ చైన్ సొల్యూషన్స్, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ సేవలు అందించనుంది.

త్వరగా వరద బాధితుల క్లెయిమ్స్ పరిష్కారం

బజాజ్ అలియాంజ్ లైఫ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వరదలతో చనిపోయిన, వికలాంగులైన వారి క్లెయిమ్‌లను త్వరగా పరిష్కరించేందుకు బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రత్యేక చర్యలు చేపట్టింది. వరదలతో చనిపోయిన లేదా వికలాంగులైన వారి నామినీలు, చట్టపరమైన వారి వారసులు లేదా పాలసీదారులు తప్పనిసరైన కొద్దిపాటి పత్రాలతో తమను సంప్రదించాలని కోరింది. ఇలాంటి క్లెయిమ్‌ల పరిష్కారం కోసం ఈ పత్రాలతో తమ టోల్‌ఫ్రీ నంబర్ 18002097272 ని గానీ, సమీపంలోని తమ బ్రాంచ్ ఆఫీసులో గానీ సంప్రదించాలని కోరింది. ఇంకా claims@bajajallianz.co.in ద్వారా కూడా తమను సంప్రదించవచ్చని తెలిపింది.

ఐపీఓల సందడి



ఈ వారం మార్కెట్లోకి మరో 14 ఇష్యూలు

రూ.8,644 కోట్ల సమీకరణ లక్ష్యం
నేటీ నుంచి బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ఐపీఓ

న్యూఢిల్లీ: ఈ వారం కూడా పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) మార్కెట్లో రద్దీ కనిపిస్తోంది. మొత్తం 13 కంపెనీలు పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.8,644 కోట్లు సమీకరించేందుకు ఈ వారం మార్కెట్‌కు వస్తున్నాయి. ఇందులో నాలుగు మెయిన్‌స్ట్రీమ్ కంపెనీలు రూ.8,390 కోట్లు, తొమ్మిది ఎస్ఎంఈ కంపెనీలు రూ.254 కోట్ల చొప్పున సమీకరించబోతున్నాయి. మెయిన్‌స్ట్రీమ్ కంపెనీల్లో బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ ఒక్కటే ఐపీఓ ద్వారా రూ.6,560 కోట్లు సమీకరించనుంది. మిగతా మొత్తంలో పీఎన్ గాడ్గిల్ జువెలర్స్ (రూ.1,100 కోట్లు), క్రాస్ లిమిటెడ్ (రూ.500 కోట్లు), టోలిన్స్ టైర్స్ (రూ.230 కోట్లు) సమీకరించనున్నాయి.

50 ఇష్యూలు..రూ.80,000 కోట్లు

మెయిన్‌స్ట్రీమ్ ఐపీఓల్లో బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్, క్రాస్ లిమిటెడ్, టోలిన్స్ టైర్స్ ఐపీఓలు సోమవారం, పీఎన్ గాడ్గిల్ జువెలర్స్ ఐపీఓ మంగళవారం ప్రారంభమవుతాయి. ఎస్ఎంఈ సెగ్మెంట్‌లోని తొమ్మిది కంపెనీల ఐపీఓలూ ఈ వారమే ప్రారంభం కానున్నాయి. ఇక ఈ ఏడాది ఇప్పటి వరకు 50పైగా కంపెనీలు ఐపీఓలు, ఫాలో ఆన్ ఆఫర్ల (ఎఫ్‌పీఓ) ద్వారా రూ.80,000 కోట్ల వరకు సమీకరించాయి. డిసెంబరు చివరికల్లా ఇది రూ.1.25 లక్షల కోట్లకు చేరుతుందని ఇక్విరస్ (ఈక్విటీ క్యాపిటల్ మార్కెట్స్) ఎండీ మునీశ్ అగర్వాల్ అంచనా. అయితే సెకండరీ మార్కెట్లో బేరిష్ ట్రెండ్ కొనసాగితే మాత్రం ప్రైమరీ మార్కెట్ జోరుకి బ్రేక్ పడే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఎస్ఎంఈ ఐపీఓలపై జర జాగ్రత్త

ఇటీవల పెద్దగా ఫండమెంటల్స్ లేని ఎస్ఎంఈల ఐపీఓలు కూడా వందల రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ అవుతున్నాయి. లిస్టింగ్ అయిన కొద్ది రోజులకే వాటి ధరలు ఆఫర్ ప్రైస్ కంటే తక్కువకు పడిపోతున్నాయి. దీంతో ఎస్ఎంఈ ఐపీఓల్లో ఏదో మాయ జరుగుతోందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సెబీ సైతం ఇటీవల ఈ ఇష్యూలపై జర జాగ్రత్త అని హెచ్చరించడం విశేషం. అంతటితో ఆగకుండా ఈ ఐపీఓల లిస్టింగ్ లాభాలను ఇష్యూ ధరపై 90 శాతానికి పరిమితం చేసింది.

16 నుంచి ఆర్కేడ్ డెవలపర్స్ ఐపీఓ

ముంబై కేంద్రంగా పనిచేసే ఆర్కేడ్ డెవలపర్స్ ఐపీఓ ఈ నెల 16న ప్రారంభమవుతోంది. ఈ నెల 19న ముగిసే ఈ ఐపీఓ ద్వారా కంపెనీ రూ.410 కోట్లు సమీకరించనుంది. కంపెనీ ఈ నిధులను వ్యాపార విస్తరణ కోసం వినియోగించనుంది.

హెక్సావేర్ టెక్ రూ.9,950 కోట్ల ఐపీఓ

ప్రముఖ ఐటీ కంపెనీ హెక్సావేర్ టెక్నాలజీస్ కూడా ఐపీఓకు సిద్ధమవుతోంది. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా రూ.9,950 కోట్లు సమీకరించేందుకు కంపెనీ సెబీకి దరఖాస్తు చేసింది. అనుకున్న విధంగా ఈ ఇష్యూ విజయవంతమైన దేశ ఐటీ రంగంలో అతి పెద్ద ఐపీఓగా మిగిలిపోతుంది.

రెండు దశాబ్దాల క్రితం టాటా గ్రూప్ నిర్వహణలోని టీసీఎస్ జారీ చేసిన రూ.4,700 కోట్ల ఐపీఓనే ఇప్పటి వరకు భారత ఐటీ కంపెనీల చరిత్రలో అతిపెద్ద ఐపీఓ. హెక్సావేర్ టెక్ ఐపీఓ ఆ రికార్డును తిరగరాయనుంది.

25,200 ఎగువన బుల్లిష్

(సెప్టెంబరు 9-13 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 25,334-24,801 పాయింట్ల మధ్యన కదలాడి 1.55 శాతం నష్టంతో 24,852 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,200 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

బ్రేకౌట్ స్థాయి: 25,200 బ్రేక్‌డౌన్ స్థాయి: 24,500
నిరోధ స్థాయిలు: 25,050 25,150, 25,250 (24,950 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 24,650 ,24,550, 24,450 (24,750 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

9వ తేదీ



హైదరాబాద్	480	విజయవాడ	520
వరంగల్	482	గోదావరి	510
చిత్తూరు	543	విశాఖపట్నం	520
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	99	విజయవాడ	103
వరంగల్	99	గుంటూరు	105
కరీంనగర్	99	ఒంగోలు	105
మహబూబ్‌నగర్	99	చిత్తూరు	101
కర్నూలు	99	నెల్లూరు	101
విశాఖపట్నం	94	అనంతపురం	100
గోదావరి	103		

అంతర్జాతీయ పరిణామాలే కీలకం

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం ఆటుపోట్లకు లోనయ్యే అవకాశాలున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చే సంకేతాలు కీలకంగా ఉండనున్నాయి. అమెరికా ఆర్థిక వ్యవస్థ బలహీనపడుతోందన్న ఆందోళన. యూఎస్ జాబ్ డేటా అంచనాలకు తగ్గట్టుగా లేకపోవటంతో గత శుక్రవారం నిఫ్టీ ఏకంగా 300 పాయింట్లు, బీఎస్ఈ సెన్సెక్స్ 1,100 పాయింట్ల మేర పతనమైంది. ఈ వారం నిఫ్టీకి 24,900 వద్ద మద్దతు, 25,050 వద్ద నిరోధ స్థాయిలున్నాయి. ఫార్మా, ఐటీ రంగాలు బుల్లిష్‌గా ఉండే వీలుంది. తీవ్రంగా నష్టపోయిన బ్యాంక్ షేర్లు స్థిరపడిన తర్వాత పుంజుకునే అవకాశం ఉంది. ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండటం మంచిది.

స్టాక్ రికమండేషన్స్

టాటా టెక్నాలజీ: స్టాక్ మార్కెట్లో నమోదైనప్పటి నుంచి డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ షేరు ప్రస్తుతం కొద్దిగా నిలదొక్కుకుంది. రూ.1,000 స్థాయిలో మంచి బేస్ ఏర్పడింది. ఆగస్టు ఆరంభం నుంచి స్ట్రెంత్ కనిపిస్తోంది. ప్రస్తుతం కీలక నిరోధం వద్దకు చేరుకుంది. గత శుక్రవారం 3.51 శాతం లాభంతో రూ.1,112 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.1,100 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,225/1,255 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,070 స్థాయిని స్టాప్‌లాస్ పెట్టుకోవాలి.

పీఐ ఇండస్ట్రీస్: జూన్ త్రైమాసికంలో మెరుగైన ఫలితాలు ప్రకటించిన తర్వాత ఈ షేరు పుంజుకుంది. గరిష్ఠ స్థాయిల్లోనే కదలాడుతున్నాయి. రిలేటివ్ స్ట్రెంత్ పెరుగుతోంది. గత శుక్రవారం 2.29 శాతం లాభంతో రూ.4,613 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.4,600/4,580 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.4,750 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.4,555 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

మ్యాక్స్‌హెల్త్: జూన్‌లో జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ కౌంటర్‌లో స్వల్పదిద్దుబాటు కనిపించింది. ప్రస్తుతం రూ.850 స్థాయిలో కన్సాలిడేషన్ జరుగుతోంది. చక్కని బేస్ ఏర్పడటం, సీజన్ కావటంతో ఈ షేరుకు గిరాకీ పెరిగింది. గత శుక్రవారం రూ.898 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.890/880 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.960/990 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.865 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

అజంతా ఫార్మా: ఏడు వారాలుగా అప్‌ట్రెండ్‌లో సాగుతున్న ఈ కౌంటర్ మరోసారి బ్రేకౌట్‌కు సిద్ధమైంది. ప్రస్తుతం ఫార్మా రంగం మంచి బూమ్‌లో ఉంది. బలమైన ఫండమెంటల్స్, టెక్నికల్స్ మద్దతున్న ఈ షేరు గత శుక్రవారం రూ.3,350 వద్ద క్లోజైంది. మూమెంటమ్ ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.3,300/3,250 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.3,450 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.3,150 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టొరెంట్ పవర్: ఆగస్టులో జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ షేరులో పుల్‌బ్యాక్ కనిపించింది. ప్రస్తుతం కన్సాలిడేషన్ జరుగుతోంది. తక్కువ వాల్యూమ్‌ను బట్టి ఇందులో సరఫరా ఎక్కువగా లేదని చెప్పొచ్చు. త్వరలోనే డిమాండ్ పెరిగి షేరు పుంజుకునే అవకాశం కనిపిస్తోంది. గత శుక్రవారం ఈ షేరు 1.28 శాతం లాభంతో రూ.1,694 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.1,675/1,670 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,775 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,600 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

టెక్ వ్యూ

మార్కెట్లలో మైనర్ కరెక్షన్!


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత సోమవారం స్వల్ప లాభాలతో ప్రారంభమైనప్పటికీ 25,300 స్థాయిల్లో నిలదొక్కుకోవటంలో విఫలమైంది. ఆ తర్వాత వరుసగా మూడు ట్రేడింగ్ సెషన్లలో బలమైన కరెక్షన్‌ను చవిచూసి చివరకు శుక్రవారం 300 పాయింట్లకు పైగా నష్టపోయింది. గడచిన 14 రోజులుగా వరుసగా ర్యాలీని కనబరుస్తూ వస్తున్న మార్కెట్ ప్రస్తుతం కరెక్షన్‌లోకి జారుకుంది. అంతకు ముందు వారంతో పోలిస్తే గత వారం నిఫ్టీ 380 పాయింట్ల మేర నష్టపోయింది. టెక్నికల్‌గా 25,000 స్థాయిలో అప్‌సైడ్ బ్రేకౌట్‌ను కనబరిచిన నిఫ్టీ గత వారం రివర్స్ బ్రేక్ డౌన్ ప్యాటర్న్‌ను కనబరిచి తదుపరి మరింత అప్రమత్తతను సూచించింది. కాగా ఈ వారం కూడా స్వల్పకాలిక కరెక్షన్ ట్రెండ్‌ను కొనసాగించే అవకాశం ఉంది. మార్కెట్ ప్రస్తుతం టెక్నికల్‌గా స్వల్పకాలిక ఓవర్‌బాట్ పొజిషన్‌ను సర్దుబాటు చేసుకుంటోంది. నిలకడను ప్రదర్శించేందుకు మరికొన్ని రోజులు పట్టే వీలుంది. టెక్నికల్‌గా చూస్తే ప్రస్తుతం నిఫ్టీకి 24,500 వద్ద మద్దతు స్థాయిలు కనిపిస్తున్నాయి.

బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీ అప్‌ట్రెండ్ కోసం నిరోధ స్థాయిలైన 24,800 ఎగువన నిలదొక్కుకోవాల్సి ఉంటుంది. తదుపరి నిరోధ స్థాయిలు 25,100. ఇక్కడ నిలదొక్కుకుంటేనే స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌ను కనబరుస్తుంది.

బేరిష్ స్థాయిలు: మైనర్ మద్దతు స్థాయి 24,700 కన్నా దిగజారితే మరింత బలహీనతను సూచిస్తుంది. తదుపరి ప్రధాన మద్దతు స్థాయి 24,500. ఇది ఆగస్టు 19న ఏర్పడిన నిరోధ స్థాయి. సానుకూలత కోసం కీలకమైన ఈ మద్దతు స్థాయిల ఎగువన పటిష్ఠంగా ముగియాల్సి ఉంటుంది.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం ఆరంభంలో 350 పాయింట్లతో మైనర్ అప్‌ట్రెండ్‌ను కనబరిచినప్పటికీ చివరకు వారాంతంలో 900 పాయింట్లకు పైగా నష్టపోయింది. ఈ కరెక్షన్‌తో బ్యాంక్ నిఫ్టీ గత పది రోజులుగా ఆర్జించిన లాభాలన్నీ హరించుకుపోయాయి. గత వారం ఈ సూచీ 775 పాయింట్లు (1.5 శాతం) మేర నష్టపోయి 50,575 స్థాయిల్లో క్లోజైంది.

ఈ వారం మరింత బలహీనతను సూచిస్తే 50,000 దిగువన మద్దతు స్థాయిలుంటాయి. సానుకూలతను సూచించాలంటే ఈ మద్దతు స్థాయిలకు ఎగువన కన్సాలిడేట్ కావాల్సి ఉంటుంది. లేని పక్షంలో మరింత బలహీనతను సూచిస్తుంది. అప్రమత్తంగా ఉండటం మంచిది.

పాటర్న్: నిఫ్టీ 24,500 వద్ద అడ్డంగా దిగువకు ఏర్పడిన మద్దతు ట్రెండ్‌లైన్‌కు చేరటంతో స్వల్పకాలిక బలహీనతను సూచిస్తోంది. ప్రస్తుతం నిఫ్టీ 25, 50 రోజుల చలన సగటు వద్ద గట్టి పరీక్షను ఎదుర్కొంటోంది. సానుకూలత కోసం నిఫ్టీ 24,500 స్థాయిలకు ఎగువన నిలదొక్కుకోవాల్సి ఉంటుంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,755, 24,800
మద్దతు	24,700, 24,640

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సోమవారం | 9-9-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 163
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: షష్ఠి రా. 9.54 తదుపరి సప్తమి; నక్షత్రం: విశాఖ సా. 6.04 తదుపరి అనూరాధ; వర్జ్యం: రా.10.24-12.08; దుర్ముహూర్తం: మ.12.36-1.25, మ.3.03-3.51; అమృతఘడియలు: ఉ.8.19-10.06; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.05; సూర్యాస్తమయం: 6.18
వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బహుభాషా కోవిదుడు నలిమెల భాస్కర్‌కు కాళోజీ సాహితీ పురస్కారం



కవులు, రచయితల అభినందనలు

నేడు రవీంద్రభారతిలో అవార్డు ప్రదానం

నా బాధ్యత మరింత పెరిగింది: భాస్కర్

హైదరాబాద్/సిరిసిల్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సాహితీవేత్త, బహుభాషా కోవిదుడు, కవి, రచయిత, అనువాదకుడు నలిమెల భాస్కర్‌కు 2024కు గాను ప్రతిష్ఠాత్మక కాళోజీ సాహితీ పురస్కారం లభించింది. సోదర భాషా సాహిత్యాలకు వారధిగా, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో సాహిత్య రంగం నుంచి విశేష కృషి చేసిన డాక్టర్ నలిమెల భాస్కర్‌కు ఈ పురస్కారం దక్కడం పట్ల తెలంగాణ రచయితల వేదిక,

మిగతా 12వ పేజీలో...

పారాలింపిక్స్ కాంస్య పతక విజేత

దీప్తికి గ్రూప్-2 జాబ్

రూ.కోటి నగదు.. వరంగల్‌లో 500 గజాల స్థలం

కోచ్ నాగపురి రమేష్‌కు రూ.10 లక్షలు

హైదరాబాద్, వరంగల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పారిస్‌లో జరిగిన పారాలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన రాష్ట్ర క్రీడాకారిణి దీప్తి జీవంజిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడకు చెందిన దీప్తి.. పారాలింపిక్స్ మహిళల 400 మీటర్ల టీ20 ఈవెంట్‌లో కాంస్యం సాధించారు. ఈ నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లో సీఎం నివాసానికి వెళ్లి ముఖ్యమంత్రిని కలిశారు. దీప్తిని అభినందించిన ముఖ్యమంత్రి.. ఆమెకు గ్రూప్-2 ఉద్యోగంతోపాటు రూ.కోటి నగదు, వరంగల్‌లో 500 గజాల స్థలం ఇస్తామని ప్రకటించారు. అలాగే, దీప్తి కోచ్ నాగపురి రమేష్‌కు రూ.10 లక్షల నగదు పురస్కారాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ కె.శివసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దీప్తిని అభినందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

జర్నలిస్టులకు కొత్త పాలసీ!

అక్రిడిటేషన్, ఆరోగ్య కార్డులకు శాశ్వత పరిష్కారం

వృత్తి పరమైన గౌరవాన్ని మనమే పెంచుకోవాలి

కొన్ని పత్రికలు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నాయ్

భాష, పదప్రయోగంలో విజ్ఞత పాటించాలి

జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టు సొసైటీకి భూమి పత్రాల అందజేత కార్యక్రమంలో సీఎం రేవంత్

ఫ్యూచర్ సిటీలో ఫోర్త్ ఎస్టేట్‌కు త్వరలో స్థలాలు

మీడియా అకాడమీకి 10 కోట్లు ఇస్తామని ప్రకటన

ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చాం: పొంగులేటి



జేఎన్‌జే సొసైటీ ప్రతినిధులకు భూమి పత్రాలు అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్/రవీంద్రభారతి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ చెప్పారు. అక్రిడిటేషన్, ఆరోగ్య భద్రత కార్డులు జారీ విషయంలో శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. చిన్న, మధ్య, పెద్ద తరహా పత్రికలను గుర్తించి.. కేంద్రం, ఈసీ మార్గదర్శకాలు, రాజకీయ పార్టీల సొంత

మిగతా 11వ పేజీలో...

హైడ్రా దెబ్బకు విల్లాలు నేలకు

మల్లంపేట కత్వ చెరువులో 13 విల్లాల కూల్చివేత

చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో 18 విల్లాలు

ఐదింటిలో నివసిస్తుండడంతో కూల్చివేత వాయిదా!

సున్నం చెరువులో రెండు నాలుగంతస్తుల భవనాలు, మరో రెండు రెండంతస్తుల భవనాలు నేలమట్టం

20 రేకుల షెడ్లు, 10 గుడిసెల తొలగింపు

అమీన్‌పూర్‌లో వైసీపీ మాజీ ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి ఫాంహౌస్ ప్రహరీ, షెడ్ల కూల్చివేత

సున్నం చెరువు వద్ద ఉద్రిక్తత.. ఒంటిపై కిరోసిన్ పోసుకొని బాధితుల ఆత్మహత్యాయత్నం

మల్లంపేటలో విల్లాల కొనుగోలుదారుల ఆవేదన

ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు

'ఎన్నారై లేడీ డాన్' భూకబ్జాలు బట్టబయలు!

కత్వా చెరువులో కూల్చిన విల్లాలు ఆమె కట్టినవే

నిందితురాలిపై పోలీసు కేసులున్నా చర్యలు నిల్

కత్వ చెరువు బఫర్, ఎఫ్‌టీఎల్‌లో కట్టిన విల్లాలను కూల్చివేస్తున్న హైడ్రా సిబ్బంది



హైదరాబాద్ సిటీ/మియాపూర్/దుండిగల్/అల్లాపూర్/మాదాపూర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో చెరువుల పరిరక్షణే లక్ష్యంగా ఏర్పాటైన 'హైడ్రా' మరోసారి దూకుడు ప్రదర్శించింది. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో అక్రమంగా నిర్మించిన రూ.కోట్ల విలువైన విల్లాలను నేలమట్టం చేసింది. దుండిగల్ మునిసిపాలిటీ మల్లంపేట గ్రామ పరిధిలోని కత్వ చెరువులో శ్రీలక్ష్మీ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ నిర్మించిన 13 విల్లాలను హైడ్రా అధికారులు ఆదివారం కూల్చివేశారు. నిర్మాణ సంస్థ ఈ విల్లాలను ఒక్కో దానిని రూ.1.50 కోట్లకు

మిగతా 9వ పేజీలో...

నివాసముంటున్న ఇళ్లు కూల్చం

ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్నా పడగొట్టం

వాటిపై సర్కారే నిర్ణయం తీసుకుంటుంది

నివాసేతర, నిర్మాణంలో ఉన్న వాటిపైనే మా చర్యలు.. ఆక్రమణలు జరగకుండా చూస్తాం

హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టీకరణ

9

నిజామాబాద్ జిల్లాలోని సాత్నాల నది వరదలో చిక్కుకున్న రైతులు



ఏపీలో ఉత్తరకోస్తాకు వాయు'గండం'

బంగాళాఖాతంలో బలపడిన అల్పపీడనం

తెలంగాణలో 12 వరకు భారీ వర్షాలు

పలు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ

10

వరద బాధితులకు రెండు నెలల వేతనం

ఇవ్వనున్న ఎమ్మెల్యేలు, ఎంపీలు: దుద్దిళ్ల

గత ప్రభుత్వం నిధులు వాడింది.. యూసీ ఇవ్వలేదు

అందుకే కేంద్రం నుంచి 200 కోట్లు రాలే

వాటి కోసం అమిత్‌షాతో మాట్లాడుతున్నా

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.. ఖమ్మంలో పర్యటన

మళ్లీ వణికిన ఖమ్మం

ఉమ్మడి జిల్లాలో భారీ వర్షం.. మానుకోటలో 18 సెం.మీ.

మరోసారి కలకలం రేపిన మున్నేరు వాగు

ముంపు ప్రాంతాలకు ఐఏఎస్‌లు.. అర్ధరాత్రి ప్రజల తరలింపు

ముప్పు తప్పడంతో ఊరట.. పునరావాస కేంద్రాల్లో భట్టి

ఉమ్మడి రంగారెడ్డిలో తెగిన చెరువులు.. మునిగిన పంటలు

రాష్ట్రంలో వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి

నాగర్‌కర్నూల్ జిల్లాలో దుందుభీలో చిక్కుకున్న కారు

9 మందికి త్రుటిలో తప్పిన ప్రాణాపాయం.. సాత్నాలలో కొట్టుకుపోయి అతికష్టం మీద బయటపడ్డ రైతులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఉమ్మడి ఖమ్మం జిల్లాను వరుణుడు మరోసారి వణికించాడు.! గత వారం నాటి అనుభవం ఇంకా కళ్లముందు కదలాడుతుండగానే కంగారు పెట్టించాడు.! ముఖ్యంగా మున్నేరు మళ్లీ ముంచేసేలా కనిపించింది.! చివరకు శాంతించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. చాలా మండలాల్లో భారీ వర్షం కురిసింది. వాగులు పొంగిపొర్లడంతో చాలాచోట్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రాష్ట్రంలోనే అత్యధికంగా మహబూబాబాద్‌లో 18.25 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. తల్లాడలో 12.6, ఖమ్మం అర్బన్‌లో 11.5, అన్నపురెడ్డిపల్లిలో 9.8, రఘునాథపాలెంలో 9.2, వైరా, కొణిజర్లలో 9,

మిగతా 10వ పేజీలో...

ఆర్ అండ్ బీలోకి ఐఐటియన్లు

ఏఈఈలుగా ఎంపికైన వారిలో ఐదుగురు ఐఐటీ పట్టభద్రులు

10

నిట్, బిట్స్, ఐఐఐటీల నుంచీ..

హర్షం వ్యక్తం చేస్తున్న అధికారులు

ఉద్యోగాల్లో ఎంతమంది కొనసాగుతారన్న సందేహాలు

ఏసీబీ చీఫ్‌గా విజయ్ కుమార్

హైదరాబాద్ సీపీగా సీవీ ఆనంద్

విజిలెన్స్ డీజీగా కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

పలువురికి అదనపు బాధ్యతలు

వినాయక చవితి సమయంలో ఊహించని రీతిలో బదిలీలు

9



విజయ్ కుమార్

ఆదాయంతో పోలిస్తే శివబాలకృష్ణ ఆస్తులు 350%

214 ఆస్తుల్ని అటాచ్ చేసిన ఏసీబీ.. కీలక దశకు గొర్రెల కేసు

రెండు కేసుల్లోనూ డ్రాఫ్ట్ చార్జిషీట్ సిద్ధం

9

అవినీతి కేసుల్లో ప్రతి 48 గంటలకు ఒకరి పట్టివేత!

8 నెలల్లో 145 కేసులు.. టాప్-3లో రెవెన్యూ, హోం, మునిసిపల్

ఐఏఎస్, ఐపీఎస్‌లపైనా ఫిర్యాదులు.. వెల్లడిస్తున్న ఏసీబీ గణాంకాలు

నిలిచిన వైద్య విద్య ప్రవేశాల ప్రక్రియ!

హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో అప్పీల్‌కు నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం

12

అనుకూలంగా తీర్పు వస్తే వెంటనే కౌన్సెలింగ్

వ్యతిరేకంగా వస్తే మరింత ఆలస్యం



నక్సల్స్‌పై ఆఖరి పోరాటం

8

సన్నాహాలు ముమ్మరం చేసిన కేంద్రం

ఛత్తీస్‌గఢ్‌కు అదనంగా 4 వేల బలగాలు

4 సీఆర్పీఎఫ్ బెటాలియన్ల తరలింపు

ఆపరేషన్ ప్రహార్‌లో పుంజుకోనున్న వేగం

మళ్లీ భగ్గుమన్న మణిపూర్!

దాడులు, ఘర్షణల్లో ఆరుగురి మృతి

గవర్నర్‌ను కలిసిన సీఎం బీరేన్ సింగ్

రాష్ట్ర సర్కారుకు తగిన అధికారాలు ఇవ్వాలని కేంద్రానికి సీఎం విజ్ఞప్తి

8

సైబర్ కేటుగాళ్లు

ఫోన్‌లో 'డు నాట్ డిస్టర్బ్' ఆప్షన్ ఉన్నా సరే.! గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్ వస్తుంది!! "మేం కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ నుంచి ఫోన్ చేస్తున్నాం.. మీ పేరు, ఆధార్ నంబర్‌తో ఒక పార్సిల్ వచ్చింది. దాంట్లో డ్రగ్స్ ఉన్నాయి. కొద్దిసేపట్లో మిమ్మల్ని అరెస్ట్ చేస్తాం" అని అటువైపు నుంచి వినిపిస్తుంది! లేదా.. పార్ట్ టైమ్ ఉద్యోగాలనో, ప్రభుత్వ పథకాల పేరుతోనో.. ఆశపెడతారు! "అర్జెంటుగా కేవైసీ పూర్తి చేయకపోతే మీ సిమ్ లేదా బ్యాంక్ ఖాతా బ్లాక్ అయిపోతుంది. కాబట్టి వెంటనే మేం పంపించిన లింక్ ఓపెన్ చేసి మీ వివరాలివ్వండి" అని భయపెడతారు! మార్కెట్లో పెట్టుబడులు పెడితే భారీ లాభాలంటూ ప్రలోభపెడతారు. ఆలోచించుకోవడానికి సమయం ఇవ్వరు. డబ్బు కట్టే దాకా హడావుడి పెట్టేస్తారు. వారు ఇప్పిస్తామనే డబ్బుకు ఆశపడో.. బెదిరింపులకు భయపడో.. వారు చెప్పినమాట విన్నా, వారు పంపిన లింకులను తెరిచినా.. అంతే సంగతులు! మనిషి బలహీనతల్లో అత్యంత బలమైన.. ఆశ, భయం అనే రెండు భావోద్వేగాలే పెట్టుబడిగా సైబర్ కేటుగాళ్లు నడుపుతున్న ఫేక్ కాల్స్ దందా ఇది. రాష్ట్రంలో ఇలాంటి మోసగాళ్ల బారిన పడుతున్న బాధితుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది! ఈ తరహా మోసాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాలు నేటి నుంచి.

డ్రగ్స్ పార్సిళ్లు, పెట్టుబడులు, ప్రభుత్వ పథకాలు, కేవైసీ.. అంటూ **ముంచుతున్న మోసగాళ్లు**



సిమ్ బ్లాక్ అయిపోతుందని భయపెట్టి దోపిడీ!

ఒంటరి మగాళ్లకు వలపు వల.. న్యూడ్‌కాల్స్‌తో లూటీ

రాష్ట్రంలో పెరుగుతున్న నేరాలు

రూ.లక్షలు, కోట్ల మేర.. పోగొట్టుకుంటున్న ప్రజలు

బాధితుల్లో ఎక్కువ మంది బాగా చదువుకున్నవారే

ఆయనో రిటైర్డ్ ఉద్యోగి. కొద్దిరోజుల క్రితం ఆయనకు ఒక ఫోన్ కాల్ వచ్చింది. అవతలివైపు ఒక వ్యక్తి.. తాను ముంబై క్రైమ్ బ్రాంచ్ నుంచి ఫోన్ చేస్తున్నట్టు చెప్పాడు. "మీ ఆధార్ నంబర్‌తో అనుసంధానమై ఉన్న మూడు బ్యాంకు అకౌంట్ల నుంచి.. దావూద్ ఇబ్రహీం ఖాతాలకు డబ్బు బదిలీ అయింది. మీపై అరెస్ట్ వారంట్ జారీ అయింది" అని సీరియస్‌గా చెప్పాడు! "నేను చెప్పే దాకా మీరు ఉన్నచోటు నుంచి కదలొద్దు. ఎవరికీ ఫోన్ చేయొద్దు" అని హెచ్చరించాడు. అలా ఆ పెద్దాయన్ని భయపెట్టి, మానసికంగా హింసించి.. అసలు ఆలోచించుకోలేని పరిస్థితికి తీసుకెళ్లిపోయి పలు దఫాలుగా రూ.20 లక్షల దాకా డబ్బులు తమ ఖాతాల్లో వేయించుకున్నారు.

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలో అత్యంత కీలక ప్రాంతానికి పోలీసు కమిషనర్‌గా ఉన్న అధికారి బంధువుకు.. సైబర్ నేరగాళ్లు కాల్ చేసి.. ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్‌తో లక్షల్లో ఆదాయం అంటూ వలవేసి పలు దఫాలుగా రూ.16లక్షలు కాజేశారు. ఇదే తరహాలో మరో రిటైర్డ్ ఉద్యోగి వద్ద రూ.13.5 కోట్లు.. ఇంకో రిటైర్డ్ ఇంజనీర్ వద్ద రూ.5 కోట్లు దండుకున్నారు. మరో కేసులో హైదరాబాద్‌కు చెందిన మహిళా పోలీసు అధికారి దగ్గరి

మిగతా 8వ పేజీలో...



మహాస్వప్న తెలుగు కవిత్వం పైన వేసిన ముద్ర సామాన్యమైనది కాదు. దిగంబర కవిత్వ సంకలనాలలో అతను రాసిన కవితలు ఆరంటే ఆరే! ఆ ఆరు కవితలతోనే కవిగా చిరస్థాయి నందుకున్నాడు. ఒక లేబిల్‌కో బ్రాండ్‌కో కట్టుబడే కవిత్వం కాదు అతడి కవిత్వం. మహాస్వప్నని ఏ ఇతర కవి తోనూ పోల్చలేం. పదునైన వాక్యాలూ, అంతే తీవ్రమైన భావజాలం అతడి కవిత్వంలో కానవచ్చే సాధారణ లేదా విశిష్ట గుణం!

దిగంబర కవిగా రూపు దాల్చకముందు అతడి నామధేయం కమ్మిశెట్టి వేంకటేశ్వరరావు. ఆ పేరు తోనే అతడి ఏకైక కవితాసంపుటి 'అగ్ని శిఖలు – మంచు జడులు' వెలువడింది. ఆ తర్వాత దిగంబర కవిగా రూపాంతరం చెందాడు. 'దిక్'లుగా

చరిత్ర నిద్రా సముద్రంపై మహాస్వప్నం!

పిలువబడిన ఆ కవితలతో మహాస్వప్న మహోన్నత శిఖరమై నిలిచాడు. మహాస్వప్న 'అగ్ని శిఖలు – మంచు జడులు', దిగంబర కవితలకి మధ్య 'రాత్రి' కవితా సంకలనం లోని అతని కవితలు దిగంబర కవిత్వానికి పూర్వ రంగంగా నిలుస్తాయి. ఇదే సూత్రీకరణ నగ్నముని అనబడు మానేపల్లి హృషి కేశవరావుకి కూడా వర్తిస్తుంది. దిగంబర కవిత్వానికి కథానాయకుడూ, 'రాత్రి' కవితా సంకలనానికి కర్త, కర్మ, క్రియ నగ్నమునే!

కమ్యూనిస్ట్ మానిఫెస్టోని శ్రీశ్రీ ఎలాగైతే కవిత్వంగా మలిచాడో అలాగే మహాస్వప్న కూడా దిగంబర కవిత్వం ఎజెండాని అద్భుతమైన కవితగా మలిచాడు. ఆ కవిత శీర్షిక 'గ్లానిర్భవతి భారత'. ఆ కవితలో "మానవత రెండు కళ్ళు మూసుకపోయినప్పుడు/ విప్పుకుంటున్న మూడో కన్నునై/ కాలం వాయులీనం మీద కమానునై/ చరిత్ర నిద్రా సముద్రం మీద తుఫానునై/ నేను వస్తున్నాను దిగంబర కవిని/ రాత్రి ఉదయిస్తున్న రవిని" ... "రక్త ధునులు గడ్డకట్టి/ జీవనదులింకి/ మానవత మసిపాతలా మారిపోయినప్పుడు/ మాసిపోయినప్పుడు/ నేను వస్తున్నాను దిగంబర కవిని/ స్తంభించిన కవితా స్తంభం బ్రద్దలై పుట్టుకొస్తున్న ఉగ్రనగ్న నరకేసరిని" – అంటూ దిగంబర కవి రాకడ సమయాన్నీ, సందర్భాన్నీ, దిగంబర కవిత్వం పోకడనీ స్పష్టం చేశాడు మహాస్వప్న.

> **వేళ్ళ మీద లెక్కబెట్టగలిగినన్ని కవితలే రాసి వుంటే ఉండొచ్చు గాక! తదనంతర కాలంలో తన ఆకాంక్షలూ ఆశయాలూ కేవలం భ్రమలుగా తేలిపోయాయని, తానొక భగ్నస్వప్నమై మిగిలానని అతడు పశ్చాత్తాప పడితే పడి ఉండొచ్చు గాక! బ్రతుకు వృథా, కవిత్వం వృథా అనే వ్యాకులతకి లోనై అజ్ఞాతాన్ని వరిస్తే వరించి ఉండొచ్చు గాక! – ఐనా కూడా, దిగంబర కవుల్లోనే కాదు, ఏ ఇతర కవి సమూహాలలోనైనా, అప్పుడైనా ఇప్పుడైనా ఎన్నదగిన ప్రథమ శ్రేణి కవి మహాస్వప్న!**

దిగంబర కవిత్వ ఆవిర్భావ సన్నివేశాన్ని స్మరించినప్పుడు యూరప్‌లో జెనీవా కేంద్రంగా 1916, 1923 ప్రాంతాల్లో పరిఢవిల్లిన 'డాడాయిజం' గుర్తుకు రాక మానదు. మొదటి ప్రపంచ యుద్ధ పర్యవసానంగా అన్ని విలువల్నీ, సంస్కారాల్నీ, సభ్యతల్నీ తిరస్కరిస్తూ వెల్లువెత్తిన ఉద్యమం అది. హ్యూగో బాల్ దాన్ని ముందుండి నడిపించాడు. ఒక్క కవిత్వం లోనే కాకుండా చిత్రకళ, సంగీతం లాంటి ఇతర కళల్ని కూడా డాడాయిజం ప్రభావితం చేసింది. డాడాయిస్టులు వాళ్ళ కవితల్ని 'డాడా' అన్నారు. మన దిగంబరులు 'దిక్'లన్నారు! అక్కడ హ్యూగో బాల్ నిర్వహించిన పాత్రని ఇక్కడ నగ్నముని నిర్వహించాడు.

1960వ దశకం రాజకీయ భ్రష్టత్వం, విలువల పతనం, అరాచకత్వం నిస్సిగ్గుగా బట్టబయలైన సంధికాలం! తక్షణ చర్యగా దిగంబర కవిత్వం తెలుగునాట మొదలైంది. ఆ పరిణామ క్రమంలో నగ్నముని, మహాస్వప్న లాంటి గొప్ప కవులు ఆవిర్భవించారు. దిగంబర కవిత్వం ఒక చారిత్రక సందర్భమే కాదు. చారిత్రక అవసరం కూడా. దిగంబర కవిత్వం కూడా డాడాయిజం మాదిరి కుళ్ళిన సమాజానికి షాక్ ట్రీట్మెంట్‌గా మొదలైన కవిత్వోద్యమమే! విరసం పుట్టుకకి బీజం పడింది కూడా దిగంబర కవిత్వం తోనే!

'నట సామ్రాట్' అనే కవితలో తనని తాను ఇలా పరిచయం చేసుకుంటాడు మహాస్వప్న: "పాతికేళ్ల నాడు ఈ కల/ కళ్ళు తెరచింది నెల్లూరు జిల్లా లింగసముద్రంలో/ కావలి, హైదరాబాద్ లోని ఆకాశాన్ని, భూమినీ చదువుకున్నాడు. .... ఈ ప్రపంచం వేసుకున్న ముసుగుని చీల్చడానికే పుట్టానంటాడు." అదే కవితలో ఇంకా యిలా అంటాడు– "మహాశయా/ తెల్లగా తెల్లవారింది/ నాటకానికి తెర జారింది/ ప్రపంచంలా పరచుకున్న/ జీవితం మీద/ నగ్న సూర్యోదయమైంది/ నీ పాత్ర చిలుం పట్టింది తోముకో నిజం లాగా/ ధ్వజం లాగా నిటారుగా లే/ భయం వీడి నగ్నంగా బజార్లోకి రా!" అని.

మహాస్వప్నది తనదైన విస్పష్ట గళం. తన కాలం కంటే ముందు నడిచాడు. 2024ల నాటి ఆధునిక కవిత్వాన్ని 1960 ల్లోనే వినిపించిన ద్రష్ట మహాస్వప్న! 'హటాత్తుగా బట్టలన్నీ విప్పేసి' అనే కవితలో ఇలా అంటాడు: "ట్రాఫిక్ బంద్/ సందులు గొందులకి జ్వరాలు/ బజార్లు బజార్లకే మూర్ఛలు/ అంతా నిశ్శబ్దం/ నా దగ్గిరకొకడైనా రాడు/ నేనంటే నగరానికి మహాభయం/ నాకు తెలుసు మీరు నన్ను చూళ్ళేరని/ నాకు తెలుసు మీరు నన్ను వినలేరని."

గాంధీ మహాత్ముడిని స్మరిస్తూ, 'మేం మనుషులం కాదు ఇంకేదో పేరుంది మాకు' అనే కవితలో తన ఆగ్రహాన్ని ఇలా ప్రకటిస్తున్నాడు: "దగాలు వంచనలు కుహనాసత్యాలు/ జరా రుజా దురాక్రమణలో నిజరూపాల్ని కోల్పోయిన మానవజాతి/ వినిపించే నాగరికతా సిఫిలిస్సంగీతం/ ఎంత భ్రమపడ్డావ్ మా దుస్తుల్ని చూసి/ ఎంత శ్రమపడ్డావ్ మమ్మల్ని నమ్మి/ మేం మనుషులం కాదు ఇంకేదో పేరుంది మాకు/ ఇన్ని కోట్ల గాడ్సేల ఘాతుక హస్తాల నడుమ/ నలువైపుల హోరుమని విరుచుకు పడుతున్న చీకటి సముద్రాల నడుమ/ నిశ్చలంగా వెలిగే నీ చిరునవ్వు... / బాపూ, మోసపోలేదు కదా నువ్వు"

మానవుడి అస్తిత్వ వేదనని అతడు పలికించిన తీరు అబ్బురపరుస్తుంది. తప్పిపోయిన మనిషి ఆత్మ హాహాకారాన్ని 'ఆపండి ఆర్కెస్ట్రాని – ఆర్పండి కాగాడాల్ని' అనే కవితలో పతాక స్థాయికి చేరిన ఫ్రీక్వెన్సీలో వినిపించాడు: "నేను పుట్టకముందే/ మిట్ట మధ్యాహ్నం మండుటెండలో/ మార్కెట్లో పెట్టి అమ్మారు శిరాన్ని ఖండించి/... .../ నిర్జీవంగా/ నిస్సహాయంగా/ వొరిగిపోయాను ఈ ఫుట్‌పాత్ మీద/ ఆపండి ఆర్కెస్ట్రాని/ ఆర్పండి కాగడాల్ని!// ఇంక మోయలేను ఈ దేవుళ్ళనీ ఉద్గ్రంథాల్నీ/ ఇంక మోయలేను ఈ జైళ్ళనీ సంకెళ్ళనీ శాసనాల్నీ/ ఇంక మోయలేను ఈ యుద్ధాల్నీ బీటలెత్తిన చరిత్రనీ/... .../ చెప్పు/ ఇప్పుడైనా నిజం చెప్పు/ పోనీ దయుంచి/ ఈ దిక్కుమాలిన శవం మీద ఆకాశాన్ని కప్పు" అంటూ! అలాగే, 'మురిగిన సూర్యుణ్ణి నంజుకుంటూ మృత్యువుని కాస్త కాస్తగా కొరుక్కుతిన్నాను' కవితలో ఆధునిక మానవ జీవన బీభత్సాన్ని, భయద జీవన మృత్యు సంగీతాన్ని విరచించాడు మహాస్వప్న. "వెన్నెల మీద వుమ్మేసి చంద్రుణ్ణి నక్షత్రాల్నీ/ గ్రహాల్నీ రాళ్ళతో కొట్టాను/ భూగోళాన్ని శిశ్నశిఖరాగ్రం మీద నిలబెట్టాను/ చెట్ల గుబురుల్లో గూబలా తీతువులా కీచురాయిలా/ గీ పెట్టి భయపెట్టింది నేనే/ పాతాళవాణిలో భూతాలు పాడిన గీతాల్ని ప్రసారం చేసింది నేనే/ భగ భగ మంటల్లో నగరం తగలబడి పోతున్నట్టు/ నిర్వికల్ప సమాధిలో నిదర్శించి నిర్భరానందంలో తాండవం చేసింది నేనే" అంటాడు.

వేళ్ళ మీద లెక్కబెట్టగలిగినన్ని కవితలే రాసి వుంటే ఉండొచ్చు గాక! తదనంతర కాలంలో తన ఆకాంక్షలూ ఆశయాలూ కేవలం భ్రమలుగా తేలిపోయాయని, తానొక భగ్నస్వప్నమై మిగిలానని అతడు పశ్చాత్తాప పడితే పడి ఉండొచ్చు గాక! బ్రతుకు వృథా, కవిత్వం వృథా అనే వ్యాకులతకి లోనై అజ్ఞాతాన్ని వరిస్తే వరించి ఉండొచ్చు గాక! – ఐనా కూడా, దిగంబర కవుల్లోనే కాదు, ఏ ఇతర కవి సమూహాలలోనైనా, అప్పుడైనా ఇప్పుడైనా ఎన్నదగిన ప్రథమ శ్రేణి కవి మహాస్వప్న!

■ రవూఫ్

raoufpoettelugu@gmail.com

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

కాళోజీ జయంతి వేడుక

పద్మవిభూషణ్ కాళోజీ 110 జయంతి వేడుకలు తెలంగాణ సాహిత్య అకాడమి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9 ఉదయం 10.30 గంటలకు రవీంద్ర భారతి మినీ కాన్ఫరెన్స్ హాల్, హైదరాబాద్‌లో జరుగుతాయి. సభాధ్యక్షులు నామోజు బాలాచారి; ముఖ్య అతిథి ఎ. వాణీప్రసాద్; విశిష్ట అతిథి అలేఖ్య పుంజాల, గౌరవ అతిథి తిప్పర్తి యాదయ్య; ఆత్మీయ అతిథి బైసా దేవదాసు. 'కాళోజీ జీవితం – రచనలు' అంశంపై జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ నల్లగుంట్ల యాదగిరి రావు ప్రధాన ప్రసంగం చేస్తారు. కవి సమ్మేళనం ఉంటుంది.

సోమశిల తిరుపాల్

'కరీంనగర్ కథలు' పరిచయ సభ

రంగినేని సుజాతా మోహన్ రావు ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్, సిరిసిల్ల ఆధ్వర్యంలో 'కరీంనగర్ కథలు' పుస్తక పరిచయ సభ సెప్టెంబర్ 14 ఉదయం 10.30 నిమిషాలకు రంగినేని ట్రస్ట్, కరీంనగర్ రోడ్, సిరిసిల్లలో జరుగుతుంది. సభాధ్యక్షులు రంగినేని మోహన్ నావు; ముఖ్య అతిథి సి. మృణాళిని; విశిష్ట అతిథి అల్లం రాజయ్య; వక్త సి. కాశీం. కథా సంకలనం ప్రస్తావన నలిమెల భాస్కర్, జూకంటి జగన్నాథం. వివరాలకు: 92906 87853.

రంగినేని నవీన్ కుమార్

గూడురు సీతారాం కథా పురస్కారం


మానేరు రచయితల సంఘం, గూడూరి సీతారాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గూడూరి సీతారాం కథా పురస్కారం 2023 ప్రదాన సభ సెప్టెంబర్ 14 సాయంత్రం 4 గంటలకు డా. సినారె విజ్ఞాన మందిరం, జిల్లా గ్రంథాలయం, సిరిసిల్లలో జరుగుతుంది. సూర్యా ధనంజయ్ 'ఝూళి' గోర్ బంజారా సాకి, పిన్నంశెట్టి కిషన్ 'మా లేంబాళవాటిక కథలు' పుస్తకాలకు రచయితలు పురస్కారం స్వీకరిస్తారు. సభాధ్యక్షులు టి.వి. నారాయణ; ముఖ్య అతిథులు నలిమెల భాస్కర్, జూకంటి జగన్నాథం; పురస్కార ప్రదాత గూడూరి వేణు.

గూడురి ప్రవీణ్

వర్గీకరణ సంఘీభావ కవిత్వం

ఎస్సీ ఎస్టీల్లో వెనకబడ్డ కులాలు, జాతులకు విద్య ఉద్యోగాల్లో ప్రాధాన్యతతో కూడిన పంపిణీ న్యాయం కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారముందని సుప్రీమ్ కోర్టు ఇటీవల తీర్పులో స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణకు సంఘీభావంగా వచన, పద్య కవితలను అక్టోబర్ 15లోగా చిరునామా: అడ్రస్: ప్లాట్ – 297, రోడ్ – 21, సెక్రటేరియట్ కాలనీ, సియుసి పోస్ట్, గచ్చిబౌలి, హైదరాబాద్ – 500046 కు పంపగోరుతున్నాం. వాట్సప్ నంబర్: 9441091305. ఈమెయిల్: joopakasubadra@gmail.com

జూపాక సుభద్ర



ముఖం మీదొక దిగులు అల
ఎండ పొడలా కదిలినప్పుడు
మెదడు తడితో కలిసినప్పుడు
ఉదాసీనత గోడనంటిన సీలలా నీలో ఇమిడి ఉంటుంది
జేవురు రంగు ఆకాశం నీ కంటి జీరలో చేరి ఉంటుంది

అప్పుడు
తూచలేని భయాలెన్నో
నీ గాలాడని ప్రపంచాన్ని చుట్టి ఉంటాయి
అబద్ధాల వింత పొగలు మసి రంగులో తిరుగుతుంటాయి

బతుకనే ఖనిజం కోసం
ఎన్ని లోయల్ని తవ్వాలో తెలియక
నువ్వు తికమకలాడినప్పుడు
గుబులు దుంగల మీద కాలుంచి తూలినప్పుడు
పరిమితి లేని వసంతం లాంటి ప్రపంచమేదో
నీ కోసం ఉండకపోదని అనుకొని ఉంటావు
ఉందో లేదో తెలియని అలాంటి లోకం కోసం
అరచేతుల దిండ్ల మీద తలుంచి చూసి ఉంటావు

ఏ దిగులూ నిరంతరం కాదు కనుక
అది విడిదింటికెళ్ళినట్టు వెళ్ళిపోయాక
మిగిలిన ఋతువుల్లో వసంతాన్ని చూడటమే
మనిషి పని

■ రఘు

✆ 96761 44904

మీరు నిర్వహించే ద్వైమాసిక కవిత్వ పత్రిక 'కవిసంధ్య' యాభై సంచికల ప్రయాణాన్ని పూర్తి చేసుకుంది. ఈ పత్రిక పెట్టాలన్న ఆలోచన ఎలా వచ్చింది?

2014లో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణ విడిపోయింది. నేను 2015 డిసెంబర్‌లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి పదవీ విరమణ చేశాను. మీరన్నట్టు అప్పటికి రెండు దశాబ్దాలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాద్‌లో 'కవిసంధ్య' సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చింది. రాష్ట్ర విభజన తర్వాత కవిసంధ్య తన కార్యక్షేత్రాన్ని నా పుట్టిన ఊరైన యానాంకు మార్చుకుంది. యానాంలో కవిసంధ్య తొలి సాహిత్య కార్యక్రమంగా దుర్ముఖినామ ఉగాది ఉత్సవాలు నిర్వహించ తలపెట్టింది. ఈ సందర్భంగా 'కవిసంధ్య' పేరుతో ఒక కవిత్వ బులెటిన్ తెస్తే ఎలా వుంటుందనే పురుగు లాంటి ఆలోచన బుర్రలో కలిగింది. నా ఆలోచనను యానాం కవిమిత్రుల ముందుంచాను. అప్పటికి ఉగాది రెండు మూడు రోజులే వుంది. మా యానాం మిత్రులు

'కవిసంధ్య' నిర్వహణలో ఎక్కడా ప్రయాస లేదు, అంతా ఆనందమే!

శిఖామణి

3? మూడు ప్రశ్నలు



పెద్దగా వుత్సాహం చూపకపోగా నిరుత్సాహ పరిచారు. ఒకటి రెండు రోజులకు మించి సమయంలేదు– పైగా నువ్వు హైదరాబాద్‌లో, కార్యక్రమం యానాంలో, ఇంతతక్కువ వ్యవధిలో బులెటిన్ సాధ్యం కాదని తేల్చేశారు. వారికి ఒక ఉపాయం చెప్పి ఆ విధంగా ముందుకు పొమ్మన్నాను. ఫలితంగా 2016 ఏప్రిల్ 8న దుర్ముఖి నామ ఉగాది వేడుకల సందర్భంగా 'కవిసంధ్య' ఏప్రిల్–మే ద్వైమాసిక సంచికగా యుగకర్త కందుకూరి వీరేశలింగం పంతులు ముఖ చిత్రంతో 16 పేజీల కవిత్వ పత్రికగా వెలువడింది. ఇంతకీ నేను చెప్పిన ఉపాయమల్లా "సమయం లేదంటున్నారు కనుక యానాం కవుల కవితలు తలా ఒకటి సేక రించండి, యానాం వచ్చాక మిగతా సంగతి నేను చూసుకుంటాను" అని అన్నాను. ఆ రకంగా మొదటి సంచిక యానాం కవుల సంచికగా వెలువడింది. ఉగాది మరుసటి రోజున అర్ట్ కాలేజీలో భాస్కర రెడ్డిగారి అధ్యక్షతన పత్రిక కొనసాగింపుపై సమావేశం జరిగింది. పత్రిక నిర్వహణపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. వాటి సారాంశం: రచనలు వస్తాయి – చందాలు రావు, పత్రిక అంటే ఒక కార్యాలయం, చిన్నపాటి సిబ్బంది అవసరం; మూలనిధి ఎలా? కొసమెరుపు: సంపాదకుడు హైదరాబాద్‌లో, పత్రికా నిర్వహణ యానాంలో అని సవాలక్ష సందేహాలు, ప్రశ్నలూ... అన్నిటికీ సర్దుబాటు సమాధానాలు

> **ఒక కవి గారిని పత్రికకు రచన అడిగితే మీరు అడగవలసిన పద్ధతిలో అడగలేదంటాడు. మరొక కవి ఇన్ని సంచికల్లో నా రచన ఒక్కటీ అచ్చు కాలేదంటాడు, పత్రికలకు రచనలు పంపడం రచయితల బాధ్యత కాదా! సంపాదకులు బొట్టుపెట్టి అడగాలా? భారతి పత్రిక చలానికి తిప్పి పంపిన కథ, ఆయన భారతికి అడిగితే పంపింది కాదని మన కవులు, రచయితలు ఎప్పటికి గుర్తెరుగుతారో.**

చెప్పి, మొదటి మూడు సంచికలు నా ఖర్చుతో తెస్తాను, నాలుగో సంచిక నాటికి పరిస్థితి చూద్దాం అన్నాను. నాలుగో సంచిక ఖర్చు నేను భరిస్తాను అన్నాడు మధునాపంతుల. ఏమనుకున్నాడో ముమ్మిడి చిన్నారి జేబులోంచి అయిదు వందలనోటు తీసి అందించారు. తొలి, రెండు, మూడు సంచికలు యానాం ఎక్సెల్ నెట్ సెంటర్‌లో మిత్రుడు సత్తిబాబుగారు లే అవుట్ చేశారు. ఇదీ కవిసంధ్య తొలి అడుగు. ఇప్పుడు 50వ మైలు రాయికి చేరింది.

ఈ కాలంలో కవిత్వమే ప్రధానంగా పత్రిక నడపటం ఎలాంటి పని అని అడిగితే ఏం చెబుతారు?

ఇప్పుడు అన్ని పత్రికలూ కవితలకు చోటు తగ్గించే ధోరణితో ఉన్నాయి. దాంతో కవులకు స్కేళ్లు కొనుక్కోవడం తప్పటం లేదు. కవిత్వానికి స్థల నిర్దేశం చేయడం పోలీసింగ్ లాంటిది. జీవితానికి మల్లే కవిత్వానికి పోలీసింగ్ మంచిది కాదు. గతంలో, వేకువ, కంజిర, సంతకాలు, జముకు, చైతన్య కవిత వంటి పత్రికలు వచ్చి ఆగిపోయాయి. 'కవితా!' పత్రిక కొనసాగుతుంది. అందుకే ఇప్పుడు కవిత్వానికి ఒక పత్రిక చాలా మంచి పని, అవసరమైన పని అని చెప్తాను.

సన్నాహక సభలో మిత్రులు అన్నట్టు రచనలు వచ్చినంతగా చందాలు రావన్నది అనుభవం మీద తెలిసింది. తొలి సంవత్సరంలో తిరుపతి సాహితీ మిత్రులు ఇచ్చిన ప్రోత్సాహం మరువ లేనిది. రచనలు అడిగినంత చనువుగా చందాలు, రెన్యువల్స్ కూడా అడగలేక పోయాను. ఒక కవి గారిని పత్రికకు రచన అడిగితే మీరు అడగవలసిన పద్ధతిలో అడగ లేదంటాడు. మరొక కవి ఇన్ని సంచికల్లో నా రచన ఒక్కటీ అచ్చు కాలేదంటాడు, పత్రికలకు రచనలు పంపడం రచయితల బాధ్యత కాదా! సంపాదకులు బొట్టుపెట్టి అడగాలా? భారతి పత్రిక చలానికి తిప్పి పంపిన కథ, ఆయన భారతికి అడిగితే పంపింది కాదని మన కవులు, రచయితలు ఎప్పటికి గుర్తెరుగుతారో.

ఇక ప్రయాస అంటారా... పత్రిక తయారీ హైదరాబాద్‌లో... ప్రింటింగ్ విజయవాడలో... పోస్టింగ్ యానాంలో... ఒక అరడజను మిత్రులు మా అన్నయ్య దుర్గా ప్రసాద్, మా మేనబావ ఆదినారాయణతో కలుపుకుని కవిసంధ్య ఆఫీసులో నేలమీద కూచుని పత్రికలను పోస్టింగ్‌కు సిద్ధంచేసేవాళ్ళం. అది ఒక కుటుంబ కార్యక్రమంలా సాగేది. ఒకసారి విజయవాడ నాగేంద్ర ప్రెస్‌లో కవిసంధ్య పత్రికల కట్టలు వున్న సంచిని ఎత్తబోతే నడుం కరుక్కుమంది. అది చూసి నాగేంద్ర ప్రెస్ పద్మగారు ఎందుకీ ప్రయాస, ఎక్కడి రేట్లు అక్కడే వుంటాయి. శుభ్రంగా హైదరాబాద్‌లో అచ్చేసి, అక్కడే పోస్ట్ చేసుకోమని హితవు పలికితే... ఇక అప్పట్నుండీ అన్నీ హైదరాబాద్‌లో... కరోనాలో అది అనివార్యం కూడా అయింది. నాకు కవిసంధ్య నిర్వహణ పత్రికలను మోయడం మా మనవడు విరాంశ్‌ను ఎత్తుకున్నంత సంతోషం. ఇది ఆనందమే కాని ప్రయాస కాదు. ఎందుకంటే ఇష్టమైన పని కష్టమనిపించదు కనక.



'కవి సంధ్య' మొదటి సంచిక



50వ సంచిక

ఈ యాభై సంచికల పనిలో మీరు మరిచిపోలేని జ్ఞాపకాలు, సన్నివేశాలు? పత్రిక భవిష్యత్తు గురించి మీ ఆలోచనలు?

చాలానే వున్నాయి. రెండు మూడు చెబుతాను. పత్రిక ప్రారంభించాక కొత్తలో ప్రముఖ రచయిత్రి, నా కవిత్వాభిమాని అబ్బూరి ఛాయాదేవిగారు పదివేల రూపాయలు చెక్కు పంపించారు. తీరాచూస్తే అది కవిసంధ్య పేరు మీద వుంది. అప్పటికి కవి సంధ్యకు ఇంకా బ్యాంకు అకౌంట్ తెరవలేదు. అదే విషయం ఆమెకు చెబితే నా పేరు మీద మరొక చెక్కు పంపారు. కవిసంధ్య పేరుమీద వున్న చెక్కును తిరిగి మీకు పంపిస్తాను అంటే, వద్దు అకౌంట్ తెరిచాక అది కూడా బ్యాంకులో వేసుకోండి అన్నారు ఛాయమ్మ గారు అమ్మ మనసుతో. పేర్లు చెప్పడానికి ఇష్టపడని అజ్ఞాత సౌజన్యమూర్తులు మరికొందరు కవిసంధ్యకు వున్నారు.

నాకు కవిగా పదుల సంఖ్యలో చిన్నా పెద్దా పురస్కారాలు వచ్చాయి. అయితే ప్రముఖ పద్యకవి అనుమాండ్ల భూమయ్యగారు ఇటీవల తాముయిచ్చే పద్యకవి సత్కార సభలో కవిసంధ్య పత్రికా సంపాదకుడిగా నన్ను సత్కరించడం కవిసంధ్యకు, సంపాదకుడిగా నాకు దక్కిన తొలి సత్కారం.

ఇక భవిష్యత్తు ఆలోచనలు అంటారా... కవిసంధ్య 50 సంచికలను మనసు ఫౌండేషన్ రాయుడుగారి సౌజన్యంతో డిజిటలైజేషన్ చేసి భవిష్యత్తరాలకోసం భద్రపరచాలనే ఆలోచన వుంది. ఆన్‌లైన్ పత్రికగా తెచ్చే ఆలోచన వుంది. వచన కవిత్వం త్వరలో వందేళ్లు పూర్తి చేసుకోబోతున్న తరుణంలో 'వందేళ్ల వచన కవిత' పేరుతో ఒక బృహత్ సంకలనం తెచ్చే ఆలోచన వుంది. పత్రికలో ఇపుడున్న శీర్షికలతో పాటు కవుల కవిత్వానుభవాలు, మన అనువాదకులు, నచ్చిన పుస్తకం వంటి శీర్షికలు ప్రవేశపెట్టే ఆలోచన వుంది.


(సెప్టెంబరు 14న హైదరాబాద్ రవీంద్రభారతిలో 'కవిసంధ్య' యాభయ్యవ స్వర్ణోత్సవ సంచిక ఆవిష్కరణ)

✆ 98482 02526

నా మొదటి పుస్తకం

నేను ప్రచురించిన, నా పేరుతో వచ్చిన మొదటి పుస్తకం, సాహిత్యానికి సంబంధించిన పుస్తకం 'అతడు – ఆమె: మనం' అనే సాహిత్య విమర్శ పుస్తకం. ఆ పుస్తక రచన, ప్రచురణ అన్నీ ఆ రోజుల్లో అనుకోకుండా జరిగి పోయాయి. ఆ పుస్తకం 1983లో ప్రచురించాను. 1981, 82 సంవత్సరాలలో ఆంధ్రజ్యోతిలో ఉప్పల లక్ష్మణరావు ఆత్మకథ 'బతుకు పుస్తకం' ధారావాహికంగా ప్రచురించారు. అందులో ఆయన తన నవల 'అతడు – ఆమె' గురించి నిరాశా జనకంగా రాశారు. ఆ పుస్తకానికి సరైన సమీక్షలు, విమర్శలు రాలేదని, సరైన చర్చ జరగలేదనీ దిగులు పడ్డారు.

మొదటిసారి బిడ్డను చేతిలోకి తీసుకున్న అనుభూతి! – ఓల్గా



82లో 'బతుకు పుస్తకం' పూర్తయ్యాక నేను కొందరు మిత్రులతో కలిసి బరంపురం వెళ్ళి లక్ష్మణరావు గారింట్లో నాలుగు రోజులున్నపుడూ ఆయన 'అతడు – ఆమె'ను తెలుగు పాఠకులు, విమర్శకులు చర్చించలేదని అన్నారు. అది నాకు చాలా ఇష్టమైన నవల. దాని గురించి నేను ఎందుకు రాయకూడదూ అనుకున్నాను.

'అతడు – ఆమె' గురించి విమర్శ గానీ, ప్రశంస గానీ రాయాలంటే జాతీయోద్యమం గురించి, కమ్యూనిస్టు ఉద్యమపు తొలినాళ్ళ గురించి, స్త్రీ పురుష సంబంధాల గురించీ చాలా అధ్యయనం చేయాలి. అప్పుడు నేను లెక్చరర్‌గా పని చేస్తున్న వి.యస్.ఆర్ కళాశాలలో ఎంతో



ఉప్పల లక్ష్మణరావుతో ఓల్గా

మంచి లైబ్రరీ ఉండేది. ఆరు నెలల పాటు ఆ లైబ్రరీలో కూచుని 'అతడు – ఆమె: మనం' రాయటం పూర్తి చేశాను. అంతలో బరంపురం నుంచి 'బతుకు పుస్తకం' ఆవిష్కరణ సభలో మాట్లాడమని పిలుపు వచ్చింది. ఆ సభలో గంట సేపు 'అతడు – ఆమె' నవల గురించి మాట్లాడాను. లక్ష్మణ రావు గారు పొంగిపోయారు. మరో మూడు నెలలకు 'అతడు – ఆమె: మనం' పుస్తకం ఆయన చేతిలో ఉంచి నమస్కరించాను. తన జీవిత కాలంలో 'అతడు – ఆమె' గురించి అంత మంచి, పెద్ద పుస్తకం చూడగలనని అనుకోలేదని లక్ష్మణరావు గారు చాలా సంతోషించారు. ఆయను సంతోషపెట్టానని నేనూ.

ఐతే పుస్తకం రాయటం నా చేతిలో పని – కానీ ప్రచురించటం ఎలా? నాకు అనుభవం లేదు. దిగంబర కవిత్వం ప్రచురణ బాధ్యతలు సుగమ్ బాబు, దేవిప్రియ చూశారు. నా రాజకీయ రచన 'సాంస్కృతిక విప్లవం – మావో' పుస్తక ప్రచురణ కూడా నా ప్రమేయం లేకుండా జరిగింది. కానీ 'అతడు – ఆమె: మనం' రాసే నాటికి నేను తెనాలిలో చాలా ఒంటరితనంలో ఉన్నాను. డబ్బు సమస్య కాదు. పదేళ్ళ నుంచీ లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తున్నాను. కానీ ప్రింటింగ్ ఎవరు చేస్తారు? ఎవరు ఆ బాధ్యత తీసుకుంటారు? విజయవాడలో నేను 'కరుణక్కా' అని పిలిచే డాక్టర్ కరుణ గారు శ్రీశ్రీ విశ్వేశ్వరరావు గారి గురించి చెప్పినట్లు గుర్తు. ఆయన అప్పుడే ప్రింటింగ్ ప్రెస్ పెట్టారు. నా పుస్తకమే మొదటి పుస్తకంగా ఆయన చేతిలోకి వెళ్ళింది. నాకు ప్రూఫ్ రీడింగ్, కవర్ పేజీ ముద్రణ ఇవేమీ తెలియవు. అన్నీ విశ్వేశ్వరరావు గారి బాధ్యతేనని చెప్పాను.

ఆయన పుస్తకాన్ని ముద్రించి నా చేతిలో పెట్టారు. అప్పటికి నాకు ఇద్దరు పిల్లలున్నా, మొదటిసారి బిడ్డను చేతిలోకి తీసుకున్న అనుభూతి– ఆ పుస్తకం చదివి కరుణక్క ఎంత మంచి ఉత్తరం రాసిందో! డాక్టర్ హేమా పరిమి ఎంత ప్రేమగా ఆలింగనం చేసుకుందో. చదివినవారంతా ప్రశంసల వర్షం కురిపించారు. కృష్ణాబాయి గారు "దీనికే నీకు పిహెచ్‌డి డిగ్రీ ఇవ్వొచ్చు" అన్నారు.



అదంతా నవల గొప్పదనమేగాని నా గొప్పదనం కాదని నాకు తెలుసు. ఆ పుస్తకం ఎన్నో ముద్రణలు పొందింది, ఇప్పటికీ మార్కెట్‌లో ఉంది. అందులో కొంత భాగాన్ని 'అతడు – ఆమె'ను పునర్ముద్రించినపపుడు ఆ నవల 'వెనక మాట'గా ప్రచురించారు విశాలాంధ్రవారు. అన్ని విధాలా నాకు సంతోషాన్నీ, చిన్నపాటి గర్వాన్నీ కలిగించిన పుస్తకం నా మొదటి పుస్తకమే. ఆ తర్వాతంతా వివాదాలమయమే నా సాహిత్య జీవితం.

అప్పుడు తెలియదుగానీ 'interdiciplinary' పద్ధతిలో సాహిత్య విమర్శ తెలుగులో మొదలుపెట్టింది ఆ పుస్తకమేనని ఇపుడనిపిస్తుంది.

ఒక చిన్న పిడకల వేట– ఆ పుస్తకంలో లోపాలు చూపాలనే పట్టుదలతో ఒక విప్లవ మేధావి అన్నట్టుగా నాకు విజయవాడ మిత్రులు చెప్పారు. నేను ఆ పుస్తకంలో ఒక గొప్ప సన్నివేశాన్ని వివరిస్తూ "అది చదువుతున్నపుడు లక్ష్మణరావుగారి పాదాలకు నమస్కరించాలనిపిస్తుంది" అని ఉద్వేగంగా రాశాను. నన్ను నేను నిలువరించుకోలేక రాసిన మాట అది. విమర్శలో అది కూడదేమో– కానీ విమర్శ ఉద్వేగం గురించి రాలేదు. "పాదాలకు నమస్కరించటం ఫ్యూడల్. ఓల్గా దానిని ప్రోత్సహిస్తుందా," అని అన్నారట. అది విని నేను మిత్రులతో మరి గద్దర్ అమర వీరులకు "పాద పాదాన పరి పరి దండాలు" అని పాడటం, మనందరం ఉద్వేగంగా వినటం ఇదంతా ఫ్యూడలే కదా అన్నాను. అందరం నవ్వుకున్నాం. నిజమే కొన్ని పాత వ్యక్తీకరణలు అంత త్వరగా వదిలించుకోలేం. ■

ఆఖరి కన్నీటిబొట్టుని అనుకుని
ఓ ధైర్యవచనం ఉండే ఉంటుంది
దుఃఖాన్ని చెరిపేస్తూ, సాంత్వనగా

చెప్పడానికేమీ లేదనుకున్నపుడు
ఇంద్రియాలన్నీ పుష్పించేలా
ఒక తొలకరి వాన పడుతుంది

ముగింపు నచ్చని పుస్తకం చివర
ఓ ఖాళీ పేజీ ఉండే ఉంటుంది
నచ్చిన వాక్యం రాసేందుకు వీలుగా

రాయడానికింకేమీ లేదనుకున్నపుడు
తీరంలో శిలల శిరస్సునుండి
ఆదిమ సంగీతం వినిపిస్తుంది

అంతటా అరుచి ప్రోది అయినపుడు
ఇష్ట స్మృతుల పునరాగమనంతో
స్వప్నవృష్టిలో తడవాలన్న ఇచ్ఛ
దేహదాహంగా వ్యక్తమవుతుంది

మాటలన్నీ ఇంకిపోయాయనుకున్నపుడే
సీతాకోకల గుంపొకటి వచ్చి
నిశ్శబ్దాన్ని పటాపంచలు చేస్తుంది

ఎపిలోగ్

■ మల్లారెడ్డి మురళీ మోహన్

✆ 88611 84899





గత యేడు కురిసిన భారీ వర్షానికి తెగిపోయిన మోరంచవాగు వంతెన



మేడారం అడవుల్లో టోర్నడోలకు నేలమట్టమైన అడవి

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జలమయమైన మహబూబాబాద్ పట్టణం

ప్రకృతి కన్నెర్ర

5

అసాధారణ విపత్తులతో 'ఓరుగల్లు'లో అలజడి

- క్లౌడ్ బరస్ట్, టోర్నడోలతో అల్లకల్లోలం
- మహబూబాబాద్ జిల్లాను ముంచెత్తిన భారీ వరదలు
- గతేడాది భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో ఇదే దుస్థితి
- తాడ్వాయి - మేడారం అడవుల్లో సుడిగాలుల బీభత్సం
- టోర్నడోలతో అడవుల్లో లక్షలాది చెట్లు నేలమట్టం
- 2019లో ఏటూరునాగారం అభయారణ్యంలో ఊళ్లను కమ్మేసిన మేఘాలు
- ఆందోళనకు గురవుతున్న ప్రజలు.. నిగ్గు తేల్చేపనిలో అధికారులు..

- ఆకాశంలో ఎంతో ఎత్తున ఉండాల్సిన మేఘాలు.. చెట్లను, ఊళ్లను తాకడమేవిటి?.. ఇది ములుగు జిల్లా ఏటూరునాగారం అభయారణ్యంలో 2019లో జరిగింది. ఆ నాడు ఊళ్లను, చెట్లను తాకుతూ మేఘాలు వెళ్లాయి. దీంతో సమీప గ్రామాల ప్రజలు సంభ్రమాశ్చర్యాల్లో మునిగిపోయారు. అధికారులు ఏమీ పట్టనట్టు వదిలేశారు.
- యేడాది మొత్తంలో కురవాల్సిన వాన.. ఒక్క రోజులో పడడమేమిటి? 2023 జూలై 27న ములుగు జిల్లా లక్ష్మీదేవిపేటలో రికార్డు స్థాయిలో 64.98 సె.మీ. వర్షపాతం నమోదైంది. భూపాలపల్లి జిల్లా చిట్యాలలో 61.65 సెం.మీలు, గణపురంలో 47.58 సెం.మీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ వర్షం ధాటికి వరదలు ఉప్పొంగాయి. దీంతో తీవ్ర ప్రాణ, ఆస్తి నష్టం జరిగింది. దీనిని క్లౌడ్ బరస్ట్‌గా వాతావరణవేత్తలు చెబుతున్నారు.
- ఆగస్టు 31వ తేదీన సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు వాతావరణంలో ఏర్పడిన మార్పులతో ములుగు జిల్లా తాడ్వాయి - మేడారం అడవుల్లో ఒక్కసారిగా భారీ అలజడి చెలరేగింది. పెద్దఎత్తున గాలిదుమారం, సుడిగాలులతో మేడారం అడవుల్లో మహావృక్షాలు సైతం చిగురాటకులా వణికిపోయాయి. ఈ భారీ గాలికి సుమారు 50వేలకు పైగా చెట్లు ఒకే తీరుగా కుప్పకూలిపోయాయి. గాలుల ధాటికి సమీప గ్రామాల్లోని ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి.
- ఈ నెల సెప్టెంబరు 1వ తేదీన మానుకోటను వర్షాలు ముంచెత్తాయి. అత్యధికంగా 29.67 సె.మీ. వర్షం పడింది. కుండపోత వానతో ఆకేరు, మున్నేరువాగుల్లో ప్రవాహం పెరగటంతోపాటు రైల్వేట్రాక్‌లు కూడా ధ్వంసమయ్యాయి. సైంటిస్ట్ ఆశ్విని తన తండ్రి మోతీలాల్‌తో సహా వరదలో కొట్టుకుపోయి మృతి చెందారు.

.. ఇలా.. కొన్నేళ్లుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరుగుతున్న అసాధారణ విపత్తులపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనికి ఏం కారణమై ఉంటుందని అనుమానపడుతున్నారు. ఏజెన్సీల్లో ఏర్పడిన సుడిగాలులపై అటవీశాఖాధికారులు విచారణ చేస్తున్నారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ) ద్వారా శోధిస్తున్నారు. కాగా, ఉమ్మడి జిల్లాను వణికిస్తున్న క్లౌడ్‌బరస్ట్, టోర్నడోలపై ప్రభుత్వం విస్తృత పరిశోధనలు జరపాలని ఓరుగల్లు ప్రజలు కోరుతున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కడియం కావ్య

వైద్యరంగ బడ్జెట్ పెంపునకు కృషి చేస్తా..

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- ఘనంగా ఐఎంఏ జోన్-3 రాష్ట్ర సదస్సు

పోచమ్మమైదాన్, సెప్టెంబరు 8: వైద్య రంగానికి కేటాయిస్తున్న రెండు శాతం బడ్జెట్‌ను పెంచేందుకు లోక్‌సభలో ప్రస్తావిస్తానని వరంగల్ ఎంపీ కడియం కావ్య పేర్కొన్నారు. వరంగల్ నగరంలోని వజ్రా గార్డెన్స్‌లో ఆదివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ జోన్-3 రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఐఎంఏ ఆధ్వర్యంలో 'ప్రజారోగ్యం - ప్రభుత్వ విధానాలు, నకిలీ వైద్యులు-దుష్పరిణామాలు, వైద్య సిబ్బందిపై దాడులు-నివారణ చర్యలు, యువ వైద్యుల ఆకస్మిక మరణాలు-కారణాలు' అనే అంశాలపై చర్చా వేదిక నిర్వహించారు. ఐఎంఏ ప్రతినిధి డాక్టర్ అశోక్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి విశిష్ట అతిథి ఎంపీ కావ్య మాట్లాడుతూ.. వైద్యుల సంక్షేమానికి అన్ని విధాలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజారోగ్య పరిరక్షణ, నకిలీ వైద్య వ్యవస్థ నిర్మూలన జరగాలన్నారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పగడాల కాళీప్రసాద్‌రావు మాట్లాడుతూ.. వైద్యులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వాలు చొరవ చూపడం లేదన్నారు. రాష్ట్రంలో వైద్య కళాశాలలు పెంచినప్పటికీ వారికి బోధించే వారి సంఖ్య సరిపోవడం లేదన్నారు. వైద్యులకు జీతాలు పెంచాలని జాతీయ ఐఎంఏకు తెలిపినా ఇప్పటివరకు స్పష్టత రాలేదన్నారు. అనంతరం తెలంగాణ నుంచి జాతీయ ఐఎంఏ అధ్యక్షుడైన దిలీప్‌బన్సాలిని ఘనంగా సన్మానించారు. కార్యక్ర మంలో డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ శేషుమాధవ్, డాక్టర్ నరేష్‌కుమార్, డాక్టర్ సుదీప్, డాక్టర్ సుధాకర్‌రెడ్డి, వరంగల్ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అన్వర్‌మియా, కోశాధికారి శ్రవణ్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ అజిత్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

జై.. జై.. గణేషా..

వైభవంగా ప్రారంభమైన వినాయక నవరాత్రి ఉత్సవాలు

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 8: భాద్రపద శుద్ధ చతుర్థి శనివారం నుంచి గణేష్ నవరాత్రి వేడుకలు జిలా వ్యాప్తంగా కోలాహలంగా ప్రారంభమయ్యాయి. ప్రజలంతా భక్తి శ్రద్ధలతో భిన్న ఆకృతుల గణపయ్యలను మండపాలలో కొలువు దీర్చి పూజాదికాలు నిర్వహిస్తున్నారు. ప్రతీ చోటా కళ్లకు జిగేల్‌మనిపించే విద్యుత్‌కాంతుల మధ్య వాడవాడలా కొలువైన గణపయ్యలు సందడి చేస్తున్నాయి. ఈనెల 16 వరకు నవరాత్రి వేడుకలకు శ్రీకారం చుట్టారు. ప్రతీరోజు ఉదయం, రాత్రి పూజలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానాలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించేందుకు గణేష్ మండళ్లు ఏర్పాట్లు చేశాయి.

వేయిస్తంభాల ఆలయంలో..

నగరంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలకు పెట్టింది పేరైన ప్రసిద్ధ వేయిస్తంభాల ఆలయంలో తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్తిష్ఠ గణపతి నవరాత్రి వేడుకలను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఉదయం సుప్రభాత వేళ మంగళ వాయిద్య సేవ నిర్వహించి ఉత్తిష్ఠ గణపతికి ప్రాచీన కోనేరు తీర్థంతో పంచామృతాభిషేకం, నవరసాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వరసిద్ధి వినాయకుడిగా అలంకరింప జేసి మూషిక వాహనంపై ఆలయ ప్రాంగణంలో ఊరేగింపు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు గట్టు మహేష్‌బాబు, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిలు ఇతర ప్రముఖులు వాహన సేవలో ఉత్సాహంగా పాల్గొన్నారు. 21రకాల పత్రులతో పూజలు నిర్వహించి, ఉండ్రాలను నైవేద్యంగా సమర్పించారు. ప్రముఖ వ్యాపార వేత్త వెనిశెట్టి సుబ్రహ్మణ్యం ఇంటి నుంచి 30 అడుగుల మట్టి గణపయ్య ఉత్సవ మూర్తిని రథంపై మంగళ వాయిద్యాలతో తీసుకొచ్చి విష్ణు ఆలయం ఎదురుగా ప్రతిష్ఠింప చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, నిత్య పూజ కైంకర్యాలదాత వొద్దిరాజు వెంకటేశ్వర్లు, పుప్పాల ప్రభాకర్, పానుగంటి శేఖర్, తోట పవన్, ఉత్సవ సమితి పక్షాన గండ్రాతి రాజు, కంజుల మహేష్ తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ బిల్డర్ సత్యమూర్తి ఆధ్వర్యంలో నిత్య అన్నదానం ప్రారంభించారు. సాయంత్రం గజ్జెల రంజిత్‌కుమార్ శిష్య బృందంచే పెద్ద ఎత్తున పేరిణి నృత్యప్రదర్శనలు భక్తులను విశేషంగా అలరింపజేశాయి. ఆదివారం గణపతిని ఉత్తిష్ఠగణపతిగా అలంకరించి ఐరావత వాహనంపై సేవలు నిర్వహించారు. ఆలయ ఈవో వెంకటయ్య, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అదే విధంగా హనుమకొండలోని అంబేద్కర్ సెంటర్‌లో నెలకొల్పిన భారీ గణేష్ ఉత్సవాలను కూడా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు పాల్గొని ప్రారంభించారు. హనుమకొండ వడ్డేపల్లిలో నెలకొల్పిన గణేష్ వేడుకలను మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ దంపతులు పాల్గొని ప్రారంభించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకుడు పులి రజినీకాంత్ తదితరులు ఉన్నారు. హనుమకొండ బ్రాహ్మణవాడలోని గణేష్ వేడుకల్లో స్థానిక కార్పొరేటర్ వేముల శ్రీనివాస్ పాల్గొన్నారు. శ్రీదొప్ప

మిగతా 6వ పేజీలో..



వేయిస్తంభాల ఆలయంలో గణపతి నవరాత్రి వేడుకలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని



వరంగల్ ఎల్లం బజార్ లో 40 ఫీట్ల గణనాథుడు

సహాయక చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి పొంగులేటి



మరిపెడ హెలిప్యాడ్ నుంచి హెలికాప్టర్‌లో హైదరాబాద్ వెళ్తున్న మంత్రులు కిషన్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

మరిపెడ, సెప్టెంబరు 8: ఎడతెరపిలేని వర్షాలతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురివుతున్నందున మహబూబాబాద్ జిల్లా అధికార యంత్రాంగం సహాయక చర్యలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్రమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కలెక్టర్ అద్వైత్‌సింగ్ కుమార్, ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్‌కు సూచించారు. ఆదివారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఖమ్మం జిల్లాలోని వరద ముంపు ప్రాంతాలను సందర్శించి తిరుగు ప్రయాణంలో అక్కడి అధికారులు వారి ప్రయాణానికి చేరువగా ఉండేందుకు మరిపెడ దగ్గర ఉన్న హెలిప్యాడ్ వద్ద హెలికాప్టర్‌ను సిద్ధం చేసి ఉంచారు. ఖమ్మం పర్యటన అనంతరం వారు హెలికాప్టర్లో హైదరాబాద్ వెళ్లేందుకు మరిపెడ హెలిప్యాడ్‌కు ప్రత్యేక వాహనాల ద్వారా చేరుకోగా, మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్‌సింగ్‌కుమార్, ఎస్పీ సుధీర్‌రాంనాథ్‌కేకన్ వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లాలోని వర్షం పరిస్థితులను కలెక్టర్, ఎస్పీని వారు అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి వరద ముంపు బాధితులకు అందిస్తున్న సహాయక చర్యలపై మంత్రులకు వివరించారు. కేంద్రమంత్రి వెంట మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, చెవేళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఉన్నారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాం చంద్రునాయక్, కాంగ్రెస్ నేతలు నరేశ్‌రెడ్డి, యుగేందర్ రెడ్డి, రఘువీర్‌రెడ్డి, అంబరీష, అఫ్జల్, తాజుద్దీన్, వేణు, అశోక్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు. అలాగే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని ఇక్కడి బీజేపీ నేతలు గంగాధర్, లింగం నాయక్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

ఓ... మై ఫ్రెండ్

5

మాజీ ఎమ్మెల్యే వినయ్, ఎమ్మెల్యే నాయినిల మధ్య మాటల తూటాలు

నాయినిది అడ్డిమారి గుడ్డిదెబ్బ గెలుపు

- పాత శిలాఫలకాలను పగులగొట్టి కొత్తవి పెట్టి ఫోజులిస్తున్నాడు..
- బీఆర్ఎస్ హయాంలోని పనులకు ప్రారంభోత్సవాలు చేస్తూ గొప్పలు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్

వినయ్.. దమ్ముంటే చర్చకు రా..

- పశ్చిమ అభివృద్ధిపై ప్రజా సమక్షంలో తేల్చుకుందాం..
- 15 ఏళ్ల నీ పని, 8 నెలల నా పనితనంపై చర్చిద్దాం..
- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సవాల్





'మిత్రుడు..' అంటూనే మాజీ ఎమ్మెల్యే వినయభాస్కర్, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిలు పరస్పర విమర్శలకు దిగారు. ఒకరిపై మరొకరు ఆరోపణలు సంధించుకున్నారు. బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో వినయభాస్కర్.. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిపై విమర్శలు కురిపించారు. కాళోజీ కళాక్షేత్రంపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నాడని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన పనులనే ప్రారంభించి ఫోజులు కొడుతున్నారని అన్నారు. దీనికి ఎమ్మెల్యే నాయిని ధీటుగా బదులిచ్చారు. పశ్చిమ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. వినయ్ 15 ఏళ్ల పాలనలో, తన 8నెలల పాలనలో జరిగిన అభివృద్ధి ఏమిటో చూద్దామన్నారు.

- రాంనగర్ (హనుమకొండ)/ హనుమకొండ సిటీ

ఉత్తమ సేవలతోనే గుర్తింపు



ఉత్తమ సేవలందించిన వారిని శాలువాలతో సన్మానిస్తున్న రెడ్డి సంఘం నేతలు

జూలైవాడ, సెప్టెంబరు 8 : విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన వారికి తప్పకుండా గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర రెడ్డి సంఘం అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండ పోస్టల్ కాలనీలోని రెడ్డి సంఘం కార్యాలయంలో ఉత్తమ సేవలు అందించిన విద్యుత్ రంగంలో డివిజనల్ ఇంజనీర్ సాంబరెడ్డి, వైద్యరంగంలో యూరాలజిస్టు డాక్టర్ మన్నెం శ్రీనాథ్‌రెడ్డి, రా రైస్ మిల్లర్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన పాడి గణపతిరెడ్డి, జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న బొమ్మినేని సంధ్యారెడ్డి, ఇటీవల ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి పొందిన కామిడి సతీష్‌రెడ్డిలను రాష్ట్ర రెడ్డి సంఘం ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అర్జుల కిషన్‌రెడ్డి, నల్లా రాజిరెడ్డి, నరసింహారెడ్డి, సంజీవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, రమేందర్‌రెడ్డి, కేశవరెడ్డి, సతీష్‌రెడ్డి, రమణారెడ్డి, తిరుపతిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, నర్సింహారెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, చందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

15న మిలాద్ ఉల్ నబీ వేడుకలు

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబరు 8 : హనుమకొండ రాయపురలోని జక్రియా ఫంక్షన్ హాల్లో ఈనెల 15న రాత్రి 8 నుంచి ఉదయం 5 గంటల వరకు మిలాద్ ఉల్ నబీ వేడుకలు అత్యంత ఘనంగా జరుగుతాయని మర్కజీ మిలాద్ కమిటీ అధ్యక్షుడు ఖాజా సిరాజోద్దిన్ తెలిపారు. శనివారం రాత్రి హనుమకొండలోని బర్కాతియా మదర్‌సాలాలో మర్కజీ మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో జష్నే మిలాద్ ఉల్ నబీ వేడుకల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిరాజోద్దిన్ మాట్లాడుతూ.. ఈ వేడుకల్లో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఇస్లాం పండితులు హాజరవుతారని, త్రినగరిలోని ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ బాధ్యులు ఎం.డి. నయీం, అఫ్జల్ బర్కాతి, షఫీ, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



మిలాద్ ఉల్ నబీ వేడుకల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ముస్లిం మత పెద్దలు


నిత్య చైతన్యమూర్తి కాళోజీ

- ప్రజల గొడవే.. తన గొడవ..
- పౌరహక్కుల ఉద్యమ నేత
- నేడు కాళోజీ 110వ జయంతి
- నేడు మాండలిక భాషా దినోత్సవం
- కాళోజీ కళాక్షేత్రం ప్రారంభం వాయిదా

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 8 : అసమ్మతి నిరసనల ధిక్కార స్వరం.. మానవత్వపు మనుగడకు నిలువెత్తు సంతకం.. ఈ కాలపు వేమన.. పౌర హక్కుల వాది.. ఉద్యమ జీవి ప్రజాకవి కాళోజీ నేటి సమకాలీన సమాజానికి ఆయన నా గొడవ ద్వారా అందించిన సాహిత్యం నిత్య చైతన్యం. ఈ నెల 9వ తేదీన 110 వసంతాలు పూర్తవుతాయి. ఆయన జయంతిని తెలంగాణ ప్రజలు మాండలిక భాషా దినోత్సవం గాను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ప్రజా కవి కాళోజీ పేరిట ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావొచ్చినా ఇంకా కొన్ని పనులు మిగిలిపోయాయి. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా జరిగే ఈ కళాక్షేత్రం ప్రారంభోత్సవం వచ్చే నెలకు వాయిదా పడింది. అయినా కాళోజీ అభిమానులు, కాళోజీ ఫౌండేషన్ సోమవారం ఆయన జయంతిని ఘనంగా నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వం కూడా పదేళ్లుగా కాళోజీ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాల్లో, విద్యా సంస్థల్లో ఆయన జయంతి వేడుకలు సోమవారం జరుగనున్నాయి. ఈసారి కాళోజీ స్మారక అవార్డును బహుముఖ భాషా వేత్త కరీంనగర్‌కు చెందిన నలిమెల భాస్కర్‌కు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

110వ జయంతి..

1914 సెప్టెంబరు 9న జన్మించిన కాళోజీ పూర్తి పేరు రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాస్‌రావు. మడికొండలో స్థిరనివాసం ఏర్పర్చుకొని వరంగల్ కేంద్రంగా ఆయన జీవితమే సాహిత్యం, ఉద్యమం ద్వారా కొనసాగించారు. మడికొండలో ప్రాథమిక విద్య, సెకండ్ పారం హనుమకొండ, హైదరాబాద్ పాతబస్తీలో కొనసాగింది. పదో తరగతి వరకు హనుమకొండలోని ప్రస్తుత కాలేజీయేట్ హైస్కూల్‌లో పూర్తి చేశారు. ఆర్య సమాజ ఉద్యమం, పౌరహక్కులు, సాహిత్యంతో ఆయన జీవితం పెనవేసుకుపోయింది. ఆయనను ప్రభుత్వం పద్మవిభూషణ్‌తో పీవీ నర్సింహారావు ప్రధానిగా ఉన్నప్పుడు సత్కరించింది. 1958 నుంచి 1960 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యుడిగా, ఆంధ్ర సారస్వత పరిష్యత్ సభ్యుడిగా సాహిత్య అకడవిక్ సభ్యుడిగా, తెలంగాణ రచయితల మండలి అధ్యక్షుడిగా, హనుమకొండలో విశ్రమండలి వ్యవస్థాపకుడిగా పనిచేశారు. 'నా గొడవ'తో పాటు 'బాపు.. బాపు.. బాపు..' 'కాళోజీ కథలు', 'నా భారతదేశ యాత్ర', 'కాళోజీ తెలంగాణ ఉద్యమ కవిత'ల లాంటి సుమారు 20 గ్రంథాలను వెలువరించారు. కాళోజీ జీవన రేఖలో సాహిత్యం, ఉద్యమాలు మాత్రమే ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.



అవనిపై జరిగేటి అవకతవకలు చూసి..
ఎందుకో నా హృదిని ఇన్ని వేదనలు..
పరుల కష్టం చూసి పగిలిపోవును గుండె..
మాయ మోసమును చూసి చిటికిపోవును మనసు..
ఎందుకో నా హృదికి ఇన్ని ఆవేదనలు..

.. అంటూ సమాజంలోని ఎన్నో వేదలను నా గొడవగా చిత్రీకరించిన మనిషి కాళోజీ. అసమ్మతి, నిరసన, ధిక్కార స్వరం మానవత్వపు మనుగడకు నిలువెత్తు సంతకం కాళోజీ ఒక కాలేజీ అన్నది అక్షర సత్యం. అక్షర యోధుడు ఈ కాలపు వేమన, పౌరహక్కుల చైతన్యమూర్తి, ఉద్యమ జీవి, వీటన్నింటికీ చిరునామాయే కాళోజీ. ఆయన కలం నుంచి జాలువారిన అక్షర తూటాలవలె ప్రతీ తెలుగు వారి హృదిలో ముద్రితమై ఆలోచనలను కలిగింపజేస్తాయి.

తెలుగు బిడ్డవురోరి.. తెలుగు మాట్లాడుటకు..
సంకోచపడియెదవు.. సంగతేమిటిరా..?
అన్య భాషలు నేర్చి ఆంధ్రమ్ము రాదనుచు..
చకిలించు ఆంధ్రుడా.. చావవెందుకురా..?

.. అంటూ మాతృ భాషపట్ల ఆయన మమకారం చాటుతూ తెలుగును చిన్న చూపుతూ పరభాష వ్యామోహంతో కూరుకుపోయిన వారిని సూటిగా ప్రశ్నిస్తూ ఏనాడో కవిత్వం రాసిన ఆయన సాహిత్యం నిత్య నూతనం. అందుకే ఆయన జన్మదిన వేళ తెలుగు మాండలిక దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీ.

అన్నపు రాసులు ఒకచోట.. ఆకలి మంటలు ఒకచోట..
హంసతూలికలు ఒకచోట.. అలసిన దేహాలు ఒకచోట ..
కమ్మని సకినాలు ఒకచోట.. గట్టి దవడలు ఇంకోచాట..

.. అని సమాజంలో తరతమ వ్యత్యాసాలను ఎండగడుతూ గుబాళింప చేసిన కాళోజీ సాహిత్యమంతా నిత్య చైతన్యం. ఒక శతాబ్ద కాలపు తెలంగాణ సామాజిక రాజకీయచరిత్ర అంతా ఆయన సాహిత్యమే. పలుకుబడుల భాషా కావాలని పట్టుబట్టిన కాళన్న జయంతిని తెలుగు మాండలిక భాషా దినోత్సవం గాను జరుపుకుంటూ ఆయన అభిమానులు ఆయనను స్మరించుకోవడం ఆనవాయితీ.

రోలర్ స్కేటింగ్‌లో ఐషా ప్రతిభ

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 8: మడికొండ రాంపూర్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్‌లో పోటీలలో హనుమకొండ నయీంనగర్‌కు చెందిన ఐషా మరియం స్వర్ణ పతకాలు కొల్లగొట్టి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. జిల్లా స్థాయి అండర్-5, 7 బాలికల 400, 600 మీటర్ల స్పీడ్ క్వాడ్ స్కేట్స్ విభాగంలో ఐషా అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రెండు విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించి అక్టోబర్ నెలలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికైంది. ఈ మేరక రోలర్ స్కేటింగ్ పోటీలలో స్వర్ణ పతకాలు సాధించిన ఐషాను మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ ఆదివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో అభినందించారు.



ఐషాను అభినందిస్తున్న వినయభాస్కర్

విద్యుత్ పునరుద్ధరణ పనులు
వేగవంతం చేయాలి

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి
- ఖమ్మం, మహబూబాబాద్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 8: వర్షాలతో విద్యుత్ సామగ్రి దెబ్బతిన్న ప్రాంతాల్లో పునరుద్ధరణ పనులను వేగవంతంగా చేయాలని మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల విద్యుత్ అధికారులను సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. వర్షాల కారణంగా విద్యుత్ సంస్థకు భారీగా నష్టం వాటిల్లిన మహబూబాబాద్, ఖమ్మం జిల్లా అధికారులతో సీఎండీ ఆదివారం హనుమకొండ కార్పొరేట్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. మహబూబాబాద్ సర్కిల్‌లో భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న డోర్నకల్, గార్ల, కొత్తపేట, సిరోల్, మరిపెడ, చిన్న గూడూరులో పునరుద్ధరణ పనులను వేగవంతం చేసేందుకు అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని, అదనపు కాంట్రాక్టర్లును నియమించుకోవాలని ఆదేశించారు. కంపెనీ నుంచి సహాయ సహకారాలు అందిస్తామని, వీలైనంత త్వరంగా పూర్తి చేయాలన్నారు. మిగతా వింగ్‌లల్లో పనిచేసే ఏడీఈ, ఏఈలను పునరుద్ధరణ పనులల్లో ఉపయోగించుకోవాలన్నారు. వాగుల నుంచి 500 మీటర్ల దూరంతో 9.1 మీటర్ల స్తంభాలను ఏర్పాటు చేయాలన్నారు. గుండ్రాతిమడుగు, మరిపెడ-1,2. చిన్నగూడూరు ఫీడర్ల వద్ద పురోగతిలో ఉన్న 33 కేవీ లైన్ పనులను పర్యవేక్షించాలని సీఈ కన్‌స్ట్రక్షన్, డీఈ ఎంఆర్‌టీ, కన్‌స్ట్రక్షన్‌లను ఆదేశించారు. ఖమ్మం సర్కిల్‌లో దెబ్బతిన్న కూసుమంచి, పాలేరు, ముదిగొండ, పమ్మి, ఆరెంపుల, పల్లెగూడెం, రఘునాథపాలెం, ఖమ్మం రూరల్, ప్రకాశ్‌నగర్ సెక్షన్‌లల్లో పనులను వేగవంతం చేయాలన్నారు. ఈ వీసీలో ఇన్‌చార్జి డైరెక్టర్ (ఆపరేషన్) టి.మధుసూదన్, సీజీఎంలు కిషన్, అశోక్, బికంసింగ్, జీఎంలు నాగప్రసాద్, అన్నపూర్ణ, ఎస్ఈ అంకుష్ పాల్గొన్నారు.

అవినీతి రహిత సేవలందించేందుకు కృషి

ఎన్పీడీసీఎల్ పరిధిలో అవినీతి రహిత సేవలందించేందుకు కంపెనీ నిబద్ధతతో పనిచేస్తుందని సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. వినియోగదారులకు సేవలందించే విషయంలో ఇబ్బందులు కల్గించే, విధుల పట్ల నిర్లక్ష్యం వహించే ఉద్యోగులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. విద్యుత్ సిబ్బంది సేవలకు ఫలితంగా లంచం అడిగితే విజిలెన్స్ వింగ్ ఆధ్వర్యంలో పర్యవేక్షించబడుతున్న ఫోన్ నెంబర్ 9281033233, టోల్‌ఫ్రీ నెంబర్ 1064 నెంబర్‌కు వినియోగదారులు ఫిర్యాదు చేయాలన్నారు. లంచం అడిగితే మాకు సమాచారం ఇవ్వండంటూ ఇప్పటికే 16 సర్కిళ్ల పరిధిలో పోస్టర్ల అతికించామన్నారు. సిటిజన్ చార్టర్‌కు లోబడి వినియోగదారులకు సేవలందించాలని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. వినియోగదారుల ఫిర్యాదులను పరిష్కరించడానికి 'ఎన్పీడీసీఎల్ గ్రీవెన్స్ పోర్టల్' అనే ప్రత్యేక పోర్టల్ పెట్టడం జరిగిందని పోర్టల్ ద్వారా సమస్యలు పరిష్కరించుకొవచ్చని సూచించారు.

నేటి కేయూ పరిధిలోని పరీక్షలన్నీ వాయిదా

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 8: భారీ వర్షాల నేపథ్యంలో సెప్టెంబరు 9న కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని జరగాల్సిన పరీక్షలన్నీ వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి ఆదివారం ప్రకటించారు. బీఫార్మసీ రెండో సెమిస్టర్‌తోపాటు ఇతర పరీక్షలన్నీ వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. తిరిగి ఆయా పరీక్షలు ఎప్పుడు నిర్వహించేది తర్వాత ప్రకటిస్తామని వెల్లడించారు. కాగా, సెప్టెంబరు 10వ తేదీన మంగళవారం నుంచి జరగాల్సిన పరీక్షలన్నీ యథావిధిగా జరుగుతాయని స్పష్టం చేశారు.

రేపు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 8: వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10న హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం(జేఎన్ఎస్)లో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి యుగేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ జిల్లా స్థాయిలో అండర్-8. 10, 12, 14, 16, 18, 20 సంవత్సరాల బాలబాలికలకు వివిధ విభాగంలో ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈనెల 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్న 10వ తెలంగాణ రాష్ట్రస్థాయి సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు వెంట తీసుకొని ఈ నెల 10న ఉదయం 9గంటలకు హనుమకొండ జేఎన్ఎస్‌లో హాజరు కావాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు 9866564422 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రకృతి కన్నెర్ర!

- అసాధారణ విపత్తులతో 'ఓరుగల్లు'లో అలజడి
- క్లౌడ్ బరస్ట్, టోర్నడోలతో అల్లకల్లోలం
- ఆందోళనకు గురవుతున్న ప్రజలు.. నిగ్గు తేల్చే పనిలో అధికారులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఓరుగల్లుపై ప్రకృతి పగ పట్టిందా..? కొన్నాళ్లుగా ఉత్పన్నమవుతున్న అసాధారణ విపత్తులు దేనికి సంకేతాలు..? మేఘాలు ఊళ్లను కమ్మేయటం వెనుక రహస్యమేమిటీ..? క్లౌడ్ బరస్ట్, టోర్నడోల బీభత్సం హెచ్చరికల మర్మ మేటి..? అసలేం చెబుతోంది ప్రకృతి..?

..ఇప్పుడిదే ఓరుగల్లులో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. దేశంలో ఎక్కడాలేని విధంగా ములుగు జిల్లా మేడారం అడవుల్లో టోర్నడోల బీభత్సం భయాందోళనకు గురి చేస్తోంది. 2019లో ఏటూరునాగారం అభయారణ్యంలో ఊళ్లను, చెట్లను తాకుతూ వెళ్లిన మేఘాల మర్మం తెలియక ముందే టోర్నడోల అలజడి ఆందోళన కలిగిస్తోంది. ఏటా ఏదో ఒక జిల్లాలో రికార్డు స్థాయిలో క్లౌడ్‌బరస్ట్ తరహాలో కురుస్తున్న వానలతో తీవ్రంగా ప్రాణ, ఆస్తి నష్టాలు వాటిళ్లుతున్నాయి. గతేడాది భూపాలపల్లి, ములుగు జిల్లాలను అతలాకుతలం చేసిన వానలు.. ఈసారి మానుకోటను ముంచెత్తాయి. ప్రకృతిలో మార్పులే ఈ విపత్తుకు కారణమైతే.. ఆ మార్పులకు ఓరుగల్లే కేంద్రం ఎందుకవుతోందనేది చర్చనీయాంశంగా మారింది.

క్లౌడ్ బరస్ట్ కలకలం

ఆకాశానికి చిల్లు పడినట్లుగా వర్షం మొత్తం ఒకే చోట కుప్పగా పడటమే క్లౌడ్ బరస్ట్. గత ఏడాదికి ముందు ఈ పదం చాలామందికి తెలియదు. 2023 జూలైలో కురిసిన భారీ వర్షాలతో భూపాలపల్లి, ములుగు జిల్లాలు అతలాకుతలమయ్యాయి. గత ఏడాది జూలై 27వ తేదీన తెలంగాణ చరిత్రలోనే తొలిసారిగా ములుగు జిల్లా లక్ష్మీదేవిపేటలో రికార్డు స్థాయిలో 64.98 సెమీ వర్షపాతం నమోదైంది. భూపాలపల్లి జిల్లా చిట్యాలలో 61.65 సెం.మీలు, గణపురంలో 47.58 సెం.మీటర్ల వర్షపాతం నమోదైంది. ఒక ఏడాదంతా పడాల్సిన వాన.. ఒకేచోట ఒకేసారి కుమ్మరించినట్లుగా పడటంతో వాగులు, చెరువులు వాన తాకిడిని తట్టుకోలేకపోయాయి. ఫలితంగా వరద ప్రవాహం పెరిగింది. దీంతో మోరంచవాగు ఉప్పొంగటంతో నలుగురు వాగులో గల్లంతయ్యారు. ములుగు జిల్లా కొండాయిలో వాగులో ఆరుగురు కొట్టుకుపోయారు. వెంకటాపూర్ సమీపంలో బూర్గుపేట చెరువు అలుగులో ఇద్దరు కొట్టుకపోయారు. భూపాలపల్లి జిల్లాలో సుమారు 20 మందికి వరకు వరదలకు మృత్యువాతపడ్డారు. వేలాది పశువులు మృతి చెందగా, వేలాది ఎకరాల పంట పొలాలు దెబ్బతిన్నాయి.

వరంగల్ నగరంలోనూ భారీ వర్షాలతో 70కి పైగా కాలనీలు నీట మునిగాయి. ఎప్పుడూ లేని విధంగా వరంగల్ నగరాన్ని కూడా గతేడాది వానలు ముంచెత్తాయి. గత ఏడాది జరిగిన వరద దుర్ఘటన నుంచి ఇంకా బయటపడక ముందే ఈ ఏడాది మానుకోట జిల్లాను క్లౌడ్‌బరస్ట్ కకావికలం చేసింది. సెప్టెంబరు 1వ తేదీన మానుకోటలో అత్యధికంగా 29.67 సెమీ. వర్షం పడింది. నర్సింహులపేటలో 40.56 సెం.మీ., కేసముద్రంలో 37.72 సెం.మీ. వర్షపాతం నమోదు కాగా, దంతాలపల్లి, కురవి మండలంలో 35.42 సె.మీల చొప్పున వర్షపాతం నమోదైంది. కుండపోత వానతో ఆకేరు, మున్నేరువాగుల్లో ప్రవాహం పెరగటంతోపాటు రైల్వే ట్రాక్‌లు కూడా ధ్వంసమయ్యాయి. సైంటిస్ట్ అశ్విని, తండ్రి మోతీలాల్‌తో సహా వరదలో కొట్టుకపోయి మృతి చెందారు. ఒక్కసారిగా రాత్రికి రాత్రే క్లౌడ్ బరస్ట్‌తో వరదను అంచనా వేయలేకపోతున్నారు. వరుసగా గతేడాది నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాలో భారీ వర్షాలు ఒకే చోట పడుతుండటం వాతావరణ మార్పులే కారణమని చెప్పుతున్నారు.


గతేడాది జూలై 27న వరదతో మునిగిపోయిన మోరంచపల్లి (ఫైల్)

దీనికంటే ముందు 2019లో ఏటూరునాగారం అభయారణ్యం పరిధిలోని ఏటూరునాగారం, వాజేడు, వెంకటాపురం ప్రాంతాల్లో ఆకాశంలో ఉండాల్సిన మేఘాలు ఊళ్లలోని ఇళ్లపై వరకు వచ్చాయి. నల్లని మబ్బులు ఇళ్లను తాకే వరకు రావటంతో అప్పట్లోనే క్లౌడ్ బరస్ట్ అవుతుందని అందరూ భయాందోళనకు గురయ్యారు. అయితే అప్పట్లో తప్పిన 2023, 2024ల్లో ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాలో క్లౌడ్‌బరస్ట్‌తో వరద బీభత్సాన్ని సృష్టిస్తోంది.

ఏజెన్సీలో టోర్నడోల అలజడి

దేశంలోనే ఎక్కడాలేని విధంగా సుడిగాలుల బీభత్సం ఏజెన్సీని వణికిస్తోంది. ఆగస్టు 31వ తేదీన సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు వాతావరణంలో ఏర్పడిన మార్పులతో ములుగు జిల్లా తాడ్వాయి - మేడారం అడవుల్లో ఒక్కసారిగా భారీ అలజడి చెలరేగింది. పెద్దఎత్తున గాలి దుమారం, సుడిగాలులతో మేడారం అడవుల్లో మహావృక్షాలు సైతం చిగురుటాకులా వణికిపోయాయి. ఈ భారీ గాలికి ఒకటి కాదు.. రెండు వందలు కాదు.. ఏకంగా సుమారు 50వేలకు పైగా చెట్లు ఒకే తీరుగా కుప్పకూలిపోయాయి. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తుండగా, అనూహ్యంగా ఏటూరునాగారం అభయారణ్యంలోని దొడ్ల కొత్తూరు అడవుల్లో ఏడు కిలోమీటర్ల మేర 5హెక్టార్లకు పైగా టోర్నడోలతో లక్షలాది చెట్లు నేలమట్టమైనట్లు ఆదివారం అటవీశాఖ అధికారులు గుర్తించారు. దీంతో తాడ్వాయి అడవుల్లో సుడిగాలుల బీభత్సంతో లక్షలాది చెట్లు నేలకూలిపోవటం ఆదివాసీలను ఆందోళనకు గురిచేస్తోంది. అయితే టోర్నడోల వల్ల ఒకస్పష్టమైన మార్గంలో సాగే బలమైన గాలుల ధాటికి చెట్లు నేలమట్టం అయ్యాయని అటవీశాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి ప్రతికూల వాతావరణంలో గాలుల వేగం గంటకు 120 కిలోమీటర్లకు పైనే ఉంటుదని, అంతేవేగంగా సుడులు తిరిగినట్లుగా ఉంటుందని పేర్కొంటున్నారు. ఈ టోర్నడోలు సాంకేతికంగా అనేక కారణాలవల్ల ఏర్పడుతుందని, వీటిలో అధికవేగంతో కూడిన గాలులు, అవి సంభవించే మార్గంలో అనేకచెట్లు కూలిపోతాయని, అయితే మన దేశంలో ఇలాంటి సంఘటనలు చాలా అరుదని నిపుణులు చెబుతున్నారు.


మేడారం అడవుల్లో టోర్నడోలకు నేలమట్టమైన అడవి

విపత్తులకు కారణమేమిటి..?

ఉమ్మడి వరంగల్‌జిల్లాలో అసాధారణంగా ఏర్పడుతున్న విపత్తులకు కారణాలేమిటి అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. చరిత్రలో అత్యధికంగా 2023 జూలై 27న ములుగు జిల్లా లక్ష్మీదేవపేటలో క్లౌడ్ బరస్ట్‌తో 64.98 సెం.మీ.ల వర్షం కురిసింది. ఆగస్టు 31న టోర్నడోలతో తాడ్వాయి అడవుల్లో రెండు ప్రాంతాల్లో రెండు లక్షలకు పైగా చెట్లు నేలమట్టం అయ్యాయి. ప్రకృతి ఓరుగల్లుపైనే ఎందుకు కన్నెర్ర చేస్తోందనే చర్చ నడుస్తోంది. ఇప్పటికే టోర్నడోలపై అటవీశాఖ అధికారులు శాటిలైట్ డేటాను సేకరిస్తున్నారు. ఈ ప్రాంతంలోనే టోర్నడోలు ఎందుకు వస్తున్నాయో తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. దీంతో పాటు నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్సీ)ని కూడా సంప్రదిస్తున్నారు. కోట్లాది మంది భక్తులకు ఇలవేల్పుగా ఉన్న మేడారం సమక్క, సారలమ్మ కొలువైన మేడారం అడవుల్లోనే టోర్నడోలు రావడంపై ఆందోళన చెందుతున్నారు. ఈ బలమైన సుడిగాలులు జాతర సమయంలో వస్తే భారీగా నష్టం వాటిల్లే ప్రమాదం ఉంటుందనే చర్చ జరుగుతోంది. 2019లో ఏటూరునాగారం అభయారణ్యంలో మేఘాలు ఊళ్లలో ఇంటిపై వరకు వచ్చినప్పుడే పరిశోధనలు చేస్తే ఇప్పటికే కొంత సమాచారం సేకరించేవారని, అప్పట్లో ఆ సంఘటనను పెద్దగా పట్టించుకోకపోవటంతోనే కొత్త సమస్యలు తెరపైకి వస్తున్నాయనే విమర్శలున్నాయి.

గత ఏడాది ములుగు, భూపాలపల్లి జిల్లాలో క్లౌడ్ బరస్ట్ తరహాలోనే మానుకోట జిల్లాలో ఈసారి వాన సునామీని సృష్టించింది. దీంతో క్లౌడ్ బరస్ట్‌లకు, టోర్నడోలకు ఓరుగల్లునే ఎందుకు కేంద్రంగా మారుతోందనే అనుమానాలు వ్యక్తం అవు తున్నాయి. దీనిపై నిగ్గు తేల్చేందుకు ప్రభుత్వం, వాతావరణ శాఖ అధికారులు త్వరితగతిన పరిశోధనలు చేయాలని, ఈ విపత్తుల ముప్పు నుంచి కాపాడేందుకు చేపట్టాల్సిన జాగ్రత్తలపై దృష్టి పెట్టాలని ఓరుగల్లు వాసులు కోరుతున్నారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- ముదిరాజ్ సంఘం జాతీయ కార్యదర్శి వీరేష్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 8 : ముదిరాజ్‌లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.1000 కోట్ల ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని రాష్ట్ర ముదిరాజ్ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేష్ అన్నారు. ఆదివారం హనుమకొండ కేయూ రోడులోని శారద గార్డెన్స్‌లో ముదిరాజుల ఉమ్మడి జిల్లాల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. దీనికి వీరేష్ హాజరై మాట్లాడారు. ముదిరాజ్‌లను బీసీ-ఎలోకి చేర్చే వరకు పోరాటం చేస్తామన్నారు. కాసీని జ్ఞానేశ్వర్ మార్గదర్శకంలో జాతి హక్కుల కోసం పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల జగదీశ్వర్‌ప్రసాద్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు వన్నాల కృపాసాగర్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు సుభాష్, ములుగు జిల్లా అధ్యక్షుడు ఏర్ల వెంకన్న, జనగామ జిల్లా అధ్యక్షుడు కీర్తి లక్ష్మీనర్సయ్య, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పిట్టల కుమారస్వామి, సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు బుల్లెట్ వెంకన్న, యువజన విభాగం అధ్యక్షుడు శ్రీకాంత్, పుట్టి రాజు, కరాటే రమేష్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ కార్యదర్శి వీరేష్

నర్సంపేట మెడికల్ కళాశాలలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నర్సంపేట టౌన్, సెప్టెంబరు 8: నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన 65 పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సత్యశారద ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. కళాశాలలో ప్రొఫెసర్లు 8 పోస్టులు, అసోసియేట్ ప్రొఫెసర్లు 6 పోస్టులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 30, సీనియర్ రెసిడెంట్లు 18, ట్యూటర్లు మూడు పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు. కళాశాల వెబ్‌సైట్‌లో దరఖాస్తు ఫారంను డౌన్‌లోడ్ చేసుకొని పూరించిన దరఖాస్తులను అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, సెట్ జిరాక్స్ కాపీ, రెండు పాస్‌పోర్ట్ ఫొటోలతో కళాశాలలో వ్యక్తిగతంగా ఈనెల 11 నుంచి 13 వరకు సంప్రదించాలని పేర్కొన్నారు. ఎంపికైన ప్రొఫెసర్లకు నెలకు రూ.1.90లక్షలు అసోసియేట్ ప్రొఫెసర్లకు రూ.1.50లక్షలు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు రూ.1.25లక్షలు సీనియర్ రెసిడెంట్‌లకు రూ.92,527, ట్యూటర్‌లకు రూ.55వేలు ఉంటుందని పేర్కొన్నారు.

నాయినిది అడ్డిమారి గుడ్డిదెబ్బ గెలుపు

- కాళోజీ కళాక్షేత్రంపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నాడు..
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయభాస్కర్


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయభాస్కర్

రాంనగర్, సెప్టెంబరు 8: వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి నాయిని రాజేందర్‌రెడ్డి అడ్డిమారి గుడ్డిదెబ్బలో ఎమ్మెల్యేగా గెలిచి అడ్డదిడ్డంగా మాట్లాడుతున్నాడని, ఆయనకు నియోజకవర్గ సరిహద్దులు కూడా సరిగా తెలియవని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ ఎద్దేవా చేశారు. ఆదివారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.

8నెలల కాంగ్రెస్ పాలనలో ఇచ్చిన ఉద్యోగ నియామక పత్రాలు, చేస్తున్న ప్రారంభోత్సవాలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగినవేనని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి పైసా నిధులు తీసుకురాని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి.. కాళోజీ కళాక్షేత్రంపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నాడని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కాళోజీ కళాక్షేత్రానికి స్థలం, నిధులు ఇచ్చి 90 శాతం పనులు పూర్తి చేసిందన్నారు. కరోనా, ఎన్నికల కోడ్ వల్ల పనులు పూర్తి చేయడంలో కొంత ఆలస్యం జరిగిందన్నారు. కాళోజీ మిత్ర మండలి సభ్యులు, తాను కళాక్షేత్రం కోసం ఎంతో శ్రమించామని గుర్తు చేశారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ పదవి చేపట్టిన కొద్దిరోజుల్లోనే కళాక్షేత్రం నిర్మాణానికి స్థలం, నిధులు ఇచ్చారన్నారు. కళాక్షేత్రం వద్ద కేవలం రంగులు వేసి, చెట్లు పెట్టి అంతా కాంగ్రెస్ చేసిందని నాయిని రాజేందర్‌రెడ్డి గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. తమ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలు పగులగొట్టి కొత్త శిలాఫలకాలు ఏర్పాటు చేసుకుని నాయిని ఫొటోలకు ఫోజులిస్తున్నారని వినయభాస్కర్ ధ్వజమెత్తారు. తమపై, తమ పార్టీపై ఎమ్మెల్యే నాయిని ఆరోపణలు చేస్తూ నీచ రాజకీయాలకు పాల్పడుతున్నాడని ధ్వజమెత్తారు. తమ సహనాన్ని పరీక్షించవద్దని వినయభాస్కర్ హెచ్చరించారు. కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డిని తొర్రి, మొర్రి అని వ్యంగ్యంగా వ్యాఖ్యలు ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ప్రజా క్షేత్రంలో ఉండి ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడిన వారిని నిలదీస్తామని ఆయన హెచ్చరించారు.

హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్ మాట్లాడుతూ.. కాళోజీ కళాక్షేత్రం ఏర్పాటుకు 300 గజాల స్థలం కావాలని గత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరితే ఇవ్వలేదన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన వెంటనే కళాక్షేత్రం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని ఆయన అన్నారు. పనులు పూర్తి కావడంలో కొంత ఆలస్యమైంది వాస్తవమేనన్నారు. అంత మాత్రాన కాంగ్రెస్ చేసినట్లు గొప్పలు చెప్పుకోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా కాళోజీ కళాక్షేత్రం, పెద్దిమోరి పనులు పూర్తి చేసి ప్రారంభించాలని ఆయన సూచించారు. ఈ విలేకర్ల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి నేతలు మర్రి యాదవరెడ్డి, నాగుర్ల వెంకటేశ్వర్లు, పులి రజనీకాంత్, నయీమ్, నార్లగిరి రమేశ్, రవీందర్‌రావు, శరత్, రాజ్‌గోపాల్‌తదితరులు పాల్గొన్నారు.

వినయభాస్కర్.. దమ్ముంటే చర్చకు రా..

- పశ్చిమ అభివృద్ధిపై ప్రజా సమక్షంలో తేల్చుకుందాం..
- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సవాల్

హనుమకొండ సిటీ, సెప్టెంబరు 8: వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రజా సమక్షంలో చర్చకు రావాలని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్‌కు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సవాల్ విసిరారు. ఆదివారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో నాయిని వినయభాస్కర్‌పై మండిపడ్డారు. వినయభాస్కర్ ఓ మహానటుడని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి పేరుతో ప్రజలకు మాయ మాటలు చెప్పి వంచించారని అన్నారు. మాజీ ఎమ్మెల్యేకు 'నట విరాట్' అవార్డు ఇవ్వాలని వ్యంగ్యంగా మాట్లాడారు. వినయ్‌భాస్కర్ ఎమ్మెల్యేగా 15ఏళ్ల కాలంలో, తాను ఎమ్మెల్యేగా 8నెలల కాలంలో పశ్చిమ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, పనితనంపై చర్చకు కూర్చుందామని ప్రకటించారు. ఇందుకు సమయం, వేదిక నిర్ణయాన్ని వినయభాస్కర్‌కే ఇస్తున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధిపై తాను చర్చ విసిరానని, అయితే తన స్థాయిని ఎత్తిచూపి వినయభాస్కర్ తప్పించుకున్నారని చెప్పారు. ఇప్పుడు ఎమ్మెల్యే స్థాయిలో సవాల్ విసురుతున్నానని, వినయభాస్కర్‌కు దమ్ముంటే రావాలని పునరుద్ఘాటించారు.

కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ బాధ్యతను వినయభాస్కర్ పూర్తిగా విస్మరించారని రాజేందర్‌రెడ్డి ధ్వజమెత్తారు. అధికారంలో ఉండి పదేళ్లుగా నిర్మాణాన్ని పూర్తి చేయలేకపోయాడని విమర్శించారు. నిర్మాణ సామగ్రి దొంగలపాలైన దుస్థితి తలెత్తిందన్నారు. కేవలం కమీషన్లు దండుకొని కళాక్షేత్రం నిర్మాణాన్ని గాలికి వదిలేశాడని వినయభాస్కర్‌పై ఆరోపణలు సంధించారు. కళాక్షేత్రం నిర్మాణ లోపాలపై నిట్ నిపుణులు హెచ్చరించినా పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే తాను కళాక్షేత్రం నిర్మాణంపై దృష్టిపెట్టానని చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరిన వెంటనే కళాక్షేత్రం పూర్తికి రూ.45కోట్లు విడుదల చేశాడని చెప్పారు. పదేళ్లుగా వినయభాస్కర్ చేయలేని పనిని, 8 నెలల్లో కళాక్షేత్రం పూర్తికి బాధ్యతగా పని చేశామని రాజేందర్‌రెడ్డి వెల్లడించారు. నయీంనగర్ బ్రిడ్జిని నాలుగు నెలల్లో పూర్తి చేశామని రాజేందర్‌రెడ్డి చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో నగరం ముంపునకు గురైనా వినయభాస్కర్ పట్టించుకోలేదన్నారు. అప్పటి మంత్రి కేటీఆర్ స్వయంగా వచ్చి నయీంనగర్ నాలాను చూసినా ఒరగబెట్టిందేమీ లేదని ఎద్దేవా చేశారు. తాము నయీంనగర్ నాలాను విస్తరించడంతో పాటు రిటైనింగ్ వాలా నిర్మాణం, నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టామన్నారు. ఈ కారణంగా భారీవర్షాలు వచ్చినా ఈసారి నగరం ముంపునకు గురికాలేదన్నారు. ఇది తమ చిత్తశుద్ధికి నిదర్శనమని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

బీఆర్ఎస్ హయాంలో భద్రకాళి మాడవీధులను ప్రతిపాదనలకే పరిమితం చేశారని రాజేందర్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పనులు ఆచరణలోకి తీసుకొచ్చినట్లు వెల్లడించారు. కాజీపేట నూతన బ్రిడ్జిని ఎందుకు పూర్తి చేయలేదో వినయభాస్కర్ జవాబివ్వాలని డిమాండ్ చేశారు. ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కూడా ఆయన పంపిణీ చేయలేదని దుయ్యబట్టారు. నగరాభివృద్ధిని వినయభాస్కర్ పూర్తిగా విస్మరించారని, 15ఏళ్ల పాటు ఎమ్మెల్యేగా తన స్వార్థానికే పని చేశారని ఎమ్మెల్యే నాయిని ఆరోపించారు. కమీషన్లు దండుకోవడమే తప్ప.. మరో ఆలోచనే లేకుండా వ్యవహరించారని, అవినీతి, అక్రమాలు, కబ్జాలతోనే పాలన సాగించారని ఆరోపించారు. బీఆర్ఎస్ జిల్లా కార్యాలయాన్ని ఆక్రమంగా నిర్మించారన్నారు. వినయ్‌భాస్కర్, ఆయన సోదరుడి అక్రమాలు ఒక్కొక్కటిగా బయట పెడతామని రాజేందర్‌రెడ్డి వెల్లడించారు.

త్వరలో సీఎం పర్యటన

సెంట్రల్ ఫైనాన్స్ కమిటీ రాష్ట్ర పర్యటన క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటన వాయిదా పడినట్లు ఎమ్మెల్యే తెలిపారు. త్వరలోనే పర్యటన వివరాలు వెల్లడిస్తామని, ఆ సమయంలో కాళోజీ కళాక్షేత్రం ఇతర అభివృద్ధి పనుల ప్రారంభం ఉంటుందని వివరించారు. ఈ సమావేశంలో జీడబ్ల్యూఎంసీలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, కాంగ్రెస్ నాయకులు బత్తిని శ్రీనివాస్, అజీజ్‌ఖాన్, బంక సరళాదేవి, బంక సంపత్ యాదవ్, డాక్టర్ పాలూరి శ్రవణ్, రవీందర్, మార్క విజయ్, బిన్నీ లక్ష్మణ్, నాగరాజు, కార్పొరేటర్లు శ్రీమాన్, విజయశ్రీ రజాలీ తదితరులు పాల్గొన్నారు.

విద్య ద్వారానే భారత్‌ను విశ్వ గురువును చేయాలి


టీపీయూఎస్ గురుపూజోత్సవంలో సత్కారం పొందిన ఉపాధ్యాయులు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 8: విద్య ద్వారానే భారత్‌ను విశ్వ గురువును చేయాలని, జాతీయ విద్యా విధానం ద్వారా జాతిని పునర్నిర్మాణం చేయాల్సిన బాధ్యత గురువులపై ఉందని ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్‌సీటీఈ, ఐసీఎస్ఎస్ఆర్ సభ్యుడు డాక్టర్ పారుపెల్లి శంకర్ పిలుపునిచ్చారు. తెలంగాణ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని సామాజగన్మోహన్ స్మారక భవన్‌లో గురుపూజోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ శంకర్ ఆహుతులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా డాక్టర్ శంకర్ మాట్లాడుతూ.. మన విద్యా విధానంలో పాశ్చాత్య దేశాల విధానాలను విడనాడాలన్నారు. భారతీయ జీవనవిధానం, సమైక్యత, సాంస్కృతిక విలువలు, జాతీయభావం తదితర భారతీయ విలువలను పెంపొందించేలా జాతీయ విద్యావిధానం ద్వారా విద్యార్థులకు బోధించాలని ఉపాధ్యాయులను కోరారు. బీజేపీ రిటైర్డ్ ఎంప్లాయిస్ సెల్ రాష్ట్ర కన్వీనర్ పులి సరోత్తంరెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలతో పాటు బాధ్యతలను గుర్తెరిగి పనిచేసేంది టీపీయూఎస్ ఉపాధ్యాయులేనని కితాబిచ్చారు. త్వరలో రాబోయే వరంగల్ - ఖమ్మం - నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచే అభ్యర్థిని గెలిపించాలన్నారు. కాగా, ఆహుతుల చేతుల మీదుగా 60 మంది ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించి శాలువా, ప్రశంసాపత్రం, జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమం ప్రారంభంలో ఉప్పుల సహస్ర తేజ ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహుతులను అలరించింది. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల ఏఎంవోలు సుజన్‌తేజ, శ్రీనివాస్, వరంగల్ డీఎస్‌వో డాక్టర్ శ్రీనివాస్, టీపీయూఎస్ రెండు జిల్లాల నాయకులు బత్తిని వీరస్వామి, బత్తిని వెంకటరమణ గౌడ్, ఉప్పుల సతీష్, డాక్టర్ మునికుంట్ల, సంగెం శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు చిదురాల సుధాకర్, పిన్నింటి బాలాజీ రావు, ఎస్. పద్మాకర్‌రెడ్డి, నాంపల్లి శేఖర్‌తో పాటు రెండు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్సీవోపై అసత్య ప్రచారం తగదు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 8: మహాత్మా జ్యోతిబా పూలే వరంగల్ ఆర్సీవో వై.మనోహర్‌రెడ్డిపై విద్యార్థి సంఘాల అసత్య ప్రచారం మానుకోవాలని యూటీఎఫ్ ఎంజేపీ వింగ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి లివింగ్‌స్టన్ హితవు పలికారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మనోహర్‌రెడ్డిపై విద్యార్థి సంఘాలు చేస్తున్న అసత్యపు ఆరోపణలను యూటీఎఫ్ ఎంజేపీ విభాగం తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. మనోహర్‌రెడ్డి అనారోగ్య కారణాలతో తనను వైదొలగించాలని ఎంజేపీ సెక్రెటరీకి విన్నవించుకోవడం వల్లనే ఆయనకు ఉన్న అదనపు బాధ్యతలు తొలగిస్తున్నట్లు సెక్రెటరీ తన ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఇప్పటికైనా మనోహర్‌రెడ్డిపై విద్యార్థి సంఘాల నాయకులు తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని హితవు పలికారు.

యువతి ఆత్మహత్యాయత్నం.. కాపాడిన పోలీసులు


ఆత్మహత్యాయత్నం చేసిన యువతిని కాపాడిన పోలీసులు

మడికొండ, సెప్టెంబరు 8: ఓ యువతి కుటుంబ సభ్యులతో గొడవ పడి మనస్తాపంతో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించగా పోలీసులు కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మడికొండ ఎస్సై రాజబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట సోమిడికి చెందిన భీమ్‌శెట్టి రమకు తన ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవ జరిగింది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన రమ మడికొండలోని అయోధ్యపురం రైల్వే గేటు వద్దకు చేరుకుని ఆత్మహత్య చేసుకోవడానికి పట్టాలపై ఉండగా గేట్‌మెన్ గమనించి 100కు డయల్ చేశాడు. వెంటనే స్పందించిన బ్లూకోల్ట్స్ పోలీసులు అక్కడకి చేరుకొని రమను పక్కకు తీసుకువచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. వివరాలు తెలుసుకొని ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ సూచన మేరకు ఆమెను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా బాధితురాలి తల్లిదండ్రులతో పాటు, పలువురు పోలీసులను అభినందించారు.

జడ్పీ డ్రైవర్ యుగేంధర్‌పై సస్పెన్షన్ వేటు

హనుమకొండ సిటీ, సెప్టెంబరు 8 : హనుమకొండ జిల్లా పరిషత్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్న యుగేంధర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. కలెక్టర్, జడ్పీ స్పెషల్ ఆఫీసర్ ప్రావీణ్య ఈ మేరకు రెండు రోజుల కిందట ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయాన్ని జడ్పీ సీఈవో విద్యాలత ధృవీకరించారు. యుగేంధర్ గతంలో ఓ మంత్రి వద్ద పనిచేస్తున్న సమయంలో ఉద్యోగాల కల్పన పేరుతో డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారం అనేక మలుపులు తిరగడం.. చివరకు పోలీసు కేసు వరకు వెళ్లి యుగేంధర్ కరీంనగర్‌లో జైలు పాలైనట్లు సమాచారం. దీనిపై కూపీలాగిన అధికారులు.. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో నిజానిజాలు పరిశీలించిన తర్వాత రెండురోజుల క్రితం సస్పెన్షన్ వేటువేసినట్లు సమాచారం.

నిబంధనలకు 'మసి'

- వరంగల్ రూరల్ కార్యాలయంలో విచ్చలవిడిగా రిజిస్ట్రేషన్లు
- ఆలస్యంగా వెలుగులోకి సబ్ రిజిస్ట్రార్ దందా

రాంనగర్, సెప్టెంబరు 8 : ప్రభుత్వ నిబంధనలకు మసి పట్టించిన ఒక సబ్ రిజిస్ట్రార్.. విచ్చలవిడిగా ఆస్తుల రిజిస్ట్రేషన్‌లు చేసినట్లు తెలిసింది. గత నెలలో బదిలీపై వెళ్లిన సదరు సబ్ రిజిస్ట్రార్.. పోతూ పోతూ పెద్దఎత్తున మూటగట్టుకుపోయినట్లు సమాచారం. ఆ సబ్ రిజిస్ట్రార్ దశాబ్ద కాలంగా వరంగల్ రూరల్, ఖిలావరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే విధులు నిర్వహించారు. ఈ సమయంలో ఈయనపై పలు ఆరోపణలు వచ్చినా.. ఆర్థిక, యూనియన్ బలంతో ఎవరు ముట్టుకోలేదని సమాచారం ఇటీవలే ఉద్యోగ విరమణ పొందిన ఒక రాష్ట్ర యూనియన్ నేత ఈయనను కాపాడుతుంటాడనే ప్రచారం ఉంది. ఆ నేత ఆశీస్సులతో ఈ రెండు కార్యాలయాల్లో విధులు నిర్వహించిన సదరు సబ్ రిజిస్ట్రార్.. నిబంధనలు బుట్టదాఖలు చేసి రిజిస్ట్రేషన్లు చేసి భారీగానే మూట గట్టుకుని బదిలీపై వెళ్లినట్లు తెలిసింది. తాజాగా సదరు సబ్‌రిజిస్ట్రార్ బాగోతంఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ఖిలా వరంగల్‌లో ఉన్నప్పుడు అందినకాడికి దండుకున్న సదరు సబ్ రిజిస్ట్రార్.. వరంగల్ రూరల్ కార్యాలయంలోనూ ఆదే రీతిన వ్యవహరించి అక్రమ రిజిస్ట్రేషన్‌లు చేసినట్లు సమాచారం. వరంగల్ రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పరిధిలోని ఊకల్ ప్రాంతంలో నిబంధనలు పక్కనపెట్టి ఆస్తుల రిజిస్ట్రేషన్‌లు చేసినట్లు తెలిసింది. ఈ సంఖ్య 40కి పైగానే ఉన్నట్లు తెలిసింది. ఈ రిజిస్ట్రేషన్‌లు మే నెల నుంచి ఆగస్టు వరకు చేసినవి కావడం విశేషం. ఆగస్టు నెల మొదటి వారంలో బదిలీపై వెళ్లిన ఆయన.. ఆ నాలుగురోజుల్లో పదికిపైగానే రిజిస్ట్రేషన్‌లు చేసినట్లు తెలిసింది. ఈ అక్రమ రిజిస్ట్రేషన్‌లకు గజాల చొప్పున వసూలు చేసినట్లు సమాచారం.

గత నెల 23న ఈ సబ్ రిజిస్ట్రార్ గొర్రెకుంట ప్రాంతంలో 30కి పైగా నాన్ లేఅవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లు చేసి గజాల చొప్పున దండుకున్నాడు. ఈ మేరకు నిబంధనలకు విస్మరించి అడ్డగోలు రిజిస్ట్రేషన్‌లు అనే కథనం ప్రచురించిన విషయం తెలిసింది. ప్రభుత్వ నిబంధనలను, ఉన్నతాధికారులను మసిపూసి మారేడుకాయ చేసే సత్తా కలిగిన సదరు సబ్ రిజిస్ట్రార్ దందాపై విచారణ చేస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



అర్హులైన వారందరికీ గృహజ్యోతి విద్యుత్ మీటర్లు

హసన్‌పర్తి, సెప్టెంబరు 7: అర్హులైన వారందరికీ గృహజ్యోతి విద్యుత్ మీటర్లు అందజేస్తామని విద్యుత్ ఏడీ గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గ్రేటర్ 66వ డివిజన్ హసన్‌పర్తిలోని పలు కాలనీల్లో ఏడీ గోవర్ధన్‌రెడ్డి గృహజ్యోతి విద్యుత్ మీటర్లపై అవగాహన కల్పించారు. విద్యుత్ మీటర్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం కేవలం రూ.938లకే విద్యుత్ మీటర్లు అందించే అవకాశం కల్పించిందన్నారు.

అర్హులైన దరఖాస్తుదారులు ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో తీసుకొని దగ్గరలోని విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో లేదా లైన్‌మెన్‌కు ఇచ్చి డబ్బులు చెల్లిస్తే కొత్త విద్యుత్ మీటర్లు అందజేసి విద్యుత్ సదుపాయం కల్పిస్తామని తెలిపారు. ఈ నెల 17న ప్రారంభమయ్యే ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఏడీ వెంట లైన్ ఇన్‌స్పెక్టర్ గోవర్ధన్ రెడ్డి, లైన్‌మెన్ రాజేందర్, జూనియర్ లైన్‌మెన్‌లు శ్రీనివాస్, రాజుకుమార్, సిబ్బంది పోతరాజు రాజు, వాజీద్‌లు ఉన్నారు.

రేపు చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ



సమావేశంలో మాట్లాడుతున్న రావుల సుదర్శన్

వడ్డెపల్లి, సెప్టెంబరు 8: హనుమకొండ భద్రకాళి చెరువు మత్తడి ప్రాంతంలో ఏర్పాటు చేసిన వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ ఈ నెల 10న ఉదయం 10 గంటలకు జరుగుతుందని చాకలి ఐలమ్మ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రావుల సుదర్శన్ తెలిపారు. ఆదివారం హనుమకొండలోని చాకలి ఐలమ్మ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నేతలు అధిక సంఖ్యలోపాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో చాకలి ఐలమ్మ సంక్షేమ సంఘం గౌరవ సలహాదారులు నాగపురి నందయ్య, రావుల శ్రీహరి, ఉపాధ్యక్షుడు నాగపురి సంతోష్, సహాయ కార్యదర్శులు ఎదులాపురం శ్రీనివాస్, రావుల రాజేష్, కోశాధికారులు రావుల రాజు, నాగపురి కిశోర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన గ్రామీణ వైద్యుల సంఘం

ఐనవోలు, సెప్టెంబరు 8 : గ్రామీణ ప్రాథమిక చికిత్సకుల సంఘం(ఆర్‌ఎంపీ,పీఎంపీ) అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్సై పస్తం శ్రీనివాస్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, అసోసియేషన్ అధ్యక్షుడు చిర్ర శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు ఎ.రాజేశ్వర్‌రావు, గౌరవ అధ్యక్షుడు బాసాని సాంబయ్య, కమిటీ సభ్యులు మగిడి రమేష్, తుమ్మ యాకాంతం, కొమ్మజు శ్రవణ్, తమ్మడబోయిన రాజు, మోడెం శ్రీనివాస్, బింగి రమేష్ ఎస్సైని కలిసి శుభాకాంక్షలు చెప్పిన వారిలో ఉన్నారు.



సిగ్నేచర్ ప్లేస్ అపార్టుమెంటులో ప్రతిష్ఠించిన మట్టి సిద్ధి గణపతి



ఐనవోలు మల్లన్న సన్నిధిలో కొలువుతీరిన విఘ్నేశ్వరుడు



మడికొండ ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో కొలువైన గణపతి



నందిహిల్స్ కాలనీ శ్రీజ అపార్ట్‌మెంట్‌లో గణపతికి పూజలు చేస్తున్న భక్తులు



పోలీస్ గృహ సముదాయంలో పూజలో పాల్గొన్న సీపీ అంబర్ కిషోర్ ఝా

కొలువుదీరిన గణనాథులు

మండపాల్లో ప్రత్యేక పూజలు
మార్మోగిన లంబోదరుడి నామస్మరణ

కాళోజీ జంక్షన్, సెప్టెంబరు 8: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా హనుమకొండలోని రాంనగర్ టవర్స్‌లో ఏర్పాటు చేసిన మట్టి గణపతి విగ్రహాన్ని బ్రహ్మశ్రీ దుర్భాకుల వెంకటేశ్వర శర్మ పూజలు నిర్వహించి ప్రతిష్ఠాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్‌రావు, ఉపాధ్యక్షులు గడ్డం ప్రసాద్, కార్యదర్శి ప్రణయ్, సహాయ కార్యదర్శి జన్ను ప్రకాష్, కోశాధికారి దేవేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు. హనుమకొండ కేఎల్ఎన్‌రెడ్డి కాలనీలోని శ్రీరామకృష్ణా సేవా సమితి ధ్యాన మందిరంలో మట్టిగణపతిని ప్రతిష్ఠించారు. గణేష్ విగ్రహ దాత రూపిరెడ్డి రాధిక- గోపాల్‌రెడ్డి దంపతులు తొలిరోజు పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కక్కెర్ల శ్రీనివాస్ స్వామి, కేవీ రావు, మూల తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● న్యూశాయంపేట: 31వ డివిజన్ న్యూశాయంపేటతో పాటు చుట్టుపక్కల కాలనీల ప్రజలు పెద్ద సంఖ్యలో గణపయ్యలు దర్శించుకుంటున్నారు. 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు.

● వడ్డెపల్లి: హనుమకొండ వడ్డెపల్లి ప్రధాన రహదారిలోని టీచర్స్‌కాలనీ ఫేస్ - 1లో గల వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో నెలకొల్పిన గణనాథుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం ఆలయ ప్రాంగణంలో నెలకొల్పిన విఘ్నేశ్వరుడికి ఆలయ కమిటీ అధ్యక్షుడు చిర్ర రఘుపతిరెడి మహిళా భక్తిప్రపత్తులతో కొలిచారు. వడ్డెపల్లి ఎన్జీవోస్ కాలనీలో మండల సమ్మయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడి మండపం వద్ద రాఘవేంద్ర నగర్ ఫేస్ -2 కాలనీ అధ్యక్షుడు కొత్త కనకయ్య, తాళ్లపెల్లి రవీందర్, ఎం. సమ్మయ్య, ఎమ్డీ నిహల్ తదితరులు విఘ్నేశ్వరుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

● ఐనవోలు: ఐనవోలు, నందనం, పంథిని, పున్నేలు, కొండపర్తి, వెంకటాపూర్, ముల్కలగూడెం, నర్సింహులగూడెం, సింగారం, గర్మిళ్లపల్లి, కక్కిరాలపల్లి, వనమాల కనపర్తి, సింగారం, ఒంటిమామిడిపల్లి, ఉడుతగూడెం, లింగమోరిగూడెం, రాంనగర్, పెరుమాండ్లగూడెం గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాల మండపాలను అలంకరించగా పండుగవాతావరణం నెలకొంది.

● కాజీపేట: దర్గా, ప్రశాంత్‌నగర్, సిద్ధార్థనగర్, వెంకటాద్రి నగర్, రహ్మత్‌నగర్, విష్ణుపురి, జూబ్లీమార్కెట్, బాపూజీనగర్, ఇంపీరియల్ కాలనీ, డీజిల్ కాలనీ, బోడగుట్ట తదితర కాలనీలలో వినాయక విగ్రహాలు మండపాల్లో కొలువుదీరాయి. శ్వేతార్క మూలగణపతి దేవాలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాలో భాగంగా రుషి పంచమి పూజలు చేశారు. 47వ డివిజన్ డీజిల్ కాలనీలో జరిగిన గణపతి పూజల్లో రాష్ట్ర ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ జంగా సుజాత రాఘవరెడ్డి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

● హనుమకొండ కలెక్టరేట్: హనుమకొండ సుబేదారిలోని డాల్ఫిన్ రెస్టారెంట్, బేకరీ నిర్వాహకులు సిద్దం రాజయ్య కుమారుడు సిద్దం గణేష్ జయంతిని పురస్కరించుకుని శనివారం సుబేదారిలోని బేకరీ కాంప్లెక్స్ వద్ద వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు గణేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. వేడుకలలో గణేష్ కుటుంబ సభ్యులు రాజయ్య, విజయ, సాయి సూర్యవంశీ, తేజస్విని, సునయన, శ్రీధర్, శ్వేత, మురళీ, రూపారాణి, కిరణ్, పద్మ, సహజ్, స్వరాళి, స్ఫూర్తి, సిరి, శ్రేష్ఠ, సాయితో పాటు బంధు మిత్రులు పాల్గొన్నారు.

● వరంగల్ క్రైం: పోలీసు గృహ సముదాయంలో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి ఉత్సవాలను సీపీ అంబర్ కిషోర్ ఝా ప్రారంభించారు. వినాయక చవితి సందర్భంగా పోలీస్ కుటుంబాలు ఏర్పాటు చేసిన గణష్ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించిన అంబర్ కిషోర్ ఝా పూజలో పాల్గొనగా పండితులు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ ఉత్సవాల్లో అదనపు డీసీపీలు రవి, సంజీవ్, హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



డీజిల్ కాలనీ పూజల్లో పాల్గొన్న జంగా సుజాత రాఘవరెడ్డి దంపతులు

● హనుమకొండ(ఆంధ్రజ్యోతి): హనుమకొండ పరిమళకాలనీ రోడ్డు నెంబర్ 7లోని సిగ్నేచర్‌ప్లేస్ అపార్టుమెంట్‌లో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రముఖ అర్చకుడు రామలింగ శర్మ సాయంత్రం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వేదోక్తంగా నిర్వహించారు. కళషస్థాపన, నవగ్రహపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. విగ్రహదాత రమేష్‌బాబు ఉమారాణి దంపతులు తొలిపూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అపార్టుమెంట్ వెల్ఫేర్ అసోసియేసన్ ప్రధాన కార్యదర్శి మాధవ రావు, కోశాధికారి బాలోజు బ్రహ్మచారి, అడ్లూరు నర్సింహమూర్తి, కమలాకర్ రావు, నరోత్తం రెడ్డి, రాంరెడ్డి, మోహన్‌రెడ్డి, కుమారస్వామి, దయాకర్, లింగమూర్తి, మధుసూదన్‌రెడ్డి, ప్రసాద్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

● హనుమకొండ పోచమ్మకుంటలోని శ్రీ సీతారామ యశోద నిలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మట్టి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అర్చకులు కిరీటి వినాయక విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళప్రతిష్ఠ, నవగ్రహ పూజ నిర్వహించారు. కార్యక్రమంలో గుడిమెళ్ల రమేష్, గోరంట జగన్, బలభద్ర భాస్కర్, కుమారస్వామి, ఇమ్మడి సత్యనారాయణ, బన్ని పాల్గొన్నారు.

● మడికొండ: మడికొండ ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రాంచ్ మేనేజర్ వర్ధినేని రఘుపతిరావు ఆధ్వర్యంలో సిబ్బంది పూజలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల సంబరాలు

మడికొండ, సెప్టెంబరు 8: టీపీసీసీ అధ్యక్షుడిగా బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కాంగ్రెస్ నేత బైరి లింగమూర్తి ఆధ్వర్యంలో మడికొండ చౌరస్తా వద్ద గౌడ సంఘం నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు ఆదివారం సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చారు. పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు బుర్ర రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు మాచర్ల రాజ్‌కుమార్, డైరెక్టర్లు మునిగాల సదానందం, బైరి రాజు, బొల్లికొండ సంపత్, మోడెం సతీష్ తండ అఖిల్, కొత్తకొండ వెంకటేశ్వర్లు, కొత్తకొండ వినయ్, బైరి నాగులు, కళ్ళెపు నర్సయ్య, మెటుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, కాంగ్రెస్ నాయకులు కుర్ల మోహన్, వస్కుల శంకర్, బైరపాక వేణు, బత్తుల సుమన్, దండిగం వెంకట్, అర్జున్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి: తెలంగాణ కాంగ్రెస్ నూతన పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయనను కలిసిన వారిలో హనుమకొండ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పింగిళి వెంకట్రాంనర్సింహారెడ్డి, వరంగల్ లీగల్ సెల్ అడ్వజర్ నిమ్మని శేఖర్‌రావు తదితరులున్నారు.



టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

బాధితురాలికి ఆర్థిక సాయం

వడ్డెపల్లి, సెప్టెంబరు 8: హసన్‌పర్తి మండలం కోమటిపల్లి తండాకు చెందిన భానోతు ప్రేమ- రాజేష్‌ల కూతురు చిన్నారి ప్రతీక్ష తలసేమియా వ్యాధితో బాధపడుతోంది. విషయాన్ని తెలుసుకున్న విద్యా ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు బిల్ల మహేందర్ ఆదివారం హనుమకొండ వడ్డెపల్లి చర్చి జంక్షన్‌లోని ఒయాసిస్ అనాథాశ్రమంలో ప్రతీక్ష వైద్య ఖర్చుల నిమిత్తం రూ.50వేల ఆర్థిక సహాయం చెక్కును తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో విద్యా ఫౌండేషన్ సభ్యులు, దాతలు అప్పాల శకుంతల, గజ్జెల స్వరూపరాణి, రామోజుల సురేఖ, మద్దెర్ల అనిత, కాంచనపల్లి అనిత, వైద్యం వాణిరాణి, మహ్మద్ రఫీ, కార్తీక రాజు, కొక్కుల కృష్ణ, కడుదుల సోమన్న, మంద చంద్రశేఖర్, ఆశ్రమ నిర్వాహకులు ఒద్దిరాజు చంద్రప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కాళోజీ కళాక్షేత్రం వద్ద రగడ

● పరిశీలించేందుకు వెళ్లి వినయ్.. అడ్డుకున్న సీఐ..
● గంటపాటు ఉద్రిక్తత

రాంనగర్, సెప్టెంబర్ 8: కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులను పరిశీలించేందుకు వెళ్లిన బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వినయభాస్కర్‌ను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వినయ్‌కు, సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డికి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో కాళోజీ కళాక్షేత్రం ఆవరణలో గంటసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వివరాల్లోకి వెళితే..

బీఆర్ఎస్ నేతలతో కలిసి ఆదివారం వినయభాస్కర్ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంకు వెళ్లి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆవరణలో మీడియాతో మాట్లాడేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో తన సిబ్బందితో అక్కడికి వచ్చిన సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి.. ఆవరణ నుంచి బయటికి వెళ్లాలని వినయభాస్కర్ నుద్దేశించి కోరారు. ఇక్కడ మీడియాతో మాట్లాడకూడదని సీఐ హుకుం జారీ చేశారు. సీఐ వ్యాఖ్యలకు ఆగ్రహం వ్యక్తం చేసి వినయభాస్కర్.. ఆయనతో వాగ్వాదానికి దిగారు. తమను ఎందుకు వెళ్లమంటున్నారని, మేమేమైనా శాంతి, భద్రతలకు విఘాతం కలిగించామా? అని ప్రశ్నించారు. శాంతియుతంగా పరిశీలిస్తున్నాం కదా..? కేసులు పెట్టుకుంటారా..? పెట్టుకోండి.. భయపడేది లేదన్నారు. ఆవరణలో మాట్లాడకూడదని, బయటికి వెళ్లాల్సిందేనని సీఐ కరాఖండిగా చెప్పారు. దీంతో ఇరువురి మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. ఇక్కడి నుంచి కదలనని, ఇక్కడే మీడియాతో మాట్లాడతానని వినయభాస్కర్ భీష్మించుకుకూర్చున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో సీఐ వెనక్కితగ్గారు. అనంతరం వినయభాస్కర్ మీడియాతో మాట్లాడి.. వెంట వచ్చిన నేతలతో కలిసి వెళ్లిపోయారు.



సీఐపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వినయభాస్కర్

అభివృద్ధి పేరుతో భూకబ్జాలు, సెటిల్‌మెంట్లు

వినయభాస్కర్‌పై ఎమ్మెల్యే నాయిని ధ్వజం



కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

బాలసముద్రం, సెప్టెంబరు 8: మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ 15 యేళ్లలో భూకబ్జాలు, సెటిల్‌మెంట్లతో ప్రజలను ఇబ్బంది పెట్టాడని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్ర నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను గెలిచిన 8 నెలల్లో కాళోజీ కళాక్షేత్రం పనులు, నాయింనగర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. కాళోజీ నిర్మాణ పనుల కోసంరూ. 45 కోట్లు మంజూరు చేసి పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే భూకబ్జాలు చేసి ప్రజలను ఇబ్బంది పెట్టినట్లు తెలిపారు. వినయ్‌భాస్కర్ కుటుంబసభ్యులు చేసిన అక్రమాలపై స్థానిక ప్రజలు విసుగుచెంది ఎన్నికల్లో ఓటుతో బుద్ధిచెప్పారని అన్నారు. ఇప్పటికైనా వినయ్‌భాస్కర్ తన తప్పును తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బంక సరళ, సంపత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఏసోబుకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి నివాళి

మడికొండ, సెప్టెంబరు 8 : ఇటీవల దంతెవాడ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మాచర్ల ఏసోబుకు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి నివాళులు అర్పించారు. ఆదివారం ఎమ్మెల్యే శ్రీహరి కాజీపేట మండలం టేకులగూడెంలోని ఏసోబు ఇంటికి చేరుకొని ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఆయన కుమారుడు మహేష్, కుటుంబ సభ్యులను పరామర్శించారు.



ఏసోబు చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

ఐనవోలు, సెప్టెంబరు 8 : రైతులందరికీ రూ.2 లక్షల వరకు రుణమాఫీ జరిపి రైతు భరోసా(రైతు బంధు)పై స్పష్టత ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం మండల సమావేశం మండల నాయకుడు కొంకాల నారాయణరెడ్డి అధ్యక్షతన శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న చక్రపాణి మాట్లాడుతూ.. రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయడంతోపాటు రైతు భరోసా అమలు చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీ పూర్తిస్థాయిలో అమలు చేయకుండా రైతులను ఒక వైపు ప్రభుత్వం మరోవైపు బ్యాంకు అధికారులు ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. హనుమకొండ వడ్డెపల్లిలో కొనసాగుతున్న ఐనవోలు ఎంపీడీవో కార్యాలయాన్ని తక్షణమే ఐనవోలుకు మార్చి ఐనవోలులో నూతన పోలీస్‌స్టేషన్ భవనం, ప్రభుత్వ సముదాయాల భవనాలు నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకోరావాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీలకు సమకూర్చుకొని ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు గుండెకారి మహేందర్, దర్శనాల సంపత్, గజ్జెట రామ్‌కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ రావి నారాయణ రెడ్డి జయంతి

బాలసముద్రం, సెప్టెంబరు 8: మాజీ ఎంపీ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పని చేసిన రావి నారాయణరెడ్డి 33వ వర్ధంతిని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఆధ్వర్యంలో ఘనంగా శనివారం నిర్వహించారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో రావి నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, కొట్టపాక రవి, వేల్పుల సారంగపాణి, సుదర్శన్, రమేష్ దేవా, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కల్పనాదేవి జయంతి

హనుమకొండ సిటీ, సెప్టెంబరు 8: మాజీ ఎంపీ డాక్టర్ కల్పనాదేవి జయంతి కార్యక్రమం హనుమకొండలోని జయ ఆస్పత్రి ఆవరణలో శనివారం జరిగింది. మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కానుగంటి శేఖర్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్పనాదేవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సిబ్బందికి కానుగంటి శేఖర్ దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వేముల శ్రీనివాస్‌తో పాటు చీకటి రాజు తదితరులు పాల్గొన్నారు.

జై.. జై.. గణేషా..

(3వ పేజీ తరువాయి)

నర్సింహస్వామి ఆలయ ప్రధానార్చకుడు బూర్గుల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పూజాధికాలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఆదివారం పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. బ్రాహ్మణ వాడలో ఈసారి నాలుగు చోట్ల విగ్రహాలను ప్రతిష్ఠింపచేశారు. భీమారం సమీపంలోని శ్రీసాయి అపార్ట్‌మెంట్‌లో గణపతి ఉత్సవ వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. మహిళలు 21 రకాల నైవేద్యాలను సమర్పించి నవరాత్రివేడుకలను ప్రారంభించారు.

హనుమకొండ విద్యారణ్యపురిలోని విజయ గణపతి ఆలయంలో ప్రతీ ఏటా మాదిరిగా ఈసారి కూడా పెద్దఎత్తున నవరాత్రి ఉత్సవాలను ప్రారంభింపజేశారు. కాజీపేటలోని శ్వేతార్కమూల ఆలయంలో పెద్ద ఎత్తున నవరాత్రివేడుకలు ప్రారంభమయ్యాయి. నగరమంతా ఆధ్యాత్మిక శోభతో భక్తి పాటల మైకుల హోరుతో నినదిస్తున్నారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని వినాయక మండలిని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ పాల్గొని పూజలు నిర్వహించారు. నగరంలోని అన్ని అపార్ట్‌మెంటుల్లో పెద్దఎత్తున గణేష్ నవరాత్రి వేడుకలను నిర్వహిస్తున్నారు. హనుమకొండ టైలర్‌స్ట్రీట్, కుమార్‌పల్లి, గుడిబండల్, ఎక్సైజ్ కాలనీ, రెవెన్యూ కాలనీ, అడ్వకేట్స్ కాలనీలలో పెద్ద ఎత్తున వేడుకలు ప్రారంభమయ్యాయి.

నేడు కేయూలో కాళోజీ జయంతి వేడుకలు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 8: ప్రజాకవి, పద్మభూషణ్ కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకలను సోమవారం కేయూ పరిపాలన భవనం నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులందరూ హాజరుకావాలని కోరారు.

బల్దియాలో నేడు ప్రజావాణి కార్యక్రమం

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 8: నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతీ సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం జరుగనుందని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
సోమవారం • 9 సెప్టెంబరు 2024
features@andhrajyothy.com

కిట్ టిప్‌టాప్‌గా..

మేకప్



మేకప్ కోసం ఉపయోగించే సాధనాలు నాణ్యంగా ఉన్నప్పుడే, సౌకర్యంగా మేకప్ వేసుకోవడం సాధ్యపడుతుంది. మేకప్ ఉత్పత్తులతో ముఖ చర్మం దెబ్బ తినకుండా ఉండాలన్నా, వేసుకున్న మేకప్ చెక్కుచెదరకుండా ఉండాలన్నా కొన్ని నాణ్యమైన సాధనాలకు తప్పనిసరిగా మేకప్ కిట్‌లో చోటు కల్పించాలి.

● **క్రయో స్టిక్స్:** చర్మం నునుపుగా, బిగుతుగా ఉంటే, మేకప్ ముఖం మీద సమంగా పరుచుకుంటుంది. కాబట్టి చర్మపు ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించి, మృదువుగా, బిగుతుగా మార్చే క్రయో స్టిక్స్‌తో మేకప్‌కు ముందు చర్మాన్ని మర్దన చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల చర్మం మీది సన్నని గీతలు తొలగిపోయి, ముడతలు లేని నున్నని చర్మం సొంతమవుతుంది.

● **మేకప్ అప్లికేటర్:** అప్లికేటర్ మేకప్ ఉత్పత్తిని పీల్చుకునేలా ఉండకూడదు. మేకప్‌ను ముఖ చర్మం మీద బ్లెండ్ చేసేలా ఉండాలి. కాబట్టి కాంపాక్ట్ అద్దుకోవడం కోసం సాధారణ స్పాంజ్‌కు బదులుగా మేకప్ అప్లికేటర్‌ను ఎంచుకోవాలి. నాణ్యమైనదాన్ని ఎంచుకుంటే ఎక్కువ కాలం మన్నడంతో పాటు ఫలితం కూడా మెరుగ్గా ఉంటుంది.

● **ఫౌండేషన్ బ్రష్:** ఫౌండేషన్ అద్దుకోవడానికి డ్యుయల్ ఎండెడ్ బ్రష్‌ను ఉపయోగించడం వల్ల ఫౌండేషన్ ముఖమంతా సమంగా పరుచుకుంటుంది. రెండు పరిమాణాల్లో ఉండే ఈ బ్రష్‌ను అవసరాన్ని బట్టి ముఖంలోని వేర్వేరు ప్రదేశాల్లో ఉపయోగించుకోవచ్చు. బుగ్గల మీద బ్లషర్ కోసం పెద్ద బ్రష్‌నూ, కనురెప్పల మీద ఐషాడో అప్లికేషన్ కోసం చిన్న బ్రష్‌నూ వాడుకోవాలి.

● **ఐల్యాష్ కర్లర్:** కనురెప్పలు వింజామరల్లా ఒత్తుగా మారాలంటే ఐల్యాష్ కర్లర్‌ను తప్పక ఉపయోగించాలి. కనురెప్పల్లోని వెంట్రుకలన్నీ సమంగా వంపు తిరిగడానికి ఈ పరికరం ఉపయోగపడుతుంది.

● **బాడీ బ్రష్:** బాడీ బ్రాంజర్ అద్దుకోడానికి స్పాంజ్, సాధారణ బ్రష్‌లకు బదులుగా బాడీ బ్రష్‌ను ఉపయోగించాలి. ఇలా చేస్తే బ్లష్‌తో చర్మం సహజసిద్ధ మెరుపును సంతరించుకుంటుంది.

● **బ్లాటింగ్ పేపర్స్:** మేకప్ చెదిరిపోకుండా అదనపు మేకప్ మెరుపును తొలగించడానికి బ్లాటింగ్ పేపర్లు అద్భుతంగా ఉపయోగపడతాయి. వీటినెప్పుడూ వెంట ఉంచుకోవాలి.

- మేకప్ రిమూవర్ ప్యాడ్స్: రీయూజబుల్ మైక్రోఫైబర్‌తో తయారైన మేకప్ రిమూవర్ ప్యాడ్స్‌తో చర్మ రంధ్రాల్లో ఇంకిపోయిన మేకప్ సైతం చక్కగా తొలగిపోతుంది.



మదురై శుభశ్రీకి ఔషధ మొక్కల పెంపకమంటే కాలక్షేపం కాదు. ప్రాచీన వైద్య సంప్రదాయాల్ని పరిరక్షించే ఒక యజ్ఞం. అయిదువందలకు పైగా అరుదైన జాతులకు నెలవైన ఆమె ఔషధ వనం ఇప్పుడు పరిశోధనా విద్యార్థులకు అధ్యయన కేంద్రంగా మారింది.

ఔషధ మొక్కల టీచర్!

అది తమిళనాడులోని మదురైకి దగ్గర్లోని వరిచియూర్‌లో ఉన్న తోట. యాభై అయిదేళ్ళ మహిళ.. ఒక్కొక్క మొక్క దగ్గరా ఆగుతూ... వాటి విశిష్టతను వివరిస్తూ ఉంటే... స్టడీ టూర్‌లో భాగంగా అక్కడికి వచ్చిన విద్యార్థులు శ్రద్ధగా వింటున్నారు. చాలా సాధికారికంగా వాటి గురించి ఆమె చెప్పడం చూసి ఆశ్చర్యపోతున్నారు. "వృత్తి రీత్యా నేను టీచర్‌ని. ఎవరికి ఎలా చెబితే అర్థమవుతుందో నాకు తెలుసు" అంటారామె నవ్వుతూ. ఆమె పేరు బి.శుభశ్రీ. ఆ తోటలోని ప్రతి మొక్క ఆమె చేతుల మీదుగా పెరిగిందే. అపురూపమైన ఈ తోట... ఆమె అకుంఠిత దీక్షకు ప్రతిరూపం.

ఆ అనుభవంతోనే...

"ఔషధ మొక్కల మీద నా ఆసక్తి ఈనాటిది కాదు. దాదాపు నలభయ్యేళ్ళ క్రితం మా నాన్నను పాము కరిచింది. అప్పట్లో ఇన్ని వైద్య సౌకర్యాలు లేవు. పాము కాటును నయం చేసే ఒక మొక్క గురించి తెలిసి... దాని కోసం చుట్టుపక్కల ప్రాంతాలన్నీ గాలించాం. చివరికి సంపాదించాం. మా నాన్న ప్రాణం దక్కింది. ఈ అనుభవమే... వైద్యానికి ఉపయోగపడే మొక్కల గురించి ఇంకా తెలుసుకోవాలనే తపన పెరిగింది. వాటిని సేకరించి, పెంచడం ప్రారంభించాను" అని గుర్తు చేసుకున్నారు శుభశ్రీ. చదువు పూర్తి చేసుకొని ఆమె ఉపాధ్యాయ వృత్తిలో చేరారు. ఉద్యోగ బాధ్యతల్లో, కుటుంబ బాధ్యతల్లో తీరికలేకుండా ఉన్నా... మొక్కలను సంరక్షించే పని మాత్రం వదిలిపెట్టలేదు. అలా కొన్ని వందల మొక్కలకు తన పెరట్లో ఆమె ఆశ్రయం కల్పించారు. "అయితే వాటి గురించి నా పరిచయస్తులకు తప్ప మరెవరికీ పెద్దగా తెలీదు. నేనూ పెద్దగా ప్రచారం చేసుకోలేదు. కానీ కొవిడ్ మహమ్మారి విజృంభించడంతో ఆయుర్వేదం ప్రయోజనాలను చాలామంది గుర్తించారు. ప్రత్యేకించి సిద్ధ ఔషధమైన 'కబాసుర కుడినీర్'ను ఇమ్యూనిటీ పెరుగుదల కోసం తమిళనాడు ప్రభుత్వం ప్రోత్సహించింది. ఇది నేను కొత్త దిశలో ఆలోచించేలా చేసింది" అంటారు శుభశ్రీ. మధురైకి పదిహేడు కిలోమీటర్ల దూరంలోని వరిచియూర్‌లో... తమ నలభై సెంట్ల భూమిలో ఔషధ మొక్కల వనాన్ని ఆమె ప్రారంభించారు. సాగునీటి కోసం బోర్‌వెల్, మొక్కల రక్షణ కోసం ఇనుప కంచె ఏర్పాటు లాంటివాటికి చాలా ఖర్చుచేశారు. దానికి ఆమె భర్త, పిపిఎఫ్‌ఓ మాజీ ఉద్యోగి బి.బాబు పూర్తి సహాయసహకారాలు అందించారు. ప్రస్తుతం ఆ తోటలో 500కు పైగా అరుదైన, విశిష్టమైన ఔషధ మొక్కలు ఉన్నాయి. ప్రతి దాని స్థానిక పేరును, శాస్త్రీయ నామాన్ని, ప్రయోజనాలను శుభశ్రీ చాలా వివరంగా నమోదు చేశారు. ఆమెను అందరూ 'ఔషధ మొక్కల టీచర్' అని ఆప్యాయంగా పిలుస్తారు.

సంప్రదాయానికి కొనసాగింపు

అయితే అపురూపమైన ఔషధ మొక్కల కోసం తను సాగిస్తున్న అన్వేషణ అంత సజావుగా సాగడం లేదంటారు శుభశ్రీ. "ఆయుర్వేద వైద్యుల ద్వారా, వృక్షశాస్త్ర నిపుణుల ద్వారా, పెద్దల ద్వారా, పుస్తకాల ద్వారా గొప్ప మొక్కల గురించి తెలుసుకుంటూ ఉంటాను. వాటి కోసం ప్రయత్నిస్తాను. కొన్ని నర్సరీలు నకిలీ మొక్కల్ని లేదా ఎదగడానికి అవకాశం లేని నాసిరకం మొక్కల్ని అంటగడుతూ ఉంటాయి. కొన్ని మొక్కల్ని సంపాదించడం చాలా కష్టం. ఒకసారి ఒక నర్సరీలో జలుబు నివారణతో పాటు క్యాన్సర్ రోగులకు స్వస్థత కలిగించే ఒక మొక్క ఉందని తెలిసింది. అక్కడికి వెళ్ళాను. తమ దగ్గర అవి లేవని యజమాని చెప్పాడు. మూడు నెలల తరువాత అతను నాకు కాల్ చేసి... ఆ మొక్క ఉంది. రమ్మన్నాడు. అది కొనడానికి వెళ్తే... స్టాక్ అయిపోయిందన్నాడు. నాకు కోపం, నిరాశ కలిగాయి. వెనక్కి వస్తూ ఉంటే... అక్కడ పని చేస్తున్న ఒక పెద్దాయన నా దగ్గరకు వచ్చారు. నేను పడుతున్న తాపత్రయాన్ని అర్థం చేసుకున్నానని చెబుతూ... నా ఫోన్ నెంబర్ తీసుకున్నారు. "అది వస్తే నేను కొని, నా దగ్గర ఉంచుతాను. మీకు సమాచారం ఇస్తాను. వచ్చి తీసుకోండి" అన్నారు. రెండు వారాల తరువాత ఆయన మాట నిలబెట్టుకున్నారు" అని చెప్పారు శుభశ్రీ. ఇప్పుడు ఆమె గార్డెన్ విద్యార్థులకు, పరిశోధకులకు, వృక్ష ప్రేమికులకు ఒక రిసోర్స్ సెంటర్‌గా మారింది. అనేక ప్రాంతాల నుంచి విద్యార్థులు స్టడీ టూర్ల కోసం అక్కడికి వస్తున్నారు. ప్రతి మొక్క ప్రాధాన్యత గురించి వారికి శుభశ్రీ వివరిస్తారు. వారు విశ్రాంతి తీసుకోవడం కోసం చిన్న కుటీరం లాంటి ఏర్పాట్లను కూడా చేశారు. అంతేకాదు... ఔషధ మొక్కల విలువ, అవసరం, సంరక్షణ గురించి ప్రజలకు తెలియజెయ్యడానికి వర్క్‌షాపులను, అవగాహన తరగతులను నిర్వహిస్తున్నారు. ఆ చుట్టుపక్కల ఔషధ మొక్కలు పెంచాలనుకొనేవారికి తనవంతు సాయం చేస్తున్నారు. "ఇది కేవలం మొక్కల సేకరణ మాత్రమే కాదు. ఇది సంప్రదాయ విజ్ఞాన సంప్రదాయానికి కొనసాగింపు. ప్రాచీన వైద్యవిధానాల పట్ల అవగాహనను పెంపొందించే ప్రయత్నం. ఈ గార్డెన్ లక్ష్యం... కేవలం సేంద్రియంగా ఔషధ మొక్కలను పెంచడం మాత్రమే కాదు... వాటికి సంబంధించిన అమూల్యమైన విజ్ఞానాన్ని పదిలపరచి, భవిష్యత్ తరాలకు అందించడం, ఇంటింటా ఒక హెర్బల్ గార్డెన్ ఏర్పాటును ప్రోత్సహించడం కూడా" అంటున్నారు శుభశ్రీ.

మైసూరు రోడ్ల మీద బిచ్చమెత్తుకున్న ఆమె... ఇప్పుడు తన కూతుర్ని జాతీయ స్థాయి కిక్‌బాక్సర్‌గా తీర్చిదిద్దింది. సమాజంలో తనకు దక్కని గౌరవాన్ని తన బిడ్డకు అందించింది. ఒకప్పుడు కన్నవారికే భారమై... అవమానాలు, అవహేళనలే జీవితమై... గడిపిన ఆమె నేడు ఎందరో తల్లులకు ఆదర్శంగా నిలిచింది. 65 ఏళ్ల ట్రాన్స్‌జెండర్ మహిళ షబనా అంతరంగం ఇది.

కూతురు కలే తనదిగా..!





"పుట్టినప్పుడు మా అమ్మానాన్నలు నాకు పెట్టిన పేరు అక్రమ్ పాషా. కానీ పెరిగే క్రమంలో నాలో ఏవో విభిన్న భావాలు. చుట్టుపక్కల పిల్లల్లో నేను ప్రత్యేకంగా కనిపించేదాన్ని. అందరూ నన్ను వింతగా చూడడం మొదలుపెట్టారు. ఇది మా ఇంట్లోవాళ్లకు ఇబ్బందిగా మారింది. నేనేమిటో నాకు అర్థమయ్యేసరికి ఇంటికి దూరమయ్యాను. చెప్పాలంటే ట్రాన్స్‌జెండర్‌నని తెలిసి కన్నవారే నన్ను తరిమేశారు. దిక్కు తోచని స్థితిలో మైసూరు రోడ్లే నాకు దిక్కయ్యాయి. దీనికితోడు అవమానాలు, అవహేళనలు. ఆకతాయిలు ఆట పట్టించేవారు. సమాజంలో నాకంటూ ఒక చోటు లేదు. ఎక్కడికి వెళ్లినా పని దొరకలేదు. అన్నిటినీ భరించాను. అలా కొన్నేళ్లు గడిచాక పలు స్వచ్ఛంద సంస్థలు నన్ను చేరదీశాయి. ఆ సంస్థల సహకారంతో అక్కడా ఇక్కడా పని చేసుకొంటూ జీవించడం మొదలుపెట్టాను. నాతోపాటు నాలాంటి మరికొందరి జీవితాలకు కూడా ఆసరా చూపే ప్రయత్నం చేశాను.

ఆడపిల్లల్ని దత్తత తీసుకుని...

సమాజం నన్ను వెలివేసినా... కొందరి చేయూతవల్ల నేను స్వతంత్రంగా నిలబడగలిగాను. కానీ నా కష్టాలకు తోడు అనుకోని బరువు నా భుజాలపై పడింది. నా కజిన్‌కు నలుగురు ఆడపిల్లలు. పోషించే స్తోమత లేక వారిని రోడ్డుపాలు చేశాడు. సరైన నీడ, తిండి దొరక్క అవస్థలు పడుతున్న ఆ పిల్లల్ని చూసి నా గుండె బరువెక్కింది. మరో ఆలోచన లేకుండా ఆ నలుగురు ఆడపిల్లల్నీ నేను దత్తత తీసుకున్నాను. నాకు తెలుసు... నా జీవితం గడవడమే కష్టంగా ఉంది. అయినా నేను కాకపోతే ఆ చిన్నారులకు దిక్కెవరు? అందుకే ఆ సమయంలో నేను మరేమీ ఆలోచించలేదు. ఎలాగో వారిని పోషించుకొంటూ వచ్చాను.

ఆటపై మక్కువ చూసి...

నా నలుగురు అమ్మాయిల్లో బీబీ ఫాతిమా కాస్త భిన్నంగా కనిపించింది. ఇరవయ్యేళ్ల కిందట తను మా ఇంటికి వచ్చింది. తనకు కిక్‌బాక్సింగ్ అంటే చాలా ఇష్టం. ఒక దృశ్యం నన్ను బాగా కదిలించింది. అప్పుడు ఫాతిమాకు పన్నెండేళ్లు. ఒక రోజు తన కిడ్డీ బ్యాంక్ పగులగొట్టి, అందులో దాచుకున్న నాణేలు తీసుకుని, స్థానిక 'ఎలైట్ కిక్‌బాక్సింగ్ అకాడమీ'కి వెళ్లింది. ఆ డబ్బును వారి చేతిలో పెట్టి... తనకు కిక్‌బాక్సింగ్ నేర్పమని అడిగింది. అది చూసి నా కళ్లు చెమర్చాయి. అంత చిన్న వయసులో ఆట నేర్చుకోవాలన్న తన పట్టుదల నా ఆలోచనల్ని మార్చేసింది. రోజు గడవడం కష్టంగా ఉన్నా సరే... ఫాతిమాను అత్యున్నత క్రీడాకారిణిగా తీర్చిదిద్దాలనుకున్నా. ఆ రోజు నుంచి తన కలను నా కలగా మార్చుకున్నా.

నాకే దక్కినంత ఆనందం...

ఫాతిమాను రోజూ వెంటబెట్టుకుని అకాడమీకి తీసుకువెళ్లేదాన్ని. తను లోపల శిక్షణ తీసుకొంటుంటే... నేను బయట కూర్చొనేదాన్ని. ఒక్కోసారి ఉండబట్టలేక లోపలకు వెళ్లి తన సాధన చూసేదాన్ని. నా మనసు ఉప్పొంగిపోయేది. నా కష్టాన్ని నా బిడ్డ అర్థం చేసుకుంది. తన కోసమే కాదు... నా కళ్లల్లో మెరుపు కోసం కూడా తను కష్టపడింది. కోచ్ జస్వంత్, 'కర్ణాటక కిక్‌బాక్సింగ్ అసోసియేషన్' కార్యదర్శి రవి ఫాతిమాకు అండగా నిలిచారు. చక్కని మార్గదర్శనం చేసి... నైపుణ్యానికి పదును పెట్టారు. కోచ్‌లు ఫాతిమాను ప్రశంసిస్తుంటే... అవి నాకే దక్కినంత సంతోషించేదాన్ని.

> **అమ్మే నా బలం...**
> "ఇవాళ కిక్‌బాక్సర్‌గా ఇంతటి కీర్తి గడిస్తున్నానంటే అది మా అమ్మ గొప్పతనమే. తను నా కోసం ఎన్నో త్యాగం చేసింది. అవమానాలు భరించింది. కష్టాలు అనుభవించింది. చిన్నప్పుడే నాలోని ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించింది. ఆఖరికి నా కలను తన లక్ష్యంగా మలుచుకుని ఇన్నేళ్లుగా అవసరమైనవన్నీ సమకూర్చింది. ఇప్పుడు నా విజయాన్ని తనదిగా ఆస్వాదిస్తోంది. నా బలం మా అమ్మే. మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించి అమ్మ గర్వపడేలా చేయడమే నా లక్ష్యం." అంటుంది ఫాతిమా.

కలలకు ప్రతిరూపం...

ఇప్పుడు ఫాతిమాకు ఇరవయ్యేళ్లు. పసిబిడ్డగా నా ఇంటికి వచ్చిన తను... ఎంతో ఎత్తుకు ఎదిగింది. నా కలలకు ప్రతిరూపమైంది. జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయి కిక్‌బాక్సింగ్ పోటీల్లో రాణించి ఎన్నో పతకాలు గెలుచుకుంది. ఇటీవలే ముగిసిన 'కర్ణాటక స్టేట్ క్యాడెట్' 46 కేజీల మహిళల లైట్ వెయిట్ విభాగంలో జూనియర్, సీనియర్, మాస్టర్ కిక్‌బాక్సింగ్ చాంపియన్‌షిప్‌ల్లో స్వర్ణ పతకాలు సాధించింది. అంతేకాదు... ఇతర రాష్ట్రాల్లో జరిగి న ఓపెన్ చాంపియన్‌షిప్‌లో కూడా అద్భుత విజయాలు నమోదు చేసింది. ప్రస్తుతం వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే జాతీయ కిక్‌బాక్సింగ్ పోటీలకు సన్నద్ధమవుతోంది.

అవమానాలు దాటి...

ఫాతిమా నా బిడ్డ మాత్రమే కాదు... నా గౌరవం కూడా. ఆమె విజయాలు నాకు గర్వకారణం. తననే కాదు... మిగిలిన పిల్లల్ని కూడా ఉన్నంతలో చదివిస్తున్నా. వారికి నచ్చిన రంగంలో ప్రోత్సహిస్తున్నా. అయితే నాలాంటివారి పట్ల ఈ సమాజం వివక్ష చూపుతుంది. ఏదో అపరాధం చేసినట్టు పరిగణిస్తుంది. కానీ మేమూ మనుషులమే. మాలోనూ ప్రేమ, వాత్సల్యం, సమాజం పట్ల బాధ్యత ఉన్నాయి. ఈ లోకం మమ్మల్ని చూసే దృష్టి మారాలి. ఆ దిశగా నావంతు ప్రయత్నం చేస్తున్నాను. నాలాంటివారికి స్ఫూర్తిగా నిలిచి, వారి అభ్యున్నతికి బాటలు వేయాలనే సంకల్పంతో ముందుకు వెళుతున్నాను."



నవ్య | చిత్రజ్యోతి



వెల్‌కమ్ బేబీ గర్ల్

రణ్‌వీర్ సింగ్, దీపిక పదుకొణే దంపతులు తల్లితండ్రులయ్యారు. ముంబైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆదివారం ఉదయం దీపిక ఆడబిడ్డకు జన్మనిచ్చారు. 'వెల్‌కమ్ బేబీ గర్ల్' అని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టి వారి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ దంపతులకు పలువురు సెలబ్రిటీలు శుభాకాంక్షలు తెలిపారు.

దృశ్యకావ్యంలా...



మలయాళ నటుడు టొవినో థామస్ నటించిన 50వ చిత్రం 'ఏ.ఆర్.ఎమ్' (అజాయంతే రండం మోషణం). కృతిశెట్టి, ఐశ్వర్య రాజేశ్, సురభి లక్ష్మీ హీరోయిన్స్‌గా నటించిన ఈ చిత్రాన్ని జితిన్ లాల్ తెరకెక్కించారు. లిస్టిన్ స్టీఫెన్ నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతున్న సందర్భంగా టొవినో థామస్ మీడియాతో ముచ్చటించారు. "ఇదో విభిన్న తరహా చిత్రం. ఇందులో నేను మూడు రకాల పాత్రలు పోషించాను. ఈ సినిమా కోసం యుద్ధవిద్యలు నేర్చుకున్నాను. దర్శకుడు జితిన్ సినిమాను అనుకున్నదానికంటే గొప్పగా తెరకెక్కించాడు. ఇందులో యాక్షన్ సన్నివేశాలు అధికంగా ఉంటాయి. దర్శకుడు ఈ కొత్తదనం కోరుకునే ప్రేక్షకుల కోసం ఈ సినిమాను ఓ దృశ్యకావ్యంలా మలిచారు. మంచి కథ దొరికితే తెలుగులోనూ స్ట్రయిట్ చిత్రం చేస్తాను" అని చెప్పారు.



రెండింతల వినోదం

శ్రీసింహ కోడూరి, సత్య, ఫరియా అబ్దుల్లా నటించిన చిత్రం 'మత్తు వదలరా 2'. నితేష్ రాణా దర్శకత్వంలో చిరంజీవి, హేమలత నిర్మించారు. ఈ నెల 12న సినిమా విడుదలవుతోంది. ఆదివారం మేకర్స్ సినిమా ట్రైలర్‌ను ప్రభాస్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు నితేష్ రాణా మాట్లాడుతూ "మర్డర్ నేపథ్యంలో సాగే థ్రిల్లర్ ఇది. అందరినీ విపరీతంగా నవ్విస్తుంది. మొదటి భాగం కంటే రెండింతల వినోదంతో వస్తున్నాం" అని చెప్పారు.

కొత్తగా..

భిన్న ప్రపంచాలు



నాగార్జున, ధనుష్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్ మోహనరావు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నుంచి కొత్త పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో నాగార్జున, ధనుశ్ పాత్రలకు సంబంధించిన రెండు విభిన్న ప్రపంచాలను మేకర్స్ పరిచయం చేశారు.

మాస్ లుక్‌లో



డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న పొలిటికల్ యాక్షన్ డ్రామా 'గేమ్ చేంజర్'. కియార అద్వాణీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని దిల్‌రాజు నిర్మిస్తున్నారు. ఎస్.జె.సూర్య, శ్రీకాంత్, సునీల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం నుంచి ఓ కొత్త పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేసి ఫ్యాన్స్‌ను ఖుషీ చేశారు. మాస్ లుక్‌లో రామ్‌చరణ్ అలరించారు. త్వరలోనే రెండో పాటను విడుదల చేయనున్నట్లు తెలిపారు.

వినాయకన్‌పై కేసు



రజనీకాంత్ హీరోగా నటించిన 'జైలర్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు మలయాళ నటుడు వినాయకన్. శనివారం కొచ్చి నుంచి ఇండిగో విమానంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న వినాయకన్ తోటి ప్రయాణికులతో వాగ్వాదానికి దిగారు. వారు సీఐఎస్ఎఫ్ సిబ్బందికి ఫిర్యాదు చేయడంతో అదుపులోకి తీసుకునేందుకు వచ్చిన భద్రతా సిబ్బందిపైనా ఆయన దురుసుగా ప్రవర్తించాడు. దాంతో వినాయకన్‌ను అదుపులోకి తీసుకొని ఆర్జీఐఏ పోలీసులకు అప్పగించారు. ఆయనపై న్యూసెన్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు ఆర్జీఐఏ సీఐ బాల్‌రాజ్ తెలిపారు. అనంతరం వినాయకన్‌ను అక్కడి నుంచి పంపించగా.. గోవా వెళ్లారు.

- శంషాబాద్ రూరల్ (ఆంధ్రజ్యోతి)

యూట్యూబర్‌పై ఫిర్యాదు



మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్‌ను, మంచు విష్ణును, ఇతర నటీ నటులను టార్గెట్ చేసి, విద్వేష పూరితంగా, అసభ్య పదజాలంతో కూడిన కంటెంట్‌తో అసత్యాలను సోషల్ మీడియాలో, తన యూట్యూబర్ చానల్స్ ద్వారా ప్రచారం చేస్తున్నాడని, విజయ్ చంద్రహాసన్ దేవరకొండపై 'మా' సంస్థ కోశాధికారి, నటుడు శివబాలాజీ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. టెక్నికల్ ఎవిడెన్స్‌ను శివబాలాజీ పోలీసులకు అందజేశారు. సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ముధులత నిందితుడిపై కేసు నమోదు చేసి, నోటీసులు జారీ చేశారు.

- హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి)

మీడియా ముందుకెళ్లొద్దు

లైంగిక వేధింపుల గురించి నటీనటులు మీడియా ముందుకు వెళ్లొద్దని నడిగర్ సంఘం (దక్షిణ భారత సినీ కళాకారుల సంఘం)లోనే ఫిర్యాదు చేయాలని ఆ సంఘం ఆధ్వర్యంలో లైంగిక వేధింపులపై విచారణ జరిపేందుకు ఏర్పాటైన విశాఖ కమిటీ అధ్యక్షురాలు, నటి రోహిణి సూచించారు. ఇటీవల మాలీవుడ్‌లో హేమకమిటీ సృష్టించిన కలకలం నేపథ్యంలో నడిగర్ సంఘంలో అలాంటి సంచలనాలకు తావుండకూడదని ఆమె పేర్కొన్నారు.

ఐదేళ్ల నిషేధం..

ఆదివారం జరిగిన నడిగర్ సంఘం సర్వసభ్యమండలి సమావేశంలో లైంగిక వేధింపుల ఆరోపణకు



గురైన నటులపై ఐదేళ్ల నిషేధం విధించాలని తీర్మానించారు. ఈ తీర్మానాన్ని సినీ నిర్మాతల సంఘానికి కూడా ప్రతిపాదించారు. లైంగిక వేధింపులకు గురయ్యే బాధితులు నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయడానికి నడిగర్ సంఘం అండగా ఉంటుందని తీర్మానంలో పేర్కొన్నారు. బాధితులు ఫిర్యాదు చేయడానికి ప్రత్యేక ఫోన్ నెంబర్లు, ఈమెయిల్ కూడా ఏర్పాటు చేసినట్లు నడిగర్ సంఘం పేర్కొంది.

- చెన్నై (ఆంధ్రజ్యోతి):

సెన్సార్ ఆమోదం



కంగనా రనౌత్ నటించి, స్వీయ దర్శకత్వం వహించిన లేటెస్ట్ చిత్రం 'ఎమర్జెన్సీ'. వివాదాల్లో చిక్కుకున్న ఈ సినిమాకు ఎట్టకేలకు సెన్సార్ ఆమోదం లభించింది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు యు/ఎ సర్టిఫికెట్ జారీ చేసింది. అయితే కొన్ని అభ్యంతకర సీన్స్ సినిమాలో నుంచి తొలగించాలని లేదా వాటి స్థానంలో ఇతర సన్నివేశాలు జతచేయమని చిత్రబృందానికి సెన్సార్ బోర్డు సూచించింది. ఈ నెల 6న సినిమా విడుదల కావాల్సి ఉండగా.. సిక్కు సంఘాల అభ్యంతరాల నేపథ్యంలో సినిమాకు సెన్సార్ ఆలస్యమయ్యింది. త్వరలోనే చిత్రబృందం కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటించనుంది.

పీవోకే ప్రజలారా.. భారత్‌లోకి రండి

» సొంతవారిలా చూసుకుంటాం

» కశ్మీర్ ప్రచారంలో రాజ్‌నాథ్‌సింగ్



జమ్మూ, సెప్టెంబరు 8: పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) ప్రజలు భారత్‌లోకి రావాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పిలుపునిచ్చారు. సొంత మనుషుల్లాగా చూసుకుంటామని ప్రకటించారు. పాకిస్థాన్ వారిని విదేశీ పౌరులుగానే పరిగణిస్తోందని వ్యాఖ్యానించారు. పీవోకేను విదేశం అని పేర్కొంటూ పాక్ అదనపు సొలిసిటర్ జనరల్ సమర్పించిన అఫిడవిట్ దీనికి నిదర్శనమని అన్నారు. కశ్మీర్‌లోని రామ్‌బన్ అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి రాకేశ్ సింగ్ ఠాకూర్‌కు మద్దతుగా రాజ్‌నాథ్ ఆదివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత కశ్మీర్‌లో ఊహించనంతగా మార్పులు వచ్చాయని.. యువత చేతుల్లో తుపాకులు బదులు ల్యాప్‌టాప్‌లు కనిపిస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్-నేషనల్ కాన్ఫరెన్స్ కూటమి ఆర్టికల్ 370ని పునరుద్ధరిస్తామని ప్రకటిస్తోందని.. బీజేపీ ఉన్నంత కాలం అది సాధ్యం కాదని స్పష్టం చేశారు.

అఖిల భారత సర్వీసుల నుంచి ఖేద్కర్ అవుట్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 8: వివాదాస్పద ఐఏఎస్ ప్రొబేషన్ అధికారి పూజా ఖేద్కర్‌ను 'ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్)' నుంచి తొలగిస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొంది. ఐఏఎస్ (ప్రొబేషన్) నిబంధనలు 1954 ప్రకారం ఆమెపై చర్యలు తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. పుణెలో ట్రైనీ సహాయ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో ఆమెపై అధికార దుర్వినియోగంతో పాటు యూపీఎస్సీలో తప్పుడు అఫిడవిట్ పత్రాలు సమర్పించారనే ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. దీంతో, యూపీఎస్సీ ఆమె ఎంపికను రద్దు చేసింది. అయితే, ఐఏఎస్ ప్రొబేషన్ అధికారిగా ఉన్న తన ఎంపికను రద్దు చేసే అధికారం యూపీఎస్సీకి లేదని పూజ వాదించారు. ఈ క్రమంలో ఖేద్కర్‌ను అఖిల భారత సర్వీసుల నుంచి తొలగిస్తున్నట్లు ఈ నెల 6న కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల్లో పేర్కొంది.

రెండుగా విడిపోయిన మగధ్ ఎక్స్‌ప్రెస్

పట్నా, సెప్టెంబరు 8: న్యూఢిల్లీ నుంచి బిహార్‌లోని ఇస్లాంపూర్‌కు వెళ్తున్న మగధ్ ఎక్స్‌ప్రెస్ రెండుగా విడిపోవడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. ఎస్6-ఎస్7ల బోగీల మధ్య ఉన్న కప్లింగ్ తెగిపోవడమే ఇందుకు కారణం. వెనుక నుంచి ఆ లైనులో ఇతర రైలు ఏదీ రాకపోవడం, ప్రయాణికులెవరికీ ఎలాంటి నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఆదివారం ఉదయం 11.08 గంటలకు బక్సర్ జిల్లాలోని ట్వైనింగ్ గంజ్-రఘునాథ్‌పూర్ స్టేషన్ల మధ్య ఈ సంఘటన చోటుచేసుకుంది. వెంటనే సాంకేతిక సిబ్బంది రంగంలో దిగి దానికి మరమ్మతు చేయడంతో 2.25 గంటలకు రైలు తిరిగి బయలుదేరింది.

అంతుచిక్కని వ్యాధితో గుజరాత్‌లో 13 మంది మృతి

గాంధీనగర్, సెప్టెంబరు 8: అంతుచిక్కని వ్యాధి గుజరాత్‌ను కలవరపెడుతోంది. ఆ రాష్ట్రంలోని కచ్ జిల్లాలో ఇప్పటివరకు 13 మంది ఈ వ్యాధితో మృత్యువాత పడ్డారు. కచ్ జిల్లాలో కొన్ని రోజుల క్రితం భారీ వర్షాలు కురిశాయి. అనంతరం ప్రజలు జ్వరం, జలుబు, దగ్గు, న్యూమోనియా తదితర లక్షణాలతో ఆస్పత్రుల్లో చేరడం ప్రారంభించారు. వైద్యులు వారికి చికిత్స అందిస్తున్న క్రమంలో ఊపిరితిత్తులు, కాలేయం చెడిపోవడంతో 13 మంది మృత్యువాతపడ్డారు. చికిత్సకు లొంగని జ్వరంతో ఆస్పత్రుల్లో చేరిన రెండు రోజులకే వీరిలో చాలామంది మృతి చెందడం తీవ్ర కలవరానికి గురిచేస్తోందని వైద్యులు పేర్కొంటున్నారు. మృతుల రక్త నమూనాలను సేకరించి గాంధీనగర్‌లోని ల్యాబ్‌కు పంపించామని ఆ రిపోర్టులు వస్తే గానీ వ్యాధి ఏదని నిర్ధారించలేమని వైద్యులు చెబుతున్నారు.

యూట్యూబ్‌లో చూస్తూ ఆపరేషన్..బాలుడి మృతి

పట్నా, సెప్టెంబరు 8: బిహార్‌లో ఓ నకిలీ వైద్యుడు యూట్యూబ్‌లో చూస్తూ ఆపరేషన్ చేసి 15 ఏళ్ల బాలుడి ప్రాణాలను బలిగొన్నాడు. బిహార్‌లోని సరన్‌లో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఆ పట్టణంలోని కృష్ణ కుమార్ అనే బాలుడికి వాంతులు కావడంతో కుటుంబ సభ్యులు అక్కడి 'గణపతి సేవా సదన్ హాస్పిటల్'కు తీసుకెళ్లారు. కొద్ది సేపటికి వాంతులు తగ్గాయి. కానీ 'వైద్యుడు' అజిత్ కుమార్ పురీ మాత్రం ఆ బాలుడి పిత్తాశయంలో రాళ్లు ఉన్నాయని, వెంటనే ఆపరేషన్ చేయాల్సి ఉందని చెప్పాడు. ఆ బాలుని తండ్రిని పంపించివేసి, యూట్యూబ్‌లో చూస్తూ ఆపరేషన్ చేయడం ప్రారంభించాడు. బాలుడి పరిస్థితి విషమించడంతో.. వెంటనే పట్నా వెళ్లాలని అంబులెన్స్‌ను పిలిపించాడు. మార్గమధ్యలోనే బాలుడు చనిపోయాడు.

రాజ్యసభలో ఎన్డీయేకు స్వల్ప ఆధిక్యం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8: బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు ఆరుగురు నామినేటెడ్ సభ్యుల మద్దతుతో రాజ్యసభలో స్వల్ప ఆధిక్యం లభించింది. బీజేపీకి సొంతంగా 96 మంది ఎంపీలుండగా మొత్తం ఎన్డీయే ఎంపీల సంఖ్య 113. తాజాగా ఆరుగురు నామినేటెడ్ ఎంపీల మద్దతుతో ఎన్డీయే బలం 119కి పెరిగింది. నామినేటెడ్ ఎంపీలు సాధారణంగా ప్రభుత్వానికి మద్దతుగా ఉంటారు. రాజ్యసభలో మొత్తం ఎంపీల సంఖ్య 234. సగం సంఖ్య 117 కాగా ఎన్డీఏ బలం రెండు ఎక్కువగా 119కి చేరినట్లైంది. వక్ఫ్ సవరణ బిల్లు సహా పలు కీలక బిల్లులు ఆమోదం పొందాల్సిన తరుణంలో ఎన్డీయేకు మెజార్టీ రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాజ్యసభలో కాంగ్రెస్ పార్టీకి 27 మంది సభ్యులున్నారు. మిత్రపక్షాలకున్న 58 మంది ఎంపీలతో కలిపి కాంగ్రెస్ బలం 85కు చేరింది. వైసీపీకి రాజ్యసభలో 9 మంది ఎంపీలుండగా బీజేడీకి ఏడుగురు, ఏఐఏడీఎంకేకు నలుగురు ఎంపీలున్నారు. ముగ్గురు ఇండిపెండెంట్లు, చిన్న పార్టీలకు సంబంధించిన ఇతర ఎంపీలు కూడా ఉన్నారు. జమ్మూకశ్మీర్‌లో నాలుగు ఎంపీ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఈ కారణంగా సభలో సభ్యుల సంఖ్య 241కి పరిమితమైంది. మొత్తం 11 ఖాళీలుండగా మరో నాలుగు ఏపీలో, ఒకటి ఒడిశాలో ఖాళీగా ఉన్నాయి. 4నామినేటెడ్ ఎంపీల స్థానాలు కూడా ఖాళీగా ఉన్నాయి. బీజేడీకి గుడ్‌బై చెప్పిన రాజ్యసభ ఎంపీ సుజీత్ కుమార్ ఇటీవలే బీజేపీలో చేరారు. ఒడిశా అసెంబ్లీలో బీజేపీకి తగినంత బలం ఉండటంతో ఉప ఎన్నికల్లో సుజీత్ గెలుపు సునాయాసమే. వైసీపీ రాజ్యసభ ఎంపీలు మోపిదేవి వెంకట రమణ, మస్తాన్ రావు గత నెల తమ సభ్యత్వాలకు రాజీనామా చేశారు. వారిద్దరూ టీడీపీలో చేరే అవకాశముంది.

నక్సల్స్‌పై ఆఖరి పోరాటం

ఛత్తీస్‌గఢ్‌కు అదనంగా 4 వేల బలగాలు

» ఆపరేషన్ ప్రహార్‌లో పుంజుకోనున్న వేగం

(సెంట్రల్ డెస్క్)



ఛత్తీస్‌గఢ్‌లో నక్సలిజాన్ని అంతం చేస్తామని కంకణం కట్టుకున్న కేంద్ర ప్రభుత్వం ఆదివారం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఝార్ఖండ్‌లోని మూడు బెటాలియన్లు, బిహార్‌లోని ఒక పటాలానికి చెందిన సీఆర్పీఎఫ్ బలగాలను ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ రీజియన్‌కు తరలించాలని నిర్ణయించింది. ఈ నాలుగు బెటాలియన్లకు చెందిన సుమారు 4 వేల మంది సీఆర్పీఎఫ్ జవాన్లు.. ఇప్పటికే 40కి పైగా ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్(ఎఫ్‌వోబీ)లను ఏర్పాటు చేసుకుని, యాంటీ-నక్సల్స్ ఆపరేషన్లలో కీలక భూమిక పోషిస్తున్న సీఆర్పీఎఫ్-కోబ్రా బలగాలతో కలిసి.. 'ఆపరేషన్ ప్రహార్'లో పాల్గొంటారని ఉన్నతాధికారులు తెలిపారు. మావోయిస్టులకు కంచుకోటగా బస్తర్ రీజియన్‌లోని పది జిల్లాలు ఉండేవి. గడిచిన నాలుగేళ్లలో ఆ సంఖ్య ఏడు జిల్లాలకు పరిమితమైంది. గడిచిన ఎనిమిది నెలల కాలంలో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 153 మంది నక్సల్స్ అంతమొందగా.. మావోయిస్టులకు కంచుకోటగా పేరున్న అబుజ్‌మడ్ అడవుల్లోనికి కూడా బలగాలు చొచ్చుకువెళ్లాయి. ఇటీవల కాంకేర్ జిల్లా పోలీసులు నిర్వహించిన ఆపరేషన్‌లో.. అబుజ్‌మడ్ ప్రవేశ ప్రాంతంలో జరిపిన కాల్పుల్లో 17 మంది నక్సల్స్ మృతిచెందారు.

కొత్త బలగాలతో మరింత బలం

ఇప్పటికే ఛత్తీస్‌గఢ్ అడవుల్లో సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, జిల్లాల స్థాయుల్లో డీఆర్జీ, ఏఆర్ బలగాలు.. ఇలా 60 వేలకు పైగా జవాన్లు, కానిస్టేబుళ్లు నక్సల్స్ ఆపరేషన్లలో పాల్గొంటున్నారు. కొత్తగా వస్తున్న 4 వేల మంది సీఆర్పీఎఫ్ జవాన్లు కూడా యాంటీ-నక్సల్స్ ఆపరేషన్లలో సుదీర్ఘ అనుభవం ఉన్నవారేనని ఉన్నతాధికారులు చెబుతున్నారు. "కొత్తగా వచ్చే 4 వేల బలగాలతోపాటు.. డాగ్ స్క్వాడ్స్, డ్రోన్లు(యూఏవీలు), అధునాతన కమ్యూనికేషన్ సెట్లు ఉంటాయి. 2026 టార్గెట్ నేపథ్యంలో.. వీలైనంత త్వరగా దట్టమైన అడవుల్లోనూ హెలిప్యాడ్లు, రోడ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంకల్పించాయి" అని అధికార వర్గాలు తెలిపాయి. అయితే.. 2005లో ఆపరేషన్ గ్రీన్‌హంట్ ప్రారంభమైనప్పటి నుంచి తాజా ఆపరేషన్ ప్రహార్ వరకు బలగాల వైపు కూడా భారీగానే ప్రాణనష్టం ఉందని, హెలిప్యాడ్లు, రోడ్ల ఏర్పాటుతో ఇప్పుడు ఆ నష్టాన్ని నివారించవచ్చని విశ్రాంత సీఆర్పీఎఫ్ అధికారి ఒకరు తెలిపారు. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. బలగాలు మాత్రం వీటినేమి లెక్కచేయకుండా అడవుల్లో ముందుకు సాగుతున్నాయి. వర్షాకాలంలో నక్సల్స్ కదలికలు ఎక్కువగా ఉండవని, షెల్టర్ జోన్లలో తలదాచుకుంటారని, వారిని గుర్తించేందుకు ఇదే సమయమని ఛత్తీస్‌గఢ్ పోలీసులు చెబుతున్నారు.

> "2026కల్లా ఛత్తీస్‌గఢ్‌లో నక్సలిజాన్ని కూకటి వేళ్లతో పెకిలించేస్తాం.."
>
> - గత నెల 24న నక్సల్స్ ప్రభావిత రాష్ట్రాల సీఎస్‌లు, డీజీపీల సదస్సులో కేంద్ర హోంమంత్రి అమిత్ షా

తగ్గుతున్న నక్సలిజం?

	2004-14	2014-24
నక్సల్స్ దాడులు	16,274	7,696
నక్సల్స్ హింసతో మరణాలు	6,568	1,990
నక్సలిజం విస్తరణ	10 రాష్ట్రాలు	38 జిల్లాలు
ఛత్తీస్‌గఢ్‌లో.. ఈ ఏడాది గణాంకాలు		
ఎన్‌కౌంటర్లలో నక్సల్స్ మరణాలు		159
అరెస్టయిన నక్సల్స్ సంఖ్య		753

అబుజ్‌మడ్‌పై పట్టు సాధ్యమేనా?

ఛత్తీస్‌గఢ్ బలగాలు తెలంగాణకు చెందిన గ్రేహౌండ్స్ సహాయం లేకుండానే.. ఇటీవల అబుజ్‌మడ్‌లో భారీ ఆపరేషన్ నిర్వహించిన విషయం తెలిసిందే.! నక్సల్స్ కంచుకోట అయిన అబుజ్‌మడ్‌లోకి ప్రవేశించి, ఆపరేషన్ నిర్వహించడం ఇదే మొదటిసారి. అయితే.. నారాయణ్‌పూర్, బీజాపూర్, దంతేవాడ జిల్లాల్లో 4 వేల చదరపు కిలోమీటర్ల మేర అబుజ్‌మడ్ అడవులు విస్తరించాయని విశ్రాంత అధికారులు చెబుతున్నారు. ఇక తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కొండపల్లి కూడా పోలీసులకు ఓ సవాలుగా ఉంది. ఈ ప్రాంతంలో సీఆర్పీఎఫ్‌కు చెందిన 7 క్యాంపులు ఉన్నాయి. తెలంగాణ క్యాడర్‌కు చెందిన కీలక మావోయిస్టు నేతలు కొండపల్లిలోనే ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. కొండపల్లి వెళ్లడం మాత్రం ప్రాణాలతో చెలగాటమనే అభిప్రాయాలు సీఆర్పీఎఫ్ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రాంతం చుట్టూ మావోయిస్టులు మందుపాతరలను అమర్చారని, ఎక్కడికక్కడ బూబీట్రాప్‌లను ఏర్పాటు చేశారని చెబుతున్నారు.

మళ్లీ భగ్గుమన్న మణిపూర్!

దాడులు, ఘర్షణల్లో ఆరుగురి మృతి



కుకీల దాడి బాధితులకు ఎక్స్‌గ్రేషియా అందజేస్తున్న మణిపూర్ సీఎం బీరేన్ సింగ్

ఇంఫాల్, సెప్టెంబరు 8: మణిపూర్‌లో మళ్లీ హింస చెలరేగింది. కుకీ-మైతేయి వర్గాల మధ్య ఘర్షణలతో గతేడాది అట్టుడికిన ఈశాన్య రాష్ట్రంలో మళ్లీ అగ్గి రాజుకుంది. రాకెట్, డ్రోన్ బాంబు దాడులతో ఈసారి మరింత హైటెన్షన్ నెలకొంది. శనివారం జిరిబామ్ జిల్లాలో ఓ ఇంట్లోకి చొరబడిన అనుమానిత కుకీ సాయుధులు నిద్రిస్తున్న వ్యక్తిని కాల్చి చంపగా.. ఇది కాస్త ఇరు వర్గాల ఘర్షణకు దారి తీసింది. అనంతరం జరిగిన దాడుల్లో మరో నలుగురు సాయుధులు చనిపోయారు. అంతకుముందు రోజే జరిగిన రాకెట్ దాడుల్లో బిష్ణుపూర్ జిల్లాలో ఓ వృద్ధుడు మరణించగా.. ఆరుగురు గాయపడ్డారు. ఈ నేపథ్యంలోనే పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు జరిగాయి. భద్రతను మరింత కట్టుదిట్టం చేసి.. డ్రోన్లను తిప్పకొట్టడానికి యాంటీ డ్రోన్ సిస్టమ్‌లతో మోహరించారు. కాగా, ఘర్షణల నేపథ్యంలో సీఎం బీరేన్ సింగ్ పలువురు ఎమ్మెల్యేలు, అసెంబ్లీ స్పీకర్‌తో కలిసి గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్యతో భేటీ అయ్యారు. శాంతిభద్రతలను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం తగిన అధికారాలివ్వాలని కోరుతూ ఆయనకు వినతిపత్రం సమర్పించినట్లు తెలిసింది. కేంద్రం, మణిపూర్ ప్రభుత్వంతో రెండు కుకీ తీవ్రవాద సంస్థల మధ్య జరిగిన సస్పెన్షన్ ఆఫ్ ఆపరేషన్స్ ఒప్పందాన్ని కూడా రద్దు చేయాలని సీఎం కోరినట్లు సమాచారం.

లోకం తీరు



దేశంలో ఎంపాక్స్ అనుమానిత కేసు

» ఇటీవల విదేశం నుంచి వచ్చిన యువకుడిలో లక్షణాలు

» ఐసొలేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నామన్న కేంద్రం



న్యూఢిల్లీ, సెప్టెంబరు 8: ఇటీవల విదేశాల నుంచి వచ్చిన ఓ యువకుడికి ఎంపాక్స్(మంకీ ఫీవర్) సోకినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేంద్ర ఆరోగ్యశాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. రోగిని ఓ ఆస్పత్రిలో ఐసొలేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నారని, అతని పరిస్థితి స్థిరంగా ఉందని తెలిపింది. అతను విదేశాల నుంచి వచ్చాక ఎవరెవరిని కలిశాడో వారిని గుర్తిస్తున్నారని(కాంటాక్ట్ ట్రేసింగ్) వివరించింది. రోగి నుంచి సేకరించిన స్వాబ్ నమూనాలను టెస్టింగ్‌కు పంపించారు. అతనిలో ఎంపాక్స్ లక్షణాలు స్పష్టంగా ఉండటంతో రిజల్ట్ పాజిటివ్‌గా వస్తుందని భావిస్తున్నారు. మరోవైపు, దేశంలో ఎంపాక్స్ విస్తరించకుండా కేంద్రం అన్ని చర్యలు తీసుకుందని ఆరోగ్య శాఖ తన ప్రకటనలో తెలిపింది. అయితే, రోగి వివరాలు, అతన్ని ఎక్కడ ఐసొలేషన్‌లో ఉంచారన్న వివరాలను కేంద్రప్రభుత్వం వెల్లడించలేదు. కాగా, ఎంపాక్స్ ఇటీవలి కాలంలో ఆఫ్రికా ఖండ దేశాల్లో విజృంభించింది. ఆ ఖండం నుంచి స్వీడన్, థాయ్‌లాండ్ దేశాలకూ పాకింది. ప్రజారోగ్యం పరంగా ఎంపాక్స్ అంతర్జాతీయంగా ఆందోళనకరస్థాయిలో విస్తరిస్తోందని(పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీ) డబ్ల్యూహెచ్‌వో గత నెలలో ప్రకటించింది. ఇదిలా ఉండగా, భారత్‌లో గతంలోనూ ఎంపాక్స్ కేసులు నమోదయ్యాయి. అయితే, ఈ ఏడాది మార్చి తర్వాత ఒక్క కేసు కూడా నమోదు కాలేదు.



సౌదీ అరేబియాలో

గల్ఫ్‌లో ఘనంగా వినాయక చవితి

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

విఘ్నాలు తొలగించాలంటూ గల్ఫ్ దేశాల్లోని వేలాది మంది తెలుగు ప్రవాసీయులు వినాయకుడిని పూజిస్తూ వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా జరుపుకొంటున్నారు. భారతీయులు నివాసముంటున్న దాదాపు అన్ని అపార్ట్‌మెంట్లలో గణపతికి పూజలు చేస్తున్నారు. దుబాయిలో గతంలో ఎన్నడూ లేనివిధంగా భారీ ఎత్తున వినాయక విగ్రహాల విక్రయాలు జరిగాయి. వినాయక విగ్రహాల కొనుగోలుకు ఈ స్థాయిలో రద్దీని తాను మొదటిసారిగా చూస్తున్నానని దుబాయిలో సుదీర్ఘకాలంగా నివాసముంటున్న తెలుగు ప్రవాసీ ప్రముఖుడు బాలుసాని వివేకానంద తెలిపారు. శని, ఆదివారాలలో దుబాయిలోని రెండు దేవాలయాల్లోనూ గణపతి పూజలకు భారీగా భారతీయ ప్రవాసీలు హాజరయ్యారు. దుబాయి, మస్కట్, మనమాలలోని దేవాలయాలతో పాటు.. ఆజ్మాన్ మైత్రి ఫాంలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను వేలాది మంది భక్తులు సందర్శించి పూజలు చేస్తున్నారు. సౌదీఅరేబియాలోని దమ్మాం, రియాద్, జెద్దా నగరాలతో పాటు.. తెలుగు ప్రవాసీ సంఘం సాటా ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. దమ్మాంలో జరిగిన గణపతి ఉత్సవాల్లో లడ్డూ వేలం పాట నిర్వహించగా.. ఏపీలోని ఒంగోలుకు చెందిన ఈశ్వరరావు 3 వేల రియాళ్లకు లడ్డూను దక్కించుకున్నారు. బహ్రెయిన్, ఒమాన్, కువైట్‌లలోనూ చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

సైబర్ కేటుగాళ్లు

(మొదటి పేజీ తరువాయి)

బంధువు ఒకరు సైబర్ కేటుగాళ్ల వలకు చిక్కి రూ.5లక్షలు పోగొట్టుకున్నారు. నగరంలోనే నివసించే ఆర్మీ అధికారి, ఆయన కుటుంబసభ్యులు ఇలాంటి సైబర్ కేటుగాళ్ల ట్రాప్‌లో పడి రూ.50 లక్షలు పోగొట్టుకున్నారు. ట్రేడింగ్‌లో 500 శాతం లాభాలు వస్తాయంటూ రామ్‌కోటికి చెందిన ఓ వ్యాపారిని నమ్మించిన సైబర్ క్రిమినల్స్.. ఆయనతో పెట్టుబడులు పెట్టించి కొద్దిమొత్తంలో లాభాలు చూపారు. కానీ, ఆ డబ్బు తీసుకోవాలంటే మరింత పెట్టుబడి పెట్టాలంటూ ఒత్తిడి తెచ్చారు. ఇలా అతడు రూ.2 కోట్లు పోగొట్టుకున్నాడు. మరో కేసులో.. 88 ఏళ్ల రిటైర్డ్ ఆర్మీ అధికారికి వలపు వల వేసి ఆయన్నుంచీ రూ.17 లక్షలు కాజేశారు కొందరు కేటుగాళ్లు. ఒంటరి పురుషులకు మహిళలతో న్యూడ్‌కాల్స్ చేయించి.. వారి నుంచి డబ్బులు గుంజుతున్న కేసులూ పెరుగుతున్నాయి. ..ఇలా ఒకటా రెండా.. రాష్ట్రవ్యాప్తంగా వేలాదిగా కేసులు. ఎందరో బాధితులు. రాష్ట్రంలో ఈ తరహా నేరాల సంఖ్య పెరుగుతుండటంతో సైబర్ సెల్ అప్రమత్తమైంది. అయితే, ఇలాంటి ఘటనల్లో స్వల్ప మొత్తంలో పోయిన డబ్బును వెంటనే రికవరీ చేస్తున్నప్పటికీ పెద్ద మొత్తంలో జరిగే మోసాల్లో రికవరీ సమస్యగా మారుతోంది. సైబర్ కేటుగాళ్ల బారిన పడి డబ్బులు పోగొట్టుకున్న బాధితులు ఎంత త్వరగా పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఆ లావాదేవీలను నిలిపివేసి, రికవరీకి అవకాశం అంత ఎక్కువగా ఉంటుందని పోలీసులు చెబుతున్నారు.

కాల్‌సెంటర్లు పెట్టి మరీ..

ఢిల్లీ, గుర్గావ్, యూపీ, కోల్‌కతా, ముంబై తదిర నగరాల్లో సైబర్ నేరగాళ్లు ప్రత్యేకంగా కాల్ సెంటర్‌లు ఏర్పాటు చేసుకొని మరీ సైబర్ నేరాలకు పాల్పడున్నారు. ఒక్కో సైబర్ ముఠా.. దాదాపు 100 మందిదాకా టెలికాలర్స్‌ను ఏర్పాటు చేసుకొని మార్కెట్లో లభ్యమయ్యే కస్టమర్ల సమాచారాన్ని కొనుగోలు చేసి రూ.కోట్లు లూటీ చేస్తోంది! సాంకేతిక ఆధారాలు సేకరించి అక్కడికి వెళ్లిన పోలీసులకు.. ప్రధాన నిందితులు చిక్కకుండా టెలికాలర్స్, బ్యాంకు ఖాతాలు సమకూర్చేవారు, సిమ్‌కార్డులు అందించేవారు మాత్రమే దొరుకుతున్నారు. అసలు సూత్రధారులు మాత్రం.. కొన్నాళ్లపాటు మరుగున ఉండి, ఆ తర్వాత మళ్లీ బయటికొచ్చి కొత్త తరహాలో దందా మొదలుపెడుతున్నారు. దీంతో మళ్లీ వందల సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయి.



> ఇక్రిశాట్‌లో పదవీ విరమణ చేసిన ఓ మహిళా ఉద్యోగి ఆమె! పోలీసు శాఖలో ఓ మహిళా ఉన్నతాధికారికి బంధువు కూడా. ఇటీవల ఆమెకు ఫోన్ చేసిన ఓ అగంతకుడు.. కస్టమ్స్ అధికారినంటూ మాట్లాడాడు. ఆమె చిరునామాతో వచ్చిన పార్శిల్‌లో కొకైన్ ఉందని.. ఆమెపై కేసు నమోదైందని చెప్పాడు. వెంటనే మరో ఆగంతకుడు ఉన్నతాధికారి ముసుగులో స్కైప్ వీడియో కాల్ చేశాడు. ఆమె బ్యాంక్ అకౌంట్ ద్వారా పెద్ద మొత్తంలో డ్రగ్స్ కొనుగోలు జరిగినట్లుగా ఆధారాలున్నాయని బెదిరించి.. ఆమె వద్ద నుంచి రూ.1.6 కోట్లు కాజేశాడు.

హైదరాబాద్‌లో.. రోజుకు రూ.2 కోట్లు!

ఒక్క హైదరాబాద్ సిటీ కమిషనరేట్ పరిధిలోనే రోజుకు రూ. 2 కోట్ల దాకా ఈ సైబర్ నేరగాళ్లు కేవలం ఫోన్ కాల్స్ ద్వారా కొల్లగొడుతున్నారని.. ఈ లెక్కన ఏడాదికి వారు రూ. 750-1000 కోట్లదాకా ప్రజాధనం లూటీ చేస్తున్నారని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఇటీవలే వెల్లడించారు. ట్రై కమిషనరేట్, తెలంగాణ వ్యాప్తంగా సైబర్ క్రిమినల్స్ కొల్లగొడుతున్న సొత్తును కూడా కలుపుకొంటే ఆ మొత్తం రూ. 1500 కోట్ల దాకా ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో గణాంకాల ప్రకారం.. 2023 సంవత్సరం నాటికి ప్రపంచవ్యాప్తంగా 8 ట్రిలియన్ డాలర్ల డబ్బును సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టినట్లు తెలుస్తోంది. 2025 సంవత్సరానికి గాను ఆ మొత్తం 10.5 ట్రిలియన్ డాలర్స్‌కు చేరుకునే అవకాశం ఉన్నట్టు అంచనా. అంత డబ్బంటే.. అది ప్రపంచంలోనే అతిపెద్ద 3వ ఆర్థికవ్యవస్థతో సమానమని (అమెరికా జీడీపీ 28.78 ట్రిలియన్ డాలర్లు, చైనా జీడీపీ 18.53 ట్రిలియన్ డాలర్లు; ఆ రెండు దేశాల తర్వాత స్థానంలో ఉన్న జర్మనీ జీడీపీ 4.59 ట్రిలియన్ డాలర్లు) సైబర్ నిపుణులు పేర్కొన్నారు. 2025 నాటికి ప్రపంచవ్యాప్తంగా 175 జెటాబైట్స్ డేటా సైబర్ నేరగాళ్ల చేతికి చేరే ముప్పుందని వారు హెచ్చరిస్తున్నారు.

సైబర్ సెక్యూరిటీ బ్యూరో టోల్ ఫ్రీం నంబరు 1930కి ఏడాది కాలంలో అందిన ఫిర్యాదుల ప్రకారం బాధితుల వివరాలు ఇలా ఉన్నాయి..

పీహెచ్‌డీ చేసినవారు	208
పీజీ పట్టభద్రులు	7,750
డిగ్రీ చదివినవారు	28,360
పదోతరగతి లోపువారు	2,347
నిరక్షరాస్యులు	837
ప్రైవేటు ఉద్యోగులు	30,400
ఐటీ ఉద్యోగులు	5,140
విద్యార్థులు	6,114
ప్రభుత్వోద్యోగులు	2,768
గృహిణులు	4,600

విద్యావంతులే ఎక్కువ!

సైబర్ నేరాల బాధితుల్లో ఎక్కువగా ఉన్నత విద్యావంతులు, సాఫ్ట్‌వేర్ నిపుణులే ఉంటున్నారని గత ఏడాది కాలంగా నమోదైన కేసులు స్పష్టం చేస్తున్నాయి. సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు ఏడాది కాలంలో మొత్తం 2,52,187 ఫిర్యాదులు అందగా.. బాధితుల్లో 60 శాతానికిపైగా ఉన్నత విద్యావంతులు ఉన్నారు. వారిలోనూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే ఎక్కువగా ఉంటున్నారని పోలీసులు చెబుతున్నారు. ఆ తర్వాత.. వైద్యులు, రిటైర్డ్ ఉద్యోగులు ఎక్కువగా ఉంటున్నారు.

హైదరాబాద్ గాలి నాణ్యత భేష్!

» 2017-18తో పోలిస్తే 30% తగ్గిన వాయు కాలుష్యం

» నల్గొండకు స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ అవార్డు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో గాలి నాణ్యత మెరుగైంది. 2017-18తో పోలిస్తే 20-30 శాతం మెరుగుదల సాధించింది. నల్గొండలో కూడా వాయు కాలుష్యం తగ్గింది. దేశవ్యాప్తంగా నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్‌సీఏపీ) పరిధిలోని 131 నగరాల్లో 95 నగరాలు గాలి నాణ్యతలో మెరుగుదల సాధించాయని, 21 నగరాల్లో వాయుకాలుష్యం 2017-18తో పోలిస్తే పీఎం10 స్థాయిలో 40 శాతానికిపైగా తగ్గిందని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) తాజా డేటా వెల్లడించింది. హైదరాబాద్, నల్గొండతోపాటు ఏపీలోని ఎనిమిది నగరాల్లోనూ గాలి నాణ్యత మెరుగైందని పేర్కొంది. వాయు కాలుష్యం 40 శాతానికిపైగా తగ్గిన 21 నగరాల జాబితాలో ఏపీలోని కడప ఉంది. 30-40శాతం మెరుగుదల కనబర్చిన 14 నగరాల్లో విజయవాడ, 20-30శాతం మెరుగుదల సాధించిన 21 నగరాల్లో కర్నూలు, అనంతపురంతోపాటు హైదరాబాద్ కూడా చోటు దక్కించుకుంది. ఇదిలా ఉండగా, ఇంటర్నేషనల్ క్లీన్ ఎయిర్ డే సందర్భంగా జైపూర్‌లో శనివారం నిర్వహించిన స్వచ్ఛ వాయు సర్వేక్షణ్-2024 కార్యక్రమంలో కేంద్ర పర్యావరణ శాఖ నేషనల్ క్లీన్ ఎయిర్ సిటీ అవార్డులను ప్రదానం చేసింది. 3 లక్షల్లోపు జనాభా గల నగరాల్లో గాలి నాణ్యత మెరుగుదలలో నల్లగొండ రెండో స్థానం దక్కించుకుంది. రాయ్‌బరేలీ మొదటి స్థానంలో నిలిచింది. కార్యక్రమంలో నల్లగొండ మునిసిపాలిటీకి రూ.25 లక్షల నగదు పురస్కారం అందించారు. కేంద్ర మంత్రి భూపేందర్, రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ చేతుల మీదుగా నల్లగొండ మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ అవార్డును స్వీకరించారు.


ఏటూరు నాగారం మండలంలో సుడిగాలుల ధాటికి కూలిన వృక్షాలు

ఏటూరునాగారంలోనూ వేలాది వృక్షాల ధ్వంసం

» సుడి గాలుల ప్రభావం వల్లేనని అటవీ శాఖ అంచనా

ములుగు, సెప్టెంబరు 8: మేడారం అభయారణ్యంలో సుడిగాలుల ప్రభావానికి 205 హెక్టార్లలో వృక్ష సంపద ధ్వంసమైన ఘటనను మరువక ముందే ఏటూరు నాగారం మండలంలోనూ అదే తీరులో భారీగా వృక్షాలు నేలకూలాయి. దొడ్ల-కొత్తూరు వైల్డ్‌లైఫ్ అటవీ ప్రాంతంలో సుడి గాలుల దాటికి వేలాది వృక్షాలు విరిగిపడ్డట్లు ఫారెస్టు అధికారులు తాజాగా ఆదివారం గుర్తించారు. అయితే, గత నెల 31 రాత్రి బలమైన గాలులు బీభత్సం సృష్టించాయి. తాడ్వాయి నుంచి మేడారం వెళ్లే మార్గంలో వేలాది చెట్లు విరిగి పడి కనిపించాయి. దీనిపై అటవీఅధికారులు విచారణ చేపట్టారు. ఒకవైపు ఇది కొనసాగుతుండగానే.. దొడ్ల-కొత్తూరు ప్రాంతంలో అదే తరహాలో వృక్షాలు నేలకూలి కనిపించాయి. మేడారం ప్రాంతంలో చెట్లు వలయాకార విస్తీర్ణంలో కూలగా.. దొడ్ల, కొత్తూరు ప్రాంతంలో సరళరేఖ గీసినట్లు వరుసగా చెట్లన్నీ నేలకూలినట్లు గుర్తించారు. చెట్లు కూలిన తీరును బట్టి దొడ్ల-కొత్తూరు ప్రాంతంలో పుట్టిన సుడిగాలి మేడారం సమీపంలో ఉగ్రరూపం దాల్చి కొండపర్తి-జలగలంచ వద్ద అంతర్ధానమైనట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

ఆదాయంతో పోలిస్తే..

శివబాలకృష్ణ ఆస్తులు 350%

» 214 ఆస్తులను అటాచ్ చేసిన ఏసీబీ

హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ కేసు కీలక దశకు చేరుకుంది. డ్రాఫ్ట్ చార్జిషీట్ సిద్ధం చేసిన అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు.. శివబాలకృష్ణ ఆదాయానికి మించిన ఆస్తులను కూడబెట్టినట్లు నిర్ధారించారు. అతని ఆదాయంతో పోలిస్తే.. ఆస్తుల విలువ 350% అధికంగా ఉన్నట్లు నిగ్గుతేల్చారు. ఈ కేసులో 214 ఆస్తులను అటాచ్ చేశారు. విచారణలో శివబాలకృష్ణ వెల్లడించిన కొందరు అధికారులను కూడా విచారించేందుకు ఏసీబీ సిద్ధమైంది. మరోవైపు గొర్రెల కొనుగోళ్లలో అక్రమాల కేసులోనూ ఏసీబీ డ్రాఫ్ట్ చార్జిషీట్‌ను సిద్ధం చేసింది.

టాప్-3 శాఖలివే..!

గడిచిన ఎనిమిది నెలల్లో సగటున 48 గంటలకు ఒకరు చొప్పున ప్రభుత్వోద్యోగులు ఏసీబీకి చిక్కారు. గత ఐదేళ్లలో ఎన్నడూ లేనంతగా ఈ 8 నెలల్లో అవినీతి కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది జనవరి 1 నుంచి.. గత నెల 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా 145 ఏసీబీ కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో 109 మంది అరెస్టయ్యారు. వీరిలో 85 మంది ప్రభుత్వోద్యోగులు, 24 మంది ప్రైవేటు వ్యక్తులు. సీవీ ఆనంద్ ఏసీబీ డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి నమోదైన కేసులు ఇవి..! అన్ని ప్రభుత్వ శాఖల్లో అవినీతి కేసుల పరంగా చూస్తే.. రెవెన్యూ, హోంశాఖ, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖలు మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. 145 కేసుల్లో దాదాపు సగం(71) ఈ శాఖలకు సంబంధించినవే. రవాణా, పంచాయతీరాజ్ శాఖలు ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నట్లు ఏసీబీ గణాంకాలు చెబుతున్నాయి. ఇక అవినీతి అధికారులపై విచారణకు ప్రభుత్వ అనుమతి కోరిన 229 మంది(148 కేసులు) ఉద్యోగుల విషయంలో సర్కారు ఇంకా అనుమతించాల్సి ఉంది. 72 కేసుల్లో మాత్రం 86 మందిపై విచారణకు సర్కారు పచ్చజెండా ఊపింది. ఈ ఏడాది 10 కేసుల్లో నిందితులకు శిక్షలు ఖరారు కాగా.. శిక్షల శాతం 55.55శాతంగా ఉంది.

ఐఏఎస్, ఐపీఎస్‌లపైనా ఫిర్యాదులు..!

ఏసీబీ టోల్ ఫ్రీ నెంబరు 1064కు వరుస ఫిర్యాదులు అందుతున్నాయి. సాధారణ అధికారులతోపాటు ఐఏఎస్, ఐపీఎస్‌ల అవినీతిపై కూడా ఏసీబీకి ఫిర్యాదులు అందినట్లు విశ్వసనీయ సమాచారం.

పబ్‌లపై ఎక్సైజ్, టీజీ న్యాబ్ దాడులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్, నార్కోటిక్స్ బ్యూరో(టీజీ న్యాబ్) పోలీసులు పబ్‌లపై దాడులు జరిపారు. శుక్రవారం మాదాపూర్, జూబ్లీహిల్స్‌లోని ఐదు ప్రధాన పబ్‌లపై అర్ధరాత్రి ఒంటి గంట వరకు తనిఖీలు చేశారు. డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా.. వరంగల్‌కు చెందిన నగేశ్, ఏపీలోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన నార్ల రవికుమార్, మూసాపేటకు చెందిన టీవీఎస్ కేశవరావు, చార్మినార్‌కు చెందిన అబ్దుల్ రహీమ్, మరో మైనర్ బాలుడికి పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. కోరం పబ్‌లో 21 ఏళ్లలోపు యువకుడికి మద్యం సరఫరా చేసినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ఈ పబ్‌పై చర్యలకు సిద్ధమయ్యారు.


ప్రధాన గేటు వద్ద విద్యార్థుల ధర్నా

అట్టుడుకుతున్న బాసర ట్రిపుల్ ఐటీ

» క్యాంపస్‌లో ఐదో రోజూ కొనసాగిన ఆందోళన
» వీసీని తొలగించాలని డిమాండ్
» అండగా ఉంటామన్న ఎమ్మెల్సీ కోదండరాం..
» కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ భ్రష్టుపట్టిపోయింది: మాజీ మంత్రి హరీశ్‌రావు

బాసర, సెప్టెంబరు 8: విద్యార్థుల ఆందోళనలతో బాసర ఆర్జీయూకేటీ (ట్రిపుల్ ఐటీ) అట్టుడుకుతోంది. క్యాంపస్‌లోని సమస్యల పరిష్కారం కోసం విద్యార్థుల ఆందోళనలు ఆదివారంతో ఐదో రోజుకు చేరాయి. పండుగ, సెలవు రోజులు వచ్చినా విద్యార్థులు తమ నిరసనలను కొనసాగించారు. భారీ ర్యాలీ, ధర్నా, విద్యార్థుల నినాదాలతో యూనివర్సిటీ ప్రాంగణం దద్దరిల్లుతోంది. 2వేలకుపైగా మంది విద్యార్థులు నిరసనల్లో పాల్గొంటున్నారు. తమ ఆందోళనను ఉధృతం చేసేందుకు విద్యార్థులు కార్యాచరణ చేపడుతున్నారు. మొత్తం 9వేల మంది విద్యార్థులుండగా విగితా విద్యార్థులు కూడా నిరసనలో పాల్గొనేలా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. విద్యార్థులు మొదట 17 అంశాల ప్రధాన డిమాండ్‌తో ఆందోళన మొదలుపెట్టారు. ఆ తర్వాత ప్రతికూల పరిస్థితులు తలెత్తడంతో ఇప్పుడు వైస్ చాన్స్‌లర్ (వీసీ) రాజీనామా చేయాల్సిందే అంటూ నినదిస్తున్నారు. సమస్యలను పట్టించుకోని వైస్‌చాన్స్‌లర్‌ను తప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా విద్యార్థుల ఆందోళన గురించి తెలుసుకున్న మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందించారు. కాంగ్రెస్ పాలనలో విద్యా వ్యవస్థ భ్రష్టుపట్టి పోయిందనడానికి బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఆందోళనే నిదర్శనమని, అధికారుల నిర్లక్ష్యం వల్లే విద్యార్థులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పూర్తిస్థాయిలో వైస్ చాన్స్‌లర్‌ను నియమించి నిధుల గోల్‌మాల్‌పై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

మేము అండగా ఉంటాం: ఎమ్మెల్సీ కోదండరాం..

విద్యార్థుల ఆందోళనలపై ఎమ్మెల్సీ కోదండరాం ఓ వీడియోను విడుదల చేశారు. ట్రిపుల్ ఐటీని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్న ఆయన విద్యార్థులు ఆందోళన చెందవద్దని.. సమస్యల పరిష్కారం కోసం అండగా ఉంటామన్నారు. ట్రిపుల్ ఐటీలో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తానని పేర్కొన్నారు.

హైడ్రా దెబ్బకు విల్లాలు నేలకు

(మొదటి పేజీ తరువాయి)

విక్రయించింది. ఈ సంస్థ నిర్మించిన విల్లాల్లో 18 విల్లాలు కత్వ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉండగా.. ఐదింటిలో ప్రస్తుతం కుటుంబాలు నివాసముంటుండడంతో వాటి కూల్చివేతను వాయిదా వేశారు. కాగా, ఆదివారం ఈ 13 విల్లాలతోపాటు మాదాపూర్‌లోని సున్నం చెరువు, అమీన్‌పూర్ చెరువుల్లో ఆక్రమణలు, నిర్మాణ దశలో ఉన్న అనుమతి లేని భవనాలను కూల్చివేశారు. ఎప్పటిలానే తెల్లవారుజామున 5గంటలకు భారీ పోలీస్ బందోబస్తు నడుమ ఆయా ప్రాంతాలకు చేరుకున్న హైడ్రా బృందాలు.. ఆపరేషన్ డిమాలిషన్‌కు శ్రీకారం చుట్టాయి. అమీన్‌పూర్ చెరువులో వైసీపీ నేత, ఏపీలోని పాణ్యం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి చెందిన ఫాంహౌస్ ప్రహరీ గోడలు, షెడ్లను కూల్చివేశారు. కత్వ చెరువు ఆక్రమణపై శ్రీలక్ష్మీ కన్‌స్ట్రక్షన్స్ యజమాని విజయలక్ష్మీ, అమీన్‌పూర్ కబ్జాపై రాంభూపాల్‌రెడ్డి, సున్నం చెరువు ఆక్రమణలకు సంబంధించి గోపాల్‌పై స్థానిక పోలీస్ స్టేషన్లలో క్రిమినల్ కేసులు నమోదయ్యాయని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు.

సున్నం చెరువు వద్ద ఉద్రిక్తత..

శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి మండలాల పరిధిలోని అల్లాపూర్, గుట్టల బేగంపేట గ్రామాల రెవెన్యూ పరిధిలో సున్నం చెరువు 26 ఎకరాల్లో విస్తరించి ఉంది. కాలగమనంలో చెరువు భారీగా ఆక్రమణకు గురైంది. శిఖం పట్టాల భూములను యజమానులు విక్రయించగా.. కొనుగోలు చేసిన వారు నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పటికే చెరువు ఎఫ్‌టీఎల్‌లో నివాస సముదాయాలు వెలిశాయి. ఎఫ్‌టీఎల్/బఫర్ జోన్‌లో ఖరీదైన విల్లాలూ ఉన్నాయి. వీటిలో ఇప్పటికే పౌరులు నివాసముంటున్న నేపథ్యంలో.. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న భవనాలు, తాత్కాలిక నిర్మాణాలను కూల్చివేశారు. గుట్టల బేగంపేట గ్రామ సర్వే నంబర్లు 11, 12, 13, 14, 15, 16లలో 10 ఎకరాలకుపైగా చెరువు ఆక్రమణల పాలైంది. ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా అధికారులు చెరువును పరిశీలించారు. పలు నిర్మాణాలు ఎఫ్‌టీఎల్,


సున్నంచెరువు ఎఫ్టీఎల్‌లో భవనం కూల్చివేత దృశ్యం

బఫర్ జోన్‌లో ఉన్నాయని నిర్ధారించుకున్నారు. ఈ క్రమంలో నాలుగు అంతస్తుల భవనాలు రెండు, రెండంతస్తుల భవనాలు రెండింటిని నేలమట్టం చేశారు. వీటితోపాటు ఓ హోటల్, నీటి వ్యాపారం, దుకాణాలు నిర్వహిస్తున్న దాదాపు 20 షెడ్లను కూల్చివేశారు. పది గుడిసెలనూ తొలగించారు. పదేళ్లుగా ఇక్కడే ఉంటున్నామని, ఉన్నపళంగా పంపిస్తే ఎక్కడకు వెళ్లాలంటూ వికారాబాద్‌కు చెందిన సురేష్ కుటుంబం కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. దీంతో వారిపై నీళ్లు పోసి అడ్డుకున్న అధికారులు.. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గుడిసెల కూల్చివేత సమయంలో ఓ మహిళ స్పృహ తప్పి పడిపోయింది. కూల్చివేతల సమాచారం ముందే అందడంతో స్థానికులు, భవనాల యజమానులు, వారి బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో వచ్చారు. వారు కూల్చివేతలను అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్తత నెలకొంది.

భూమిని ఆక్రమించి షెడ్లు..

సున్నం చెరువు పక్కన దాదాపు 50 గుడిసెల్లో పదేళ్ల నుంచి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నిరుపేదలు నివాసముంటున్నారు. గోపాల్ అనే వ్యక్తి.. భూమిని ఆక్రమించి షెడ్లు నిర్మించడంతోపాటు అక్రమంగా నిర్వహిస్తున్న నీటి దందాలో బిహార్, ఇతర రాష్ట్రాల నుంచి తీసుకువచ్చిన కార్మికుల కోసం గుడిసెలు వేయించారని అధికారులు చెబుతున్నారు. అయితే ముందస్తు సమాచారం లేకుండా గుడిసెలు తొలగించడంతో రోడ్డున పడ్డామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జీవితాంతం కష్టపడి కట్టుకున్న ఇల్లు ధ్వంసం చేశారంటూ యజమాని ఒకరు వాపోయారు. వాస్తవానికి సున్నం చెరువులో పదేళ్ల క్రితమే అక్రమ నిర్మాణాలను గుర్తించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న ఐదంతస్తుల భవనాలు కొన్నింటిని కూల్చివేశారు. అనంతరం కూల్చివేతలు అర్ధంతరంగా నిలిచిపోవడంతో తిరిగి ఆక్రమణల పర్వం మొదలైంది. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో గతంలో బడా నిర్మాణ సంస్థకు చెందిన విల్లాలకు జీహెచ్ఎంసీ అనుమతినిచ్చింది. సర్వే నెంబర్-17లో ఈ విల్లాలు ఉన్నాయి. గతంలో మార్కింగ్ చేసి.. కొన్ని విల్లాలు చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్నాయని నిర్ధారించిన రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గత ప్రభుత్వంలో మంత్రి బంధువులకు చెందిన సంస్థ ప్రాజెక్టు కావడమే ఇందుకు కారణమనే ప్రచారం జరిగింది.

కత్వలో విల్లాలు...

దుండిగల్ మునిసిపాలిటీ మల్లంపేట గ్రామ పరిధిలోని కత్వ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్నాయంటూ శ్రీలక్ష్మీ కన్‌స్ట్రక్షన్స్ నిర్మించిన 13 విల్లాలను హైడ్రా నేలమట్టం చేసింది. సర్వే నం.170/5లో శ్రీలక్ష్మీ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ 60విల్లాలకు హెచ్ఎండీఏ నుంచి అనుమతి తీసుకుంది. అనంతరం సర్వే నం.170/4లో మరికొంత భూమిని కొనుగోలు చేసి.. మొత్తం 325 విల్లాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఒక్కో విల్లాను రూ.కోటి నుంచి రూ.1.50 కోట్లకు విక్రయించారు. అయితే ఈ ప్రాజెక్టు పనులు మొదలైన నాటి నుంచీ స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. అయినా నిర్మాణ సంస్థ అన్ని శాఖల అధికారులను మేనేజ్ చేస్తూ నిర్మాణాలను కొనసాగించింది. కత్వచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ స్థలంలో రెండున్నర ఎకరాలకు పైగా ఆక్రమించి అప్పటి గ్రామపంచాయతీ కార్యదర్శుల ద్వారా అనుమతులు తెచ్చుకున్నారు. కత్వచెరువు ఎఫ్‌టీఎల్‌లో 16గుంటలు, బఫర్‌జోన్‌లో 1ఎకరం 4గుంటల భూమిని ఆక్రమించిన నిర్మాణ సంస్థ 23 విల్లాలు నిర్మించి విక్రయించింది. వారికి దగ్గరుండి రుణాలూ మంజూరు చేయించింది. కానీ, చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో 18 విల్లాలున్నట్లు హైడ్రా అధికారులు గుర్తించారు. 5 విల్లాల్లో కుటుంబాలు ఉంటుండగా.. మిగతా 13 విల్లాలను నేలమట్టం చేశారు. కాగా, విల్లాలు కొనుగోలు చేసిన కుటుంబాలు కూల్చివేతలతో బోరుమన్నాయి. మరోవైపు కత్వ చెరువులో విల్లాలు నిర్మించిన శ్రీ లక్ష్మి కన్‌స్ట్రక్షన్స్ యజమాని విజయలక్ష్మి కూల్చివేతల సమయంలో పత్తా లేకుండా పోయారు.

మేం ఎక్కడికి పోవాలె?

\- కామేశ్వర్, వనిత దంపతులు, ఇల్లు కోల్పోయిన బాధితులు



మాది ఒడిసా రాష్ట్రంలోని బాంజ్‌నగర్. పొట్టకూటి కోసం ఇక్కడకు వచ్చాం. కూలి, నాలి చేసుకుంటూ గుడిసెలో ఉంటున్నాం. ఉన్నపళంగా కూల్చివేస్తే మా కుటుంబం ఏం కావాలి..? ఊరు కాని ఊరులో పిల్లలను పట్టుకొని వర్షాకాలంలో ఎక్కడికి వెళ్లాలి? ఎవరి వద్ద ఉండాలి?

తినడానికి తిండి కూడా లేదు?:

\- శిరీష, భూత్‌పూర్ తండా, మహబూబ్‌నగర్



ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం. ఈ రోజు మొత్తం నాశనం చేశారు. కుటుంబం రోడ్డున పడింది. మేం టిఫిన్ కూడా చేయకముందే కూల్చివేస్తామని వచ్చారు. తినడానికి తిండి కూడా లేదు. ఎంత వేడుకున్నా అధికారులు కరుణించలేదు. బడా బాబుల నిర్మాణాల జోలికి వెళ్లని యంత్రాంగం.. మాపై విరుచుకు పడడం న్యాయమా?

నష్టాన్ని ఎవరు పూడుస్తారు?:

\- సురేశ్ చౌదరి, గోదాము యజమాని



గోదాములో రూ.కోట్ల విలువైన సరుకు ఉంది. ఖాళీ చేయాలని మాకు ముందస్తు సమాచారం ఇవ్వలేదు. నేరుగా వచ్చి కూల్చివేస్తామని చెప్పారు. గంట గడువివ్వండి సరుకు తరలిస్తామని చెప్పినా వినిపించుకోలేదు. నాకు జరిగిన నష్టాన్ని ఎవరు పూడుస్తారు? అధికారులూ మానవతాదృక్పథంతో వ్యవహరించాలి.

వైసీపీ నేత ఫాంహౌస్‌లో కూల్చివేతలు

పటాన్‌చెరు: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మునిసిపాలిటీ పరిధిలో పెద్దచెరువు పక్కనే ఏపీలోని పాణ్యం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డికి చెందిన ఫాంహౌస్ వద్ద కూడా ఆదివారం హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. పెద్ద చెరువును ఆనుకుని ఉండే కొత్తచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలోకి వచ్చే సర్వే నంబర్లలోని భూములను రాంభూపాల్‌రెడ్డి పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. పట్టా భూములే అయినా.. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉండటంతో అనేక ఏళ్లుగా భారీగా మట్టిపోసి ఎత్తు పెంచారు. దీంతో కొత్తచెరువు ఆనవాళ్లు కోల్పోయింది. తాజాగా ఇరిగేషన్ శాఖ నిర్వహించిన సర్వేలో సదరు చెరువు పరిధిలోకి వచ్చే భూముల్లో ప్రహరీ, నిర్మాణాలు ఉన్నట్లు తేలింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ సైతం ప్రత్యక్షంగా పరిస్థితిని సమీక్షించిన అనంతరం ఆదివారం ఉదయం 8 గంటలకు ఫాంహౌస్ వద్దకు హైడ్రా డీఎస్పీ శ్రీనివాస్ తన బృందం, ఎక్స్‌కవేటర్లతో వచ్చారు. భారీ పోలీసు బందోబస్తుతో కూల్చివేత ప్రారంభించారు. వాస్తవానికి రాంభూపాల్‌రెడ్డి వ్యవహారంపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందినా.. ప్రభుత్వ శాఖలు ఏనాడూ స్పందించలేదని చెరువు పక్కనే ఉండే హెచ్ఎంటీ కాలనీవాసులు తెలిపారు. అయితే రాంభూపాల్‌రెడ్డి చెరువును కబ్జా చేయలేదని ఆయన తరఫున రమేశ్‌గౌడ్ అనే వ్యక్తి విలేకరులకు తెలిపారు. గతంలో ఇరిగేషన్ అధికారులు హద్దులు చూపించిన తర్వాతే ప్రహరీని నిర్మించామని, వ్యవసాయ కూలీల కోసం, పనిముట్లను పెట్టుకునేందుకు నిర్మించిన రేకుల షెడ్లను సైతం కూల్చివేశారన్నారు. తమకు ఎలాంటి నోటీసు జారీ చేయలేదని, ఈ వ్యవహారంపై కోర్టును ఆశ్రయిస్తామన్నారు.

ఆక్రమణలు నిర్ధారణ అయ్యాకే కూల్చివేశాం..

రాంభూపాల్‌రెడ్డి నిర్మించిన ప్రహరీ మొత్తం కొత్తచెరువు బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలోకే వస్తుందని అమీన్‌పూర్ తహసీల్దార్ రాధ, పటాన్‌చెరు ఇరిగేషన్ డీఈ రామస్వామి తెలిపారు. సర్వే ద్వారా నిర్ధారణ అయిన తర్వాతే హైడ్రా ఆదేశాల మేరకు కూల్చివేతలు చేపట్టామన్నారు. ఇదిలా ఉండగా సర్వే నంబరు 323, 193, 194లో గతంలో చేసిన పద్మావతి లేఅవుట్‌లోని అనేక ప్లాట్లను కాటసాని రాంభూపాల్‌రెడ్డి మనుషులు కబ్జా చేశారంటూ ఆయా ప్లాట్ల యజమానులు ఆ స్థలం వద్దకు వచ్చి ఆందోళన చేపట్టారు. దీంతో రాంభూపాల్‌రెడ్డి మనుషులకు ప్లాట్ల యజమానులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

నివాసముంటున్న ఇళ్లను కూల్చం

» ఆ ఇళ్ల విషయంలో సర్కారే నిర్ణయం తీసుకుంటుంది
» నివాసేతర, నిర్మాణంలో ఉన్న భవనాలపైనే మా చర్యలు
» హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టీకరణ



హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఇళ్లు ఉన్నా.. వాటిలో ఇప్పటికే పౌరులు నివాసముంటున్నట్లయితే ఆ ఇళ్లను కూల్చబోమని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. ఈ విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆక్రమణల పేరుతో పేదల ఇళ్లను కూల్చివేస్తున్నారన్న విమర్శల నేపథ్యంలో ఆయన స్పష్టతనిచ్చారు. నివాసేతర భవనాలు, నిర్మాణంలో ఉన్న భవనాలపై మాత్రమే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పౌరులు నివాసముంటున్న ఆక్రమణల విషయంలో ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. తమకు సంబంధించినంత వరకు మున్ముందు ఆక్రమణలు రాకుండా చూడడం తక్షణ కర్తవ్యమన్నారు. మాదాపూర్ సున్నం చెరువు, మల్లంపేట కత్వ చెరువు, అమీన్‌పూర్ చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలపై చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. సున్నం చెరువులో గతంలో తొలగించిన ఆక్రమణలు కూడా మళ్లీ వచ్చాయని, దాదాపు 10 ఎకరాల పరిధిలో ఉన్న ఆక్రమణల్ని తొలగించామని చెప్పారు. మల్లంపేటలో ఇప్పటివరకు కుటుంబాలు నివాసం లేని 13 విల్లాలను కూల్చినట్లు, ఇక్కడ రెండు ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో 5 విల్లాల విషయంలో అనుమతులను పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. ఇక అమీన్‌పూర్‌లో 51 ఎకరాల స్థలంలో అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలు, పద్మావతినగర్‌లో అక్రమ లేఅవుట్ ప్రహరీ, రెండు సెక్యూరిటీ గదులను తొలగించామని వివరించారు.

ఆక్రమణల వెనుక ఉండేది వారే..

ఆక్రమణల వెనుక స్థానిక నేతలు ఉంటున్నారని రంగనాథ్ తెలిపారు. సున్నం చెరువు వద్ద ఆక్రమణల వెనుక గోపాల్ అనే వ్యక్తి ఉన్నారని, షెడ్లు వేసి నీటి వ్యాపారం చేయడంతోపాటు.. కొందరి నుంచి అద్దెలు కూడా వసూలు చేస్తున్నారని చెప్పారు. ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి ఆయన తీసుకువచ్చిన వారే గుడిసెల్లో ఉంటున్నారని, ముందు తాత్కాలిక నిర్మాణాలు.. తర్వాత అనుమతుల్లేకుండా శాశ్వత భవనాలు నిర్మిస్తున్నారని చెప్పారు. పలు చెరువుల వద్ద ఈ తరహా విధానాన్ని గుర్తించామని తెలిపారు. అందుకే తాత్కాలిక నిర్మాణాలను తొలగిస్తున్నామన్నారు.

'ఎన్నారై లేడీ డాన్' భూకబ్జాలు బట్టబయలు!

» కత్వా చెరువును కబ్జా చేసి ఆమె కట్టిన 13 అక్రమ విల్లాలను కూల్చేసిన హైడ్రా

నిజాంపేట్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మల్లంపేట్‌లో ఓ రియల్ ఎస్టేట్ లేడీ డాన్ భూకబ్జాలు బట్టబయలయ్యాయి. ఆమె అక్రమంగా నిర్మించి.. అమ్మేసిన 13 విల్లాలను హైడ్రా అధికారులు ఆదివారం కూల్చివేయడంతో ఆమె వ్యవహారం మరోమారు చర్చనీయాంశంగా మారింది. హైడ్రా విడుదల చేసిన అధికారిక ప్రకటనలోనూ స్థానికంగా ఆమెను 'లేడీ డాన్'గా వ్యవహరిస్తారని పేర్కొనడం గమనార్హం. కొన్ని సంవత్సరాలుగా నిజాంపేట, బాచుపల్లి, మల్లంపేట్ ప్రాంతాల్లో ఆమె అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తాజాగా కత్వా చెరువును కబ్జాచేసి నిర్మించిన విల్లాలను హైడ్రా అధికారులు కూల్చేశారు. ఆ 'లేడీ డాన్' పేరు గుర్రం విజయలక్ష్మి. కొంతకాలం క్రితం అమెరికా నుంచి హైదరాబాద్ వచ్చిన ఆమె నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో బాలాజీ నగర్‌లో ఉంటున్నారు. ఆమెది ప్రకాశం జిల్లా కనిగిరి. భర్తది గుంటూరు జిల్లా నరసరావుపేట. ఆయన అమెరికాలో ఉంటున్నారు. ఆమె ఏపీలో తనకున్న రాజకీయ పరిచయాలతో స్థానిక ప్రజాప్రతినిధులతో పరిచయాలు పెంచుకున్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో అడుగుపెట్టిన ఆమె.. బాచుపల్లిలో ఒక వెంచర్ చేసి విల్లాల నిర్మాణం చేపట్టారు. అక్కడ అసోసియేషన్ సభ్యులతో వివాదంతో ఆమెపై కేసు నమోదైంది. 2016లో మల్లంపేట్‌లో ఒక వెంచర్ వేసి 15 ఎకరాల్లో విల్లాల నిర్మాణం చేపట్టారు. స్థానిక రాజకీయ నాయకుల అండతో చెరువును కబ్జా చేశారు. ఈ వెంచర్ మీద మొదటి నుంచి వివాదాలు ఉన్నాయి. అధికారులు నోటీసులు ఇచ్చినా వెనక్కి తగ్గలేదు. 2021లో, ఈ ఏడాది కూడా ఆమె కేసులు నమోదయ్యాయి. అయినా తనపై ఎలాంటి చర్యలు లేకుండా రాజకీయ పలుకుబడిని ఉపయోగించారు. నిత్యం ఏదో ఒక వివాదంతో ఆమె పేరు నిజాంపేట రియల్ ఎస్టేట్ వర్గాల్లో మారుమోగేది. తాజాగా ఆమె వెంచర్‌లోని విల్లాలను హైడ్రా కూల్చివేయడంతో ఆమె వ్యవహారశైలి హాట్ టాపిక్‌గా మారింది.

మెదడుపై ప్రభావం చూపే కొత్త వైరస్

» 61 ఏళ్ల పేషెంట్ శరీరంలో గుర్తించిన చైనా పరిశోధకులు
» 12 మంది ఫారెస్ట్ రేంజర్లలో ఆ వైరస్‌కు యాంటీబాడీలు

బీజింగ్, సెప్టెంబరు 8: మనుషుల మెదడుపై తీవ్ర ప్రభావం చూపే 'వెట్‌ల్యాండ్ వైరస్ (వెల్వ్)' అనే కొత్త సూక్ష్మజీవిని చైనా శాస్త్రజ్ఞులు ఒక పేషెంట్ (61) శరీరంలో గుర్తించారు. చైనాలోని జిన్‌ఝౌ నగరానికి చెందిన ఆ వ్యక్తిని.. 2019లో మంగోలియా చిత్తడినేలల్లో పేను జాతికి చెందిన ఓ పరాన్నజీవి కుట్టిందని, ఆ తర్వాత ఐదురోజులకు అతడికి జ్వరం, తలనొప్పి, వాంతులు వంటి లక్షణాలు కనిపించాయని వారు తెలిపారు. ఆ పరాన్నజీవి మనుషులను కుట్టినప్పుడు దాని ద్వారా వైరస్ సంక్రమిస్తుందని.. దానివల్ల నాడీసంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వెల్లడించారు. 2019లో వారు తొలిసారి దీన్ని గుర్తించాక.. ఉత్తర చైనాలోని వివిధ ప్రాంతాల నుంచి అలాంటి 14,600 పరాన్నజీవులను సేకరించి వాటిని పరిశీలించారు. వాటిలో 2 శాతం జీవుల్లో 'వెల్వ్' జన్యుపదార్థం ఉన్నట్టు తేలింది. అలాగే.. కొన్ని గొర్రెలు, గుర్రాలు, పందులు, ఒక రకం ఎలుకల్లో కూడా ఆ వైరస్ ఆర్ఎన్ఏ కనపడిందని శాస్త్రజ్ఞులు తెలిపారు. అలాగే ఆ ప్రాంతంలోని 640 మంది ఫారెస్ట్ రేంజర్ల రక్తనమూనాలు తీసుకుని పరిశీలించగా.. వారిలో 12 మంది రక్తనమూనాల్లో ఈ వైరస్‌కు యాంటీబాడీలు ఉన్నట్టు గుర్తించారు.

ఏసీబీ చీఫ్‌గా విజయ్‌కుమార్

సీవీ ఆనంద్ నుంచి బాధ్యతల స్వీకరణ.. హైదరాబాద్ సీపీగా సీవీ

» విజిలెన్స్ డీజీగా కొత్తకోట

హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) డైరెక్టర్ జనరల్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి విజయ్‌కుమార్ నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులిచ్చారు. ఆయనతోపాటు.. పలువురు ఐపీఎస్‌లను బదిలీ చేశారు. 1997 బ్యాచ్‌కు చెందిన విజయ్‌కుమార్ ఆదివారం సాయంత్రం బంజారాహిల్స్‌లోని ఏసీబీ కార్యాలయంలో సీవీ ఆనంద్ నుంచి డీజీగా బాధ్యతలు స్వీకరించారు.సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ మరోమారు హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్‌గా నియమితులయ్యారు. ఆయన సోమవారం ఉదయం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(ఐసీసీసీ)లో


విజయ్‌కుమార్‌ను అభినందిస్తున్న సీవీ ఆనంద్

బాధ్యతలను స్వీకరించనున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ సీపీగా ఉన్న కొత్తకోట శ్రీనివాస్ రెడ్డిని విజిలెన్స్ డైరెక్టర్‌గా నియమించారు. అదనపు డీజీపీ మహేశ్ భగవత్‌కు పర్సనల్, సంక్షేమం అదనపు బాధ్యతలు అప్పగించారు. ఐజీ ఎం.రమేశ్‌కు ఐజీ స్పోర్ట్స్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

గణేశ్ నవరాత్రుల సమయంలో..

హైదరాబాద్ నగరంలో గణేశ్ నవరాత్రుల నిర్వహణ పోలీసులకు అత్యంత క్లిష్టమైన టాస్క్. ఇది సవ్యంగా పూర్తయితే.. 'బడేఖానా' పేరుతో సీపీ నుంచి కానిస్టేబుల్ దాకా ప్రతి ఒక్కరూ పాల్గొనేలా అభినందన సభను నిర్వహించుకుంటారు. 2 నెలల క్రితమే రేవంత్ సర్కారు డీజీపీ సహా.. సీనియర్ ఐపీఎస్‌లను బదిలీ చేసింది. దాంతో ఇక సీనియర్ ఐపీఎస్‌ల బదిలీలు ఉండవని అంతా అనుకున్నారు. ఊహించని రీతిలో వినాయక చవితిరోజునే హైదరాబాద్ సీపీ బదిలీ జరిగింది. సీవీ ఆనంద్‌కంటే.. డీజీపీ జితేందర్ ఒక సంవత్సరం జూనియర్ కావడం తెలంగాణ పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది.



కిట్ల వాహనాలను ప్రారంభిస్తున్న మంత్రులు తుమ్మల, శ్రీధర్‌బాబు

'మున్నేరు' బాధితులకు 'హైసా' సాయం

» రూ.3 కోట్లతో 10వేల నిత్యావసరాల కిట్లు

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబర్ 8: ఖమ్మం జిల్లాలోని మున్నేరు వాగు ముంపు బాధితులను ఆదుకునేందుకు హైదరాబాద్‌లోని ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ హైసా (హెచ్‌వైఎస్‌ఈఏ) ముందుకొచ్చింది. బాధితులకు పంపిణీ చేసేందుకు రూ.3 కోట్ల వ్యయంతో 10 వేల నిత్యావసరాల, వస్తువుల కిట్లను సిద్ధం చేసింది. ఒక్కో కిట్‌లో రూ.3 వేల విలువ కలిగిన నిత్యావసరాలు, ఇతర వస్తువులు ఉంటాయి. ఈ కిట్లతో కూడిన వాహనాలను ఆదివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఈ వాహనాలు హైదరాబాద్ నుంచి ఖమ్మానికి బయలుదేరాయి.

వరద బాధితులకు రెండు నెలల వేతనం

» సహాయ నిధికి ఇవ్వనున్న ఎమ్మెల్యేలు, ఎంపీలు: దుద్దిళ్ల

హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): "కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రభుత్వ సలహాదారులు కలిసి తమ రెండు నెలల వేతనాన్ని వరద బాధితుల సహాయ నిధికి అందజేస్తాం" అని మంత్రి డి.శ్రీధర్‌బాబు ప్రకటించారు. ఆదివారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్‌ల సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. వరదల్లో నష్టపోయిన వారిని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని చెప్పారు.

ఖమ్మం జిల్లాలో వరద నష్టం రూ.339 కోట్లు

» 80 వేల ఎకరాల్లో పంటలకు రూ.111.87 కోట్ల నష్టం

ఖమ్మం, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/చింతకాని/ఎర్రుపాలెం, సెప్టెంబరు 8: ఖమ్మం జిల్లాలో మున్నేరు వరదతో పాటు భారీ వర్షాలతో రూ.339.46 కోట్ల ఆస్తి నష్టం సంభవించినట్టు అధికారులు లెక్కతేల్చారు. వరద తగ్గిన తర్వాత అధికార యంత్రాంగం జిల్లాలో సర్వే నిర్వహించారు. వారి నివేదిక ప్రకారం.. సుమారు 80వేల ఎకరాల్లో పంటలు దెబ్బతినడంతో రూ.111.87 కోట్ల నష్టం సంభవించింది. రోడ్లు, వంతెనలు దెబ్బతినడంతో రూ.180.38 కోట్ల నష్టం వాటిల్లింది. కాగా, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఆదివారం ఖమ్మం జిల్లా చింతకాని, ఎర్రుపాలెం, ముదిగొండ మండలాల్లో పర్యటించి వర్షాలు, వరదలతో దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించారు. ఎర్రుపాలెం మండలం భవానీపురంలో ఇటీవల వరదల్లో మృతిచెందిన మలిశెట్టి సాంబశివరావు కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును అందించారు.

ఈనెల 12 వరకు భారీ వర్షాలు

హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలో ఈనెల 12 వరకు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. సోమవారం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని, ఆ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. అలాగే ఆదిలాబాద్, నిర్మల్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. మిగిలిన జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు పడతాయని పేర్కొంది. అలాగే మంగళవారం కూడా ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. బుధ, గురువారం వరకు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

తెలంగాణ, ఏపీలో కుమ్మేసిన 'నైరుతి'!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 8: దేశంలో వ్యవసాయ రంగానికి జీవనాడులైన నైరుతి రుతుపవనాలు ప్రతాపం చూపించాయి. ప్రస్తుత సీజన్‌లో సెప్టెంబరు 7 వరకూ దేశవ్యాప్త సగటు కంటే 8శాతం ఎక్కువ వర్షపాతం నమోదైంది. ఆంధ్రప్రదేశ్‌లో 42 శాతం, తెలంగాణ 40 శాతం అధికంగా వర్షాలు పడ్డాయి. అలాగే గోవాలో 45%, లద్దాఖ్‌లో 44%, మహారాష్ట్రలో 28%, కర్ణాటక 23%, త్రిపుర 22%, సిక్కిం 21%లలో కూడా గణనీయమైన అధిక వర్షపాతం నమోదైంది. సాధారణంగా జూన్ 1న కేరళలో ప్రవేశించే నైరుతి రుతుపవనాలు దేశవ్యాప్తంగా విస్తరిస్తాయి. వీటి తిరోగమనం ఒకటి, రెండు రోజులు అటూఇటూగా సెప్టెంబరు 17న ప్రారంభమై అక్టోబరు 15 నాటికి పూర్తవుతుంది.

సీఎంఆర్‌ఎఫ్‌కు రూ.14.60కోట్ల విరాళాలు

హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధికి శని, ఆదివారాల్లో రూ.14.60 కోట్లు విరాళంగా వచ్చాయి. ప్రముఖ వ్యాపారవేత్త రవి రహేజా రూ.5 కోట్లు, జీవీకే రెడ్డి రూ.5 కోట్లు, కేఎన్‌ఆర్ నిర్మాణ సంస్థ ఎండీ నర్సింహరెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జలంధర్‌రెడ్డి రూ.2 కోట్లు, నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఎన్‌సీసీ) ఎండీ రంగరాజు, డైరెక్టర్ సూర్య రూ.కోటి, క్రెడాయ్ ప్రతినిధులు రూ.కోటి, వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్) ఫౌండర్, చాన్స్‌లర్ జి.విశ్వనాథన్, వైస్ ప్రెసిడెంట్ శంకర్ విశ్వనాథన్‌లు రూ.50 లక్షలు, కురుమ సంఘం తరపున ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, సంఘం ప్రతినిధులు కలిసి రూ.10లక్షల విరాళం అందజేశారు.

ఉత్తరకోస్తాకు వాయు'గండం'

విశాఖపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీకి మరో ముప్పు ముంచుకొస్తోంది. పది రోజుల వ్యవధిలో బంగాళాఖాతంలో ఏర్పడిన మరో అల్పపీడనం.. ఇప్పుడు ఉత్తరాంధ్రకు వాయు 'గండం'గా మారింది. గతవారం అతలాకుతలమైన విజయవాడ ఇంకా తేరుకోక ముందే.. మరో వాయుగుండం ఉత్తర కోస్తాను కలవరపెడుతోంది. ఈ వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్రలో శనివారం నుంచి బలమైన ఈదురుగాలులతో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం వరకు ఉత్తరాంధ్ర జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ, కొన్నిచోట్ల కుంభవృష్టిగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది.కళింగపట్నానికి 240 కి.మీ.ల తూర్పుగా పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉన్న వాయుగుండం ఒడిశాలోని పూరికి సమీపంలో సోమవారం మధ్యాహ్నానికి తీరం దాటుతుందని, ఈ నేపథ్యంలో ఎక్కువ ప్రభావం ఉత్తరాంధ్ర జిల్లాలపై ఉంటుందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు ఉత్తర కోస్తాలో భారీ నుంచి అతి భారీ వర్షాల ముప్పు ఉందని, లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతాయని అంచనా వేస్తున్నారు.



సీఎం రేవంత్‌రెడ్డికి రూ.1.50 కోట్ల చెక్కును అందజేస్తున్న వీఐటీ వ్యవస్థాపక చాన్సలర్ కె. విశ్వనాథన్, ఉపాధ్యక్షుడు శంకర్ విశ్వనాథన్

వీఐటీ విరాళం రూ.1.50 కోట్లు

చెన్నై, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన వర్షం, వరద బాధితులను ఆదుకోవాలని తమిళనాడులోని వేలూరుకు చెందిన వీఐటీ సాంకేతిక విశ్వవిద్యాలయం నిర్వాహకులు సంకల్పించారు. ఆ మేరకు విశ్వవిద్యాలయం వ్యవస్థాపక చాన్సలర్ డాక్టర్ కె. విశ్వనాథన్, ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథన్ హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలుసుకుని రూ.1.50 కోట్ల విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు. వరద బాధితులను ఆదుకునేందుకు వీఐటీ విశ్వవిద్యాలయ నిర్వాహకులు భారీ మొత్తాన్ని విరాళంగా ఇచ్చినందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా హర్షం వెలిబుచ్చారు.

మళ్లీ వణికిన ఖమ్మం

(మొదటి పేజీ తరువాయి)

వేంసూరులో 8.7 సెం.మీ. వాన పడింది. కాగా, కొణిజర్ల మండలం పగిడేరు వద్ద రోడ్డు కొట్టుకుపోవడంతో ఖమ్మం-భద్రాద్రి కొత్త గూడెం జిల్లాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బుగ్గవాగు ఉధృతంగా ప్రవహించడంతో లింగాల నుంచి డోర్నకల్ వెళ్లే రహదారిని మూసేశారు. రఘునాథపాలెం మండలం చిమ్మపూడి-కోయచెలక రోడ్డు తెగి ఖమ్మానికి రాకపోకలు బంద్ అయ్యాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కుండపోత వర్షం కురిసింది. వాగులు, వంకలు ఉప్పొంగాయి. చెరువులు, కాల్వలకు గండ్లు పడ్డాయి. పత్తి, మొక్కజొన్న నీట మునిగాయి. తలకొండపల్లి మండలంలో 11.18, ఆమనగల్లులో 9.85, వికారాబాద్ జిల్లా యాలాల మండలం దవులాపూర్‌లో 8.88 సెం.మీ. వర్షపాతం నమోదైంది. హైదరాబాద్‌లో ఆదివారం మాదాపూర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, బోరబండ, ఎస్‌ఆర్‌నగర్, అమీర్‌పేట, పంజాగుట్ట, ఖైరతాబాద్, బేగంపేట, రాజేంద్రనగర్, నాంపల్లి, గోల్కొండ, బాలానగర్ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. హిమాయత్‌సాగర్ ఒక గేటును, ఉస్మాన్‌సాగర్ (గండిపేట) రెండుగేట్లను ఎత్తారు.

మున్నేరుపై హై అలర్ట్..

ఎగువనున్న మహబూబాబాద్‌లో, స్థానికంగా భారీ వర్షం కురవడంతో ఖమ్మం నగరంలోని మున్నేరు మళ్లీ ముంచేసేలా కనిపించింది. ఉమ్మడి ఖమ్మానికి వాతావరణ శాఖ భారీ హెచ్చరికలు జారీ చేయడంతో ఖమ్మం నగరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ప్రజల్లో ఏం జరుగుతోందోనన్న భయంతో హైటెన్షన్ నెలకొంది. శనివారం సాయంత్రం 8.25 అడుగులున్న మున్నేరు నీటి మట్టం పెరుగుతుండడంతో ఆందోళన అధికమైంది. ఆదివారం ఉదయానికి 15.75 అడుగులకు చేరింది. అయితే, వర్షం తగ్గడంతో మున్నేరు కూడా తగ్గుముఖం పట్టింది. ఆదివారం సాయంత్రానికి 13.10 అడుగులకు పరిమితమైంది. కాగా, దీనికి ముందు మున్నేరుపై మంత్రుల ఆదేశాలతో అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. గత వారం అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని అర్ధరాత్రి వేళ ముంపు కాలనీలకు పరుగులు పెట్టారు. ప్రజలను నిద్రలేపారు. ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి ధంసలాపురం, మోతీనగర్ వైపు నుంచి, కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య రామన్నపేట, బొక్కలగడ్డ, కాల్వొడ్డు ప్రాంతాల నుంచి అప్రమత్తం చేస్తూ వచ్చారు. ముంపు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. ఆదివారం ఉదయం మున్నేరు తగ్గుముఖం పట్టడంతో తిరిగి ఇళ్లకు చేరుకున్నారు.

అర్ధరాత్రి పునరావాస శిబిరంలో భట్టి..

భారీ వర్ష సూచన నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హైదరాబాద్ నుంచి ఖమ్మం వచ్చారు.



ధంసలాపురంలో ప్రజలను అప్రమత్తం చేస్తున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



పునరావాస కేంద్రంలో బాధితులతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి భట్టి

అర్ధరాత్రి వేళ కాల్వొడ్డు ప్రాంతంలో ముంపు ప్రాంత ప్రజలతో మాట్లాడారు. వారిని పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. అనంతరం మున్నేరు బ్రిడ్జి వద్ద వరదను పరిశీలించారు. ఒంటిగంట వరకు స్వర్ణభారతి కళ్యాణ మండపం, మహిళా డిగ్రీ కళాశాల, ధంసలాపురం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించారు. ఆహారం, వైద్యం, మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. మంత్రులు తుమ్మల, పొంగులేటి కూడా.. కలెక్టర్, కమిషనర్‌లను అప్రమత్తం చేశారు.

ఉధృత దుందుభీలో నదిలో చిక్కుకున్న కారు

నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం సిర్సవాడ వద్ద ప్రవహిస్తున్న దుందుభీ నదిలో ఆదివారం రాత్రి పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం ఆదిరాల గ్రామానికి చెందిన కుటుంబం, బంధువులు తొమ్మిది మంది విహార యాత్ర కోసం కారులో కొల్లాపూర్ సమీపంలోని సోమశిలకు వచ్చారు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో సిర్సవాడ వద్దనున్న దుందుభీ నది కాజ్‌వేపైన వెళ్తుండగా, ప్రవాహం ఉధృతితో మధ్యలో కారు ఆగిపోయింది. దీంతో అందులోనివారు కాపాడాలంటూ కేకలు వేశారు. సిర్సవాడ గ్రామస్థులు ట్రాక్టర్లను తీయగా.. కారులో ఉన్నవారిలో ఒకరు పోలీస్ కంట్రోల్‌ రూమ్‌కు ఫోన్ చేశారు. ఎస్‌ఐ మహేష్, సీఐ కనకయ్య, అగ్నిమాపక శాఖ అధికారులు చేరుకున్నారు. కారులోని వారిని ఒక్కొక్కరుగా రక్షించారు. కారును కూడా జేసీబీతో బయటకు తీశారు.

సాత్నాలలో అతికష్టం మీద బయటపడ్డ రైతులు

ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం పెండల్‌వాడ గ్రామ సమీపంలోని సాత్నాల నదిని దాటుతున్న ఆరుగురు స్థానిక రైతులు.. సాత్నాల ప్రాజెక్టు రెండు గేట్లను ఎత్తడంతో అనూహ్యంగా చిక్కుకుపోయారు. నదిలో వరద ఉధృతి అధికం కావడంతో ఎడ్లబండితో సహా కొంత దూరం కొట్టుకుపోయారు. పెండల్‌వాడ గ్రామస్థులు ఎడ్లబండికి కట్టిన తాళ్లతో ఆరుగురు రైతులు, ఎడ్లను బయటకు తీశారు.



చనిపోవడానికి కొద్దిసేపటి ముందు ఫిరోజ్

ఆహ్లాదం కోసం వచ్చి అనంత లోకాలకు..

» ముంబై యువకుడి మృతి

ఆహ్లాదం కోసం ప్రాజెక్టు అందాలను తిలకించడానికి వచ్చి ప్రాణాలు పోగొట్టుకున్న ఘటన ఇది..! ముంబైకి చెందిన ఫిరోజ్(28) జగిత్యాల జిల్లా కోరుట్లలో బంధువుల ఇంటికి వచ్చాడు. ఆదివారం నిజామాబాద్ జిల్లా శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వెళ్లాడు. వరద గేట్ల ముందు ఫిరోజ్ సరదాగా గడుపుతుండగా నీటి ప్రవాహం పెరగడంతో కొట్టుకుపోయాడు. స్నేహితుడు రోహిత్ కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. రోహిత్ ఒడ్డుకు చేరుకున్నాడు. వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం మేడిపల్లికి చెందిన పశువుల కాపరి తిరుపతన్న (45) దొరాయకుంట అలుగు ఉధృతిలో కొట్టుకుపోయి చనిపోయాడు.

- భూపాలపల్లి జిల్లా గణపురం మండలం దుబ్బపల్లికి చెందిన వ్యవసాయ కూలీ పొనగంటి సులోచన (42) పిడుగుపడి మృతి చెందింది.
- వర్షాలకు గోడలు తడిసిపోవడంతో.. మెదక్ జిల్లా టేక్మాల్‌లో ఇంటి కప్పు కూలి మంగలి శంకరమ్మ (63) చనిపోయింది.
- ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురానికి చెందిన పిల్లి వీరస్వామి (58) చేపల వేటకు వెళ్లి గల్లంతయ్యాడు.

దండిగా వరద.. నిండుగా ప్రాజెక్టులు



ఎగువ నుంచి దండిగా వరద వస్తుండడంతో సాగునీటి ప్రాజెక్టులు నిండుగా కళకళలాడుతున్నాయి. ఆలమట్టి నుంచి నాగార్జున సాగర్ వరకు కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులకు వరద స్థిరంగా కొనసాగుతోంది. జూరాలకు 1.60 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. సుంకేసుల నుంచి 35,832 క్యూసెక్కులు సహా శ్రీశైలానికి 2.88 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. పూర్తి స్థాయి సామర్థ్యం 215 టీఎంసీలకు గాను 207.41 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 8 గేట్ల ద్వారా 2.19 లక్షల క్యూసెక్కులు, విద్యుదుత్పత్తితో 68 వేల క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. కాగా, ఆదివారం సాగర్ మరో నాలుగు గేట్లను ఎత్తారు. మొత్తం 24 గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. శ్రీశైలం నుంచి 2,83,419 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. సాగర్ పూర్తి నీటి మట్టం 590 అడుగుల (312.04 టీఎంసీలు)కు 588.70 అడుగులు (308.17 టీఎంసీలు)గా ఉంది. 2.18 లక్షల క్యూసెక్కులను విడిచిపెడుతున్నారు. పులిచింతల 8 గేట్లు ఎత్తారు. పూర్తి నీటి మట్టం 175 అడుగులు (45.77 టీఎంసీలు) కాగా, ఆదివారం సాయంత్రానికి 170.70 అడుగులు (39.36 టీఎంసీలు)గా నమోదైంది. 2.29 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. 1.86 లక్షల క్యూసెక్కులను వదులుతున్నారు. ఉత్తర తెలంగాణ వరదాయిని శ్రీరాంసాగర్ గేట్లు మళ్లీ తెరుచుకున్నాయి. గురువారం వరద తగ్గడంతో 42 గేట్లను మూసివేశారు. శనివారం రాత్రి 9 గేట్ల ద్వారా 2.81 లక్షల క్యూసెక్కులను విడిచిపెట్టారు. ఆదివారం మధ్యాహ్నం భారీగా వరద రావడంతో 24 గేట్లను ఎత్తి 99,968 క్యూసెక్కులను గోదావరిలోకి వదులుతున్నారు. 1.26 లక్షల క్యూసెక్కులను కిందకు పంపిస్తున్నారు. పూర్తి నీటి మట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీ)లకు గాను 1090.90 అడుగులు (60.11 టీఎంసీ)గా ఉంది. ఎల్లంపల్లి 12 గేట్లు ఎత్తి 95,256 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలి పెడుతున్నారు. పూర్తి సామర్థ్యం 20.175 టీఎంసీలకు 19.20 టీఎంసీల నీరుంది. కాళేశ్వరంలోని మేడిగడ్డ బ్యారేజీలోకి 2.02 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85 గేట్లను ఎత్తారు.

ఆర్ అండ్ బీలోకి ఐఐటీయన్లు

» ఏఈఈలుగా ఎంపికైన వారిలో ఐదుగురు ఐఐటీ పట్టభద్రులు

» హర్షం వ్యక్తం చేస్తున్న అధికారులు

హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖలో ఐఐటీ పట్టభద్రులు ఉద్యోగులుగా చేరనున్నారు. క్షేత్రస్థాయిలో పని చేసే అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ) పోస్టులకు ఎంపికైన 143 మందిలో పలువురు ఐఐటీ, నిట్, ఐఐఐటీ, బిట్స్ వంటి ప్రముఖ విద్యాసంస్థల్లో చదువుకున్న వారున్నారు. ఐఐటీల నుంచి ఐదుగురు, నిట్‌ల నుంచి 13 మంది, బిట్స్ పిలానీ నుంచి ఒకరు, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ)ల నుంచి 8 మంది, ఉస్మానియా యూనివర్సిటీ నుంచి 30 మంది, జేఎన్‌టీయూ నుంచి 16 మంది ఉండగా, తెలంగాణలోని వివిధ ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో చదివిన వారు మరికొందరున్నారు. ఇలా ప్రఖ్యాత సంస్థల్లో విద్యనభ్యసించిన అభ్యర్థులు వచ్చి చేరుతుండటంపై ఆర్‌అండ్‌బీ శాఖలో హర్షం వ్యక్తమవుతోంది. వీరికి క్షేత్రస్థాయి పరిస్థితులపై అవగాహన ఉండటంతో పాటు కొత్త టెక్నాలజీలను ఉపయోగించి పనులను త్వరితగతిన పూర్తి చేయటంపైనా అవగాహన ఉంటుందని శాఖ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఈ సానుకూల అంశం ఉన్నప్పటికీ.. ఉన్నత విద్యాసంస్థల నుంచి వచ్చిన వీరిలో ఎందరు ఏఈఈ ఉద్యోగంలో కొనసాగుతారన్న ప్రశ్నలు కూడా ఉత్పన్నమవుతున్నాయి. ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐటీల్లో చదివిన విద్యార్థులకు.. ప్రైవేటు రంగంలో మంచి వేతనాలతో ఉద్యోగావకాశాలు అందుబాటులో ఉంటాయి. దీంతో ఎంపికైన వారిలో ఎందరు ఉద్యోగాల్లో కొనసాగుతారు అన్నది కూడా చర్చనీయాంశమైంది. కాగా, ప్రస్తుతం ఎంపికైన వారిలో మల్టీజోన్-1లో పురుషులు 53 మంది, మహిళలు 18 మంది (మొత్తం 71మంది), మల్టీజోన్-2లో పురుషులు 52 మంది, మహిళలు 18 మంది (మొత్తం 70మంది) ఉన్నారు.

గత ప్రభుత్వం.. యూసీలు ఇవ్వలేదు

అందువల్లే కేంద్రం రూ.200 కోట్లు విడుదల చేయలేదు

» వాటి కోసం షాతో మాట్లాడుతున్నా

» అవసరమైతే ఇంకా నిధులిస్తాం

» నష్టంపై నివేదిక వచ్చాక కేంద్రం సాయం

» ఖమ్మంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

» బాధితుల ఖాతాల్లో నేడు నగదు వేస్తాం: పొంగులేటి



నిత్యావసర సామగ్రి పంపిణీ చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

ఖమ్మం బైపాస్‌రోడ్డు/ తిరుమాయపాలెం, హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం తెలంగాణలో విపత్తుల నిర్వహణకు రూ.1300 కోట్ల నిధులు అందుబాటులో ఉండాలని, కానీ, వీటిలో కొంత మొత్తాన్ని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వ్యయం చేసినప్పటికీ.. కేంద్రానికి యుటిలైజేషన్ సర్టిఫికెట్ (యూసీ) పంపలేదని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. దీనివల్ల కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన రూ.200 కోట్లు నిలిచిపోయాయన్నారు. ఈ అంశం గురించి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతో మాట్లాడి నిధుల విడుదలకు కృషి చేస్తానని చెప్పారు. ఇటీవలి వరదలకు తీవ్రంగా ప్రభావితమైన ఖమ్మం నగర శివారులోని దంసలాపురం కాలనీ, తిరుమలాయపాలెం మండలంలోని రాకాసితండాలో కిషన్‌రెడ్డి ఆదివారం పర్యటించారు. ఆయన వెంట రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వరరెడ్డి తదితరులున్నారు. ఉదయం 7 గంటలకే రైలులో ఖమ్మం చేరుకున్న కిషన్‌రెడ్డి.. ఇళ్లు కొట్టుకుపోయిన బాధితులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. సమీపంలోని ఓ ఫంక్షన్‌ హాల్‌లో వరద బాధితులకు నిత్యావసర సరుకులు అందించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో సంభవించిన వరద బీభత్సం గురించి సీఎం రేవంత్‌రెడ్డితో ప్రధాని మోదీ, అమిత్ షా మాట్లాడి భరోసా ఇచ్చారని తెలిపారు. రైతులకు, ఇతర బాధితులకు స్టేట్ డిజాస్టర్ ఫండ్ (ఎస్‌డీఎఫ్) కింద ఉన్న నిధుల ద్వారా అండగా నిలవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. అవసరమైతే ఇంకా నిధులను మంజూరుచేస్తామన్నారు. వరద నష్టంపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి నివేదిక రావాల్సి ఉందని, దాని ఆధారంగా కేంద్రం నుంచి నిధుల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి భేషజాలు లేవని, రాజకీయాలు ఎన్నికల సమయంలోనేనని, ఎన్నికల తర్వాత ప్రజాసంక్షేమమే తమ ధ్యేయమన్నారు. రాష్ట్రంలో సంభవించిన విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించాలని కేంద్రాన్ని కోరారు. ఇప్పటికి రూ.5,438 కోట్ల నష్టం జరిగినట్లు కేంద్రానికి సీఎం నివేదిక పంపారని, కేంద్రం సాయం అందించాలని కోరారు. ప్రజలెవ్వరు ఇబ్బందులు పడవద్దని, సోమవారం ఉదయంలోగా మొదటి విడత సాయం కింద కొంత నగదు బాధితుల బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామని తెలిపారు.


వంద మందిని పార్టీలో చేర్పించాల్సిందే

బీజేపీ సంస్థాగత సభ్యత్వ పర్వం ప్రారంభం సందర్భంగా హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. దీంట్లో పాల్గొన్న కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ పదవుల్లో కొనసాగుతున్నవారు.. తప్పనిసరిగా కనీసం వందమంది చొప్పున సభ్యులను పార్టీలో చేర్పించాల్సిందేనని స్పష్టం చేశారు. వంద మంది సభ్యులను చేర్పించడం ద్వారా క్రియాశీల సభ్యత్వానికి అర్హులవుతారని తెలిపారు.

8 రోజులుగా బస్సులోనే బాబు

» అక్కడే సమీక్షలు, వరదపై పర్యవేక్షణ

» రోజూ ముంపు ప్రాంతాల సందర్శన



(అమరావతి- ఆంధ్రజ్యోతి): బుడమేరు వరద విజయవాడను ముంచెత్తిన రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు నగరానికి మకాం మార్చారు. అప్పటినుంచి, గత ఎనిమిది రోజులుగా విజయవాడ కలెక్టరేట్ ఆవరణలో నిలిపిన బస్సులోనే ఆయన బస చేస్తున్నారు. ఇంత వరదను గతంలో చూడని విజయవాడ వాసులు గట్టి షాక్‌కు గురై ఉన్న తరుణంలో.. వారికి అండగా మొత్తం ప్రభుత్వ యంత్రాంగాన్నే కలెక్టరేట్‌కు తీసుకువచ్చారు. వరద బాధితుల సహాయార్థం ఏకంగా సీఎంవోయే ఆయన వెంట తరలివచ్చింది. విజయవాడ కలెక్టరేట్‌లోని బస్సులోనే ఆయన స్నానపానాదులు, నిద్ర, అధికారులతో సమీక్షలు! అక్కడి నుంచే వరద ప్రాంతాలకు చంద్రబాబు పర్యటన, సహాయక చర్యలపై నిరంతర పర్యవేక్షణ! నిజానికి బస్సు వంటి ఇరుకు ప్రదేశంలో రోజుల తరబడి ఉండటం ఇబ్బందికరమైనా, ఆయన సర్దుకొని అంతే ఉంటున్నారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకూ విశ్రాంతి లేకుండా పనిచేస్తూనే ఉన్నారు. ప్రతి రోజూ తప్పనిసరిగా మూడు, నాలుగు గంటలపాటు ముంపు ప్రాంతాల్లో పర్యటించి బాధితులతో మాట్లాడుతూ సహాయం అందుతున్న తీరును పర్యవేక్షిస్తున్నారు. ముంపు సంభవించిన మొదటిరోజు ఆయన తెల్లవారుజాము నాలుగు గంటలవరకూ బాధిత ప్రాంతాల సందర్శనలోనే ఉన్నారు. కేవలం రెండు గంటలు పడుకొని మళ్లీ ఉదయం ఆరు గంటలకు సిద్ధమై తన పని మొదలుపెట్టారు. వినాయక చవితి పండగ రోజు కూడా ఆయన కలెక్టరేట్‌లోని బస్సులోనే ఉన్నారు. పండగ రోజైనా ఇంటికి వెళ్తే బాగుంటుందని ఒకరిద్దరు మంత్రులు ఆయనకు సూచించారు. సాధారణ పరిస్థితులు వచ్చిన తర్వాతే తాను ఇక్కడ నుంచి కదులుతానని ఆయన వారికి స్పష్టంచేశారు. పండగ రోజు కూడా మధ్యాహ్నం ఆయన విజయవాడలోని ముంపు ప్రాంతాలను సందర్శించారు. వరద తగ్గుతోందా లేదా... ఇంకా ఎన్ని ప్రాంతాల్లో ముంపు ఉంది... బాధితుల పరిస్థితి ఎలా ఉందన్నది ఈ పర్యటనలో ఆరా తీశారు.

బాబు అరెస్టుకు నేటితో ఏడాది

» వైసీపీ పతనాన్ని వేగవంతం చేసిన చర్య

» ఇప్పుడు సీఎంగా జనంలో చంద్రబాబు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు అరెస్టయ్యి సోమవారానికి సరిగ్గా ఏడాది! స్కిల్ డెవలప్‌మెంట్ వ్యవహారంలో మోపిన అక్రమ కేసులో గత ఏడాది సెప్టెంబరు తొమ్మిదో తేదీ తెల్లవారుజామున ఏపీలోని నంద్యాలలో పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. పదకొండో తేదీన ఆయనను రాజమహేంద్రవరం జైలుకు తరలించారు. ఏభై మూడు రోజులు జైల్లో ఉన్న అనంతరం ఆయన బెయిల్‌పై విడుదలైన సంగతి తెలిసిందే. చంద్రబాబు తన రాజకీయ ప్రస్థానంలో జైలు జీవితం గడపడం అదే ప్రథమం. రాజకీయ వైరుధ్యాలు ఎన్ని ఉన్నా గతంలోని ఆయన ప్రత్యర్థి ప్రభుత్వాలు ఆయనను అరెస్టు చేసే సాహసం చేయలేకపోయాయి. కానీ, జగన్ ఆ దిశగా అడుగులు వేయడం ఆ తర్వాత ఎన్నికల్లో ఆయన పార్టీ ఘోర పరాజయానికి బాటలు వేసింది. అప్పటికే పతన దిశలో ఉన్న వైసీపీ మరింత వేగంగా పతనమై అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం పదకొండు సీట్లకు పరిమితమైంది. అరెస్టు జరిగిన ఏడాది తర్వాత చూస్తే చంద్రబాబు సీఎంగా జనంలో ఉంటే, జగన్ ప్రతిపక్ష నేత హోదా సైతం గల్లంతయి కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని రాజకీయ వర్గాలు గుర్తుచేస్తున్నాయి.

వైసీపీకి కొత్త సలహాదారు

» పార్టీ నిర్మాణం, బలోపేతం కోసం.. ఆళ్ల మోహన సాయిదత్ నియామకం

» కీలక బాధ్యతల నుంచి సజ్జల అవుట్!

(అమరావతి-ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయి 11 సీట్లకే పరిమితమైన నేపథ్యంలో.. వైసీపీ అధినేత జగన్ తమ పార్టీ నిర్మాణాత్మక సలహాదారుగా ఆళ్ల మోహన సాయిదత్‌ను నియమించినట్టు ప్రకటించారు. పార్టీని స్థాపించక ముందో, స్థాపించిన తొలినాళ్లలోనో, తొలిసారి ఎన్నికల బరిలో దిగుతున్న సమయంలోనో నిర్మాణాత్మక సలహాదారులను నియమించుకోవడం రాజకీయ పార్టీలకు ఆనవాయితీ. కానీ వరుసగా ఉప ఎన్నికల్లో పోటీ చేయడంతో పాటు రెండుసార్లు సార్వత్రిక ఎన్నికలను ఎదుర్కొన్న పార్టీకి ఇప్పుడు కొత్తగా నిర్మాణాత్మక సలహాదారుడిని జగన్ నియమించడంపై రాజకీయ వర్గాల్లోనే కాదు సొంత పార్టీ నేతల్లోనూ విస్మయం వ్యక్తమవుతోంది. అంతేకాదు.. 2019 నుంచి 2024 దాకా పార్టీ అధికారంలో ఉన్న ఐదేళ్లూ కీలకంగా వ్యవహరించిన సజ్జలను, ఆయన కుమారుడు భార్గవ రెడ్డిని జగన్ దూరం పెట్టారని పార్టీ నేతలు చెబుతున్నారు. గతంలో విజయసాయి రెడ్డిని కూడా జగన్ ఇదే రీతిలో తొలుత అందలం ఎక్కించి.. పార్టీ అధికారంలోకి వచ్చాక దూరం పెట్టారని వారు గుర్తుచేస్తున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే డ్రైవింగ్ లైసెన్సు రద్దు

» రవాణా సిబ్బందికి ప్రమోషన్లు ఇస్తాం: మంత్రి పొన్నం

హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపినా, సిగ్నల్ జంప్ చేసినా, ఇతరత్రా నిబంధనలు ఉల్లంఘించినా కఠినంగా వ్యవహరిస్తున్నామని, డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేస్తున్నామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. మోటారు వాహనాల చట్టానికి అనుగుణంగా ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఆగస్టు 31 వరకు 6936 డ్రైవింగ్ లైసెన్సులను రద్దు చేశామన్నారు. ఆదివారం రవాణా శాఖ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రతి ఏటా వేలాది మంది చనిపోతున్నారనీ, దీన్ని నివారించేందుకు రోడ్డు భద్రతపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. రవాణా శాఖ ఉద్యోగులకూ ప్రమోషన్లు ఇస్తామని, సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

గ్రామీణ రోడ్లకు మరమ్మతులు: సీతక్క

హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీ వర్షాలు, వరద ఉధృతి కారణంగా దెబ్బతిన్న గ్రామీణ రోడ్లకు మరమ్మతులు చేపడుతున్నామని మంత్రి సీతక్క తెలిపారు. రోడ్లు దెబ్బతినడంతో 117 గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని.. దీన్ని అధిగమించేందుకు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టామని ఆదివారం ఒక ప్రకటనలో ఆమె పేర్కొన్నారు. 500 కిలోమీటర్ల మేర 3,500రోడ్లు దెబ్బతిన్నాయని, వాటి మరమ్మతుకోసం రూ.178కోట్లు ఖర్చుకానున్నట్లు అంచనాలు రూపొందించామన్నారు. కాగా, కేంద్ర విభాగం ఆధ్వర్యంలో చేపట్టే ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకుగాను మంత్రి సీతక్క ఆదివారం ఆగ్రా వెళ్లారు.



సీఎంను కలిసిన నిరంజన్

కులగణనకే మా ప్రాధాన్యం

» ఆ బాధ్యత సమర్థంగా నిర్వహిస్తాం: జి.నిరంజన్

» నేడు బీసీ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతల స్వీకారం..

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): కులగణన చేపట్టాలని దేశవ్యాప్తంగా డిమాండ్లు ఉన్నాయని, అలాంటి సమయంలో ప్రభుత్వం తమపై పెట్టిన బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తామని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్‌గా నియామకమైన జి.నిరంజన్ అన్నారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ కూడా దేశవ్యాప్తంగా కులగణన చేయాలని భావిస్తున్నారని.. ఇలాంటి తరుణంలో తాము చేపట్టబోయే ప్రక్రియ ఒక నమూనాగా ఉండేలా చూస్తామని చెప్పారు. రాష్ట్రంలో కులగణన పూర్తి చేసి, స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉన్నట్లు తెలుస్తోందని.. దానికి అనుగుణంగానే తాము వీలైనంత త్వరలో ప్రక్రియను పూర్తి చేస్తామని 'ఆంధ్రజ్యోతి'తో వెల్లడించారు. సభ్యులందరం అరమరికలు లేకుండా పనిచేస్తామన్నారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులు బాధ్యతలు స్వీకరించనున్నారు.

టాప్ అచీవర్స్ జాబితాలో తెలంగాణ: దుద్దిళ్ల

హైదరాబాద్, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): వ్యాపార సంస్కరణల కార్యాచరణ ప్రణాళిక (బిజినెస్ రిఫార్మ్స్ యాక్షన్ ప్లాన్)లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఉందని, టాప్ అచీవర్స్‌గా ఎంపికైన 17 రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఈ నెల 5న అవార్డును కూడా అందజేసిందని తెలిపారు. అయినా ప్రతిపక్ష నేతలు రాష్ట్రాన్ని అప్రతిష్ట పాల్జేసే కుట్రలు పన్నుతున్నారన్నారు.ఎంతో శ్రమించి అవార్డు సాధించిన పరిశ్రమల శాఖ అధికారులను హుందాగా అభినందించాల్సింది పోయి విమర్శలు చేయడం దుర్మార్గమని ఆయన ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు.

రైతుల్ని రెచ్చగొట్టడమే హరీశ్ పని: ఆది శ్రీనివాస్

» గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై 17 లోగా నిర్ణయం: వేం

హైదరాబాద్/మేడ్చల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులకు రుణమాఫీ అమలవుతుందన్న బెంగతో బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావుకు కన్నీళ్లు ఆగట్లేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. రైతులను రెచ్చగొట్టడమే ఆయన పనిగా పెట్టుకున్నారని ఆదివారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పేర్కొన్న ప్రకారమే.. కుటుంబంలో ఎంతమంది ఉన్నా రూ.2 లక్షల మేరకే రుణమాఫీ చేశామన్నారు. రైతుల గురించి హరీశ్ ఎంత తక్కువగా మాట్లాడితే అంత మంచిదని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ అన్నారు. రైతు సురేందర్‌రెడ్డి ఆత్మహత్యపై హరీశ్‌రావు మాట్లాడిన తీరు రైతులను రెచ్చగొట్టే విధంగా ఉందని, ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్‌ను భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. రుణమాఫీపైన ఆయన తప్పుడు ప్రచారం చేస్తూ రైతుల్ని ఆందోళనకు గురి చేస్తున్నారని పేర్కొంటూ ఆయన కలెక్టర్‌కు లేఖ రాశారు. ఈనెల 17లోగా గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకోనుందని సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి వెల్లడించారు. తనను కలిసిన టీపీసీసీ ఎన్నారై సెల్ ప్రతినిధులకు ఈ మేరకు తెలిపారు.

గాంధీభవన్‌లో ఘనంగా 'చవితి'

గాంధీభవన్‌లో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం వేద పండితుడు శ్రీనివాస్ వర్మ ఆధ్వర్యంలో పార్టీ నేతలు వినాయక విగ్రహానికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ సర్కారు పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, టీపీసీసీ నేతలు నిరంజన్, కుమార్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ బంధాల్లో రేవంత్ సర్కార్ చిచ్చు

» 31 సాకులు చూపుతూ రుణ మాఫీకి కోతలు: హరీశ్

హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రుణ మాఫీ ఆంక్షలతో కుటుంబ బంధాల్లో సీఎం రేవంత్‌రెడ్డి చిచ్చు పెట్టారని, తల్లీకొడుకులు, తండ్రీకొడుకులు, అన్నదమ్ముల మధ్య గొడవలు పెట్టి.. బంధాలను విచ్ఛిన్నం చేసిన దరిద్రపు గొట్టు ప్రభుత్వం ఇదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తొమ్మిది నెలల కాంగ్రెస్ పాలన రైతుల పాలిట యమపాశంగా మారిందన్నారు. మేడ్చల్‌లో వ్యవసాయ శాఖ కార్యాలయం ముందు లేఖ రాసి మరీ సురేందర్‌రెడ్డి ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ.. ఇది ప్రభుత్వ హత్యేనని విమర్శించారు. కుటుంబంలో ఒక్కరికే రుణ మాఫీ వర్తింపజేయాలన్న నిబంధన వల్లే ఈ ఘటన చోటు చేసుకుందని ఆరోపించారు. సిద్దిపేట నియోజకవర్గం జక్కాపూర్‌లోని గురజాల బాల్‌రెడ్డి కుటుంబంలో ముగ్గురికి రూ.6 లక్షల అప్పు ఉంటే కేవలం రూ.2 లక్షలే మాఫీ అవుతోందని తెలిపారు. ఇది మోసం కాదా? కేసీఆర్ హయాంలో ఇలాంటి నిబంధనలు ఏవైనా ఉన్నాయా? అని ప్రశ్నించారు. రుణమాఫీ ఎగ్గొట్టడానికి రేవంత్ ప్రభుత్వం 31 సాకులు చూపెడుతోందని విమర్శించారు. నారాయణపేటలో నల్ల మణెమ్మ భర్త 2010లోనే చనిపోయారని, ఆయన ఆధారు కార్డు లేదన్న సాకుతో రుణమాఫీ సొమ్మును వేయకపోవడం ఎంత వరకు సమంజసమని నిలదీశారు. 20లక్షల మందికే ఇప్పటి దాకా రుణమాఫీ అయిందని, ఇంకా 21లక్షల మందికి చేయాల్సి ఉందని మంత్రి తుమ్మల చెబుతుంటే... మొత్తం మాఫీ చేసేశామంటూ రేవంత్ అబద్ధాలాడుతున్నారని దుయ్యబట్టారు. యాసంగి వేసే టైమ్ వస్తున్నా.. వానాకాలం పెట్టుబడి సాయం అందించలేదని, వడ్లకు బోనస్ అనేది బోగస్‌గా మారిందని ధ్వజమెత్తారు. పోలీసులను తాను వ్యక్తిగతంగా విమర్శించలేదని, ప్రభుత్వ వైఫల్యం వల్లే రాష్ట్రంలో శాంతి భద్రతలు దెబ్బతిన్నాయన్నానని చెప్పారు. ఇది వాస్తవం కాదా? అని ఆయన ప్రశ్నించారు.

జర్నలిస్టులకు కొత్త పాలసీ!

(మొదటిపేజీ తరువాయి)

జర్నలిజం లాంటి అంశాలన్నింటినీ క్రోడీకరించి కొత్త విధివిధానాలను రూపొందించాలని మీడియా అకాడమీకి సూచించారు. వాటిపై చర్చించి, మంత్రివర్గంలో ఆమోదింపజేసుకుని, చట్టబద్ధత కల్పిస్తామని చెప్పారు. ఆ బాధ్యత తనదేనని సీఎం స్పష్టంచేశారు. ఒక వ్యవస్థను పకడ్బందీగా ఏర్పాటు చేస్తే, అన్నీ దాని ప్రకారమే నడుస్తాయని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ వ్యవస్థలు, శాఖలు కూలిపోయే స్థితికి వచ్చాయని.. వాటిని బలోపేతం చేసి, ముందుకు తీసుకెళ్లడానికే సుదీర్ఘ సమీక్షలు చేస్తూ, విధివిధానాలను ఖరారు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో పర్యాటకం, క్రీడలు, విద్యుత్తుకు విధానాలే లేవని.. అసలు తెలంగాణ రాష్ట్రానికే ఒక పాలసీ అంటూ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము సమస్యలన్నింటినీ ఒక్కొక్కటిగా సమన్వయం చేసుకుంటూ.. శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వమనే బండిని నడపడం అంత ఆషామాషీ కాదన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన 'జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ'కి పేట్‌బషీరాబాద్‌లోని 38 ఎకరాల భూమి పత్రాలను అందించే కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. జేఎన్‌జే సొసైటీలో లేని ఇతర జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాలు ఇచ్చే బాధ్యత తమ ప్రభుత్వానిదన్నారు. మిగిలిన జర్నలిస్టులకు ప్రభుత్వం నిర్మించబోయే ఫోర్త్‌సిటీ, ఫ్యూచర్‌సిటీలో స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. జేఎన్‌జేకు ఇచ్చిన భూమితో పాటు చేయగలిగిన సాయం కూడా చేస్తామని చెప్పారు. కాగా, మరణించిన జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు రూ.లక్ష చెక్కులను అందించారు. అదేవిధంగా ఆ కుటుంబంలో చదువుకునే విద్యార్థులకు ఒకటి నుంచి పదో తరగతి వరకు నెలకు రూ.1000 స్టైపెండ్ అందించనున్నట్లు మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి చెప్పారు.

కొన్ని పత్రికలు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నాయ్

నిజమైన జర్నలిస్టులకు ఇచ్చే అక్రిడిటేషన్, ఆరోగ్య భద్రత కార్డు, ఇంటి పట్టాల విషయంలో ఎలాంటి నష్టం జరగకుండా చూసే బాధ్యత తమ ప్రభుత్వానిదని సీఎం చెప్పారు. తమ సిద్ధాంతాలను రాసుకోవాల్సిన పత్రికలు కూడా భాష విషయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. పత్రికా భాష, పద ప్రయోగంలో విజ్ఞత ఉండాలని సూచించారు. 'కొంత మందికి రేవంత్‌రెడ్డి నచ్చకపోవచ్చు. కానీ.. ఇప్పుడు అతను ముఖ్యమంత్రి పదవిలో ఉన్నాడు. వ్యక్తిగా కాకుండా ఆ పదవిని గౌరవించైనా రాయాలి కదా?' అని అన్నారు. ప్రజల కోసం పనిచేసే, వారి సమస్యలను వెలికి తీసే జర్నలిస్టులు ఒక వర్గంగా ఉంటే.. కేవలం రాజకీయ పార్టీ యజమానిని రక్షించడానికి ప్రయత్నం చేస్తున్నవారు మరో వర్గంగా ఉన్నారని రేవంత్ చెప్పారు. ఈ రెండు వర్గాలను విడదీయాలన్నారు. లేకపోతే నిజమైన జర్నలిస్టులకు నష్టం జరుగుతుందని తెలిపారు. అసెంబ్లీ, సచివాలయం, ప్రభుత్వ కార్యాలయాల్లోకి జర్నలిస్టులను అనుమతించడానికి అభ్యంతరం లేదని సీఎం చెప్పారు. కానీ, అందుకోసం సరైన కార్డులను తీసుకొని, సరైన విధానంలో రావాలని స్పష్టం చేశారు. సచివాలయంలోకి ఎవరు రావాలి? పత్రిక సర్క్యులేషన్ ప్రకారం ఎంత మందికి పాసులు ఇవ్వాలి? అనే విషయంపైనే తమ తదుపరి అడుగు ఉంటుందని చెప్పారు. అసెంబ్లీకి వచ్చే జర్నలిస్టులకు కూడా సీనియారిటీ, అనుభవాలను గుర్తించి.. పాసులు ఇస్తే సీఎం సహా ఎవరిని కలవాలన్నా నియంత్రణలు ఉండబోవని తెలిపారు. అనుభవజ్ఞులైన జర్నలిస్టులతో ఇష్టాగోష్టి నిర్వహించినపుడు 'ఆన్ రికార్డు, ఆఫ్ ద రికార్డు' అని మాట్లాడిన వాటిని వారు మరోచోట ప్రస్తావించేవారు కాదన్నారు. ఇష్టాగోష్టిలో స్నేహితుల్లాగా యథాలాపంగా మాట్లాడతామని, అలాంటి వ్యాఖ్యలను కూడా రికార్డు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.



సీఎం రేవంత్, మంత్రి పొంగులేటిని గజమాలతో సత్కరిస్తున్న జేఎన్‌జే హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు

రాజకీయాన్ని చిన్నచూపు చూసే దుస్థితి..

జర్నలిస్టులంటే సమాజానికి చికిత్స చేసే డాక్టర్లని మాజీ సీఎం రాజశేఖరరెడ్డి పేర్కొన్నారని రేవంత్ గుర్తు చేశారు. జేఎన్‌జే సొసైటీ ఇళ్ల స్థలాలను అందించే అంశంలో జాప్యం జరగడంపై రేవంత్‌రెడ్డి స్పందిస్తూ.. తెలంగాణ ఏర్పాటు జటిలమైన సమస్య అని, అలాంటి దానికే కాంగ్రెస్ పరిష్కారం చూపిందని చెప్పారు. జవహర్‌లాల్ నెహ్రూ పేరు మీద ఏర్పాటు చేసుకున్న జర్నలిస్టు హౌసింగ్ సొసైటీకి సోనియాగాంధీ ప్రతినిధులుగా ఈ సమస్యను పరిష్కరించడం తమ బాధ్యతగా భావించే పరిష్కరించామని తెలిపారు. ఇప్పటికే దాదాపు 73 మంది ఈ నిజాన్ని చూడకముందే కన్నుమూశారని, అలాంటి పరిస్థితి, నష్టం ఎవరికీ జరగకూడదన్న ఆలోచనలో భాగంగానే శాశ్వత పరిష్కారం చూపినట్లు తెలిపారు. వృత్తిపరమైన గౌరవాన్ని ఎవరో పెంచరని, మనకి మనమే పెంచుకోవాలని విలేకరులకు సూచించారు. ప్రస్తుతం రాజకీయ వృత్తిని సమాజం చిన్న చూపు చూసే దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు వారి అవసరాలకు లేదా వారి బంధు మిత్రుల కోసమే పనిచేస్తారనే చర్చ ప్రజల్లో రావడమే ఇందుకు కారణమని చెప్పారు. రాజకీయ పార్టీలు ప్రారంభించుకున్న పత్రికల్లో పనిచేస్తున్న పాత్రికేయులు ఉన్మాదంగా మారి.. ప్రెస్‌మీట్ లేదా జరుగుతున్న కార్యక్రమాలను ఇబ్బంది పెట్టే పరిస్థితులు నెలకొన్నాయ ని చెప్పారు. అయితే అలాంటి పత్రికల్లో పనిచేస్తున్న వారంతా ఇలానే ఉన్నారని తాను అనడం లేదని, కొంద రు ఉన్నారని, వారిని నియంత్రించుకుంటూ ఎలా ముం దుకెళ్లాలో చెప్పాలని కోరారు. గతంలో సచివాలయానికి ప్రజాప్రతినిధులుగా తామే వెళ్లలేకపోయేవాళ్లమని.. కానీ, ఇప్పుడు సీఎం కార్యాలయానికి జర్నలిస్టులు వచ్చి కూర్చోవడంతో పాటు చిట్‌చాట్‌లు, ప్రెస్‌మీట్లకు అక్కడి నుంచే హాజరవుతున్నారని తెలిపారు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలన్నింటినీ సచివాలయం నుంచే జర్నలిస్టులు రాసేలా తమ ప్రభుత్వం మార్పు తెచ్చిందన్నారు. కొన్ని రాజకీయ పార్టీలకు చెందిన పత్రికల్లో పనిచేసే వారు మంత్రుల కార్యాలయాలు, మరికొన్నిచోట్లకు వెళ్లి కూర్చోవడంతో పాటు కొన్ని విషయాల్లో అనవసర రాద్ధాంతం సృష్టిస్తున్నారన్నారు. అసెంబ్లీకి వచ్చేందుకు పాసులు ఇచ్చినా లేదా ప్రెస్‌మీట్ నిర్వహించినా.. గుర్తింపు పొందిన జర్నలిస్టులకు కుర్చీ దొరకడం లేదన్నారు. ఈ పద్ధతికి ముగింపు పలకాల్సిందేనని చెప్పారు.

నేనూ హౌసింగ్‌సొసైటీకి 10 లక్షలు చెల్లించా

ఎమ్మెల్సీగా తాను కూడా ఒక హౌసింగ్ సొసైటీలో సభ్యుడినేనని, రూ.10 లక్షలు చెల్లించానని, అయినా ఇప్పటికీ తనకు ఇంటి పట్టా రాలేదని సీఎం రేవంత్ అన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు ఇస్తున్నారు.. మరి మనకు పట్టా ఎప్పుడు వస్తుందంటూ తన కుటుంబ సభ్యులు అడుగుతున్నారని సరదాగా వ్యాఖ్యానించారు.

ఫ్యూచర్ సిటీలో భాగస్వాముల్ని చేస్తాం..

జర్నలిస్టుల శిక్షణ, వివిధ అవసరాల నిమిత్తం ప్రెస్ అకాడమీకి రూ.10 కోట్లు అందజేయనున్నట్లు సీఎం రేవంత్ ప్రకటించారు. జేఎన్‌జే మినహా మిగిలిన జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఒక కమిటీ ఏర్పాటు చేయడంతో పాటు ఆ బాధ్యతలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డికి అప్పగిస్తున్నట్లు తెలిపారు. వారి నేతృత్వంలో జర్నలిస్టులంతా కలిసి ఒక నిర్ణయానికి వచ్చి ఫైల్ తన దగ్గరకు తీసుకొస్తే అందరికీ మంచి జరుగుతుందని చెప్పారు. జర్నలిస్టులు ఎవరూ తమకు స్థలం రాదనే ఆందోళన, ఆవేదనకు గురి కావొద్దని, అర్హులైన జర్నలిస్టులను ఫ్యూచర్ సిటీలో భాగస్వాములను చేసే బాధ్యత తనదని భరోసా ఇచ్చారు. గతంలో హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ నిర్మిస్తే.. ఇప్పుడు మనమంతా కలిసి నాలుగో నగరం 'ఫ్యూచర్ సిటీ'ని నిర్మిద్దామని సీఎం పిలుపునిచ్చారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఫ్యూచర్ సిటీలో అన్నీ ఉండేలా ఏర్పాటు చేస్తామన్నారు. అందులో జర్నలిస్టులు లేకపోతే అది అసంపూర్తిగా ఉంటుందని, అందుకే జర్నలిస్టులను కూడా అక్కడికి తీసుకెళ్తానని చెప్పారు.

18 ఏళ్ల సమస్యను పరిష్కరించాం

» మంత్రి పొంగులేటి

జేఎన్‌జే సంఘం ప్రతినిధులకు సీఎం రేవంత్ చేతుల మీదుగా భూమి స్వాధీన పత్రాలను అందజేశారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలతో పాటు మీడియా మిత్రుల సహకారంతో రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం ఏర్పడిందన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు జర్నలిస్టుల 18 ఏళ్ల కోరికను నేడు తీర్చగలిగామని చెప్పారు. ఇళ్ల స్థలాలు పొందిన సభ్యులంతా ఇప్పుడు కోటీశ్వరులని హర్షం వ్యక్తం చేశారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వంలో మొదటి సంవత్సరంలోనే జర్నలిస్టుల సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత జర్నలిస్టుల సమస్య పరిష్కారమైందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీనివాస్‌రెడ్డి చొరవతోనే ఇది సాధ్యమైందని చెప్పారు. హైదరాబాద్ జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు ప్రయత్నం జరగాలని కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మనదగ్గర 24 వేల అక్రిడిటేషన్ కార్డులు ఉన్నాయన్నారు. 2016 అక్రిడిటేషన్ నిబంధనల్లో చాలా పొరపాట్లు ఉన్నాయని చెప్పారు. భాషా ప్రాతిపదికన అక్రిడిటేషన్ కార్డుల విభజన జరగకూడదన్నారు. మీడియా అకాడమీ ద్వారా జర్నలిస్టులకు శిక్షణ శిబిరాలు నిర్వహించాల్సిన అవసరముందని చెప్పారు. కొంత మంది అనర్హులు కూడా జర్నలిస్టులమని చెప్పుకొంటూ వృత్తి గౌరవాన్ని తగ్గిస్తున్నారని వాపోయారు. ఈ విషయంలో ప్రక్షాళన జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీలు అనిల్‌కుమార్‌యాదవ్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి, జేఎన్‌జేహెచ్‌ఎస్ డైరెక్టర్లు వంశీ శ్రీనివాస్, కిరణ్‌కుమార్, రవికాంత్‌రెడ్డి, రమణారావు, అశోక్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ దేవులపల్లి అమర్, పాత్రికేయుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అంటేనే సామాజిక న్యాయం.. సమానత్వం

» సీఎం రేవంత్‌ది రెడ్డి సామాజిక వర్గం

» డిప్యూటీ సీఎంది ఎస్సీ సామాజికవర్గం

» టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్.. బీసీ

» మూడు ప్రధాన సామాజిక వర్గాలకు 3 కీలక పదవులు ఇచ్చిన అధిష్ఠానం

» కాంగ్రెస్‌లో కష్టపడ్డ వారికి అవకాశాలు

» మహేష్ నియామకమే దీనికి నిదర్శనం

» స్వేచ్ఛగా చెప్పే అవకాశం కాంగ్రెస్‌లోనే

» ప్రాంతీయ పార్టీల్లో అలా ఉండదు

» బీజేపీలో ఎప్పుడు పదవి వస్తుందో.. పోతుందో తెలియదు: తూర్పు జగ్గారెడ్డి



హైదరాబాద్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అంటేనే సామాజిక న్యాయం.. సమానత్వమని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి అన్నారు. పార్టీలోని మూడు కీలక పదవులను అధిష్ఠానం.. మూడు ప్రధాన సామాజిక వర్గాలకు ఇచ్చిందని చెప్పారు. సీఎం రేవంత్‌ది రెడ్డి సామాజిక వర్గం కాగా.. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఎస్సీ వర్గానికి చెందిన వారని పేర్కొన్నారు. తాజాగా టీపీసీసీ అధ్యక్షుడిగా నియామకమైన మహేష్‌కుమార్‌గౌడ్ బీసీ సామాజిక వర్గానికి చెందిన వారన్నారు. కాంగ్రెస్‌లో కష్టపడిన వారికి అవకాశాలు ఉంటాయని, టీపీసీసీ చీఫ్‌గా మహేష్‌కుమార్‌గౌడ్ నియామకం దీనికి నిదర్శనమని చెప్పారు. గాంధీభవన్‌లో శనివారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ.. సోనియాగాంధీ నాయకత్వం, రాహుల్.. మల్లికార్జున ఖర్గేల సారథ్యంలో మహేష్‌కుమార్‌గౌడ్‌ను అధిష్ఠానం.. టీపీసీసీ అధ్యక్షుడిగా నియమించిందన్నారు. బీసీ సామాజిక వర్గానికి పీసీసీ చీఫ్ పదవి ఇవ్వడం మంచి పరిణామమని పేర్కొన్నారు. పీసీసీ చీఫ్ కోసం బీసీ సామాజిక వర్గం నుంచి మహేష్ గౌడ్, మధుయాష్కీ పేర్లు, ఎస్సీల నుంచి సంపత్‌కుమార్ పేరుపైన, ఎస్టీల నుంచి బలరాం నాయక్ పేరును పరిశీలించారని చెప్పారు. సోనియా, రాహుల్, ప్రియాంక, రేవంత్, భట్టి, ఉత్తమ్‌ల సహకారంతో టీపీసీసీ చీఫ్‌గా మహేష్‌కుమార్‌గౌడ్ పేరును కేసీ వేణుగోపాల్ ప్రకటించారన్నారు. సీఎం, సీనియర్ మంత్రులు.. పీసీసీ చీఫ్ కలిసి సమన్వయంతో పార్టీని ముందుకు తీసుకెళ్తారని ధీమా వ్యక్తం చేశారు.

టీపీసీసీ చీఫ్ కావాలన్న ఆలోచన మారదు

జగ్గారెడ్డికి.. టీపీసీసీ చీఫ్ కావాలన్న ఆలోచన మారేది లేదని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. ఇలా స్వేచ్ఛగా చెప్పుకునే అవకాశం కాంగ్రెస్‌లోనే ఉంటుందన్నారు. రెడ్డిలకు టీపీసీసీ చీఫ్ పదవి ఇప్పుడు ఇవ్వొద్దని ఏఐసీసీ అనుకుందని, అందుకే బీసీకి ఇచ్చిందని చెప్పారు. రెడ్డిలకు ఇవ్వాలనుకున్నప్పుడు జగ్గారెడ్డి చర్చలోకి వస్తాడన్నారు. బీజేపీలో పదవి ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియదన్నారు. ప్రాంతీయ పార్టీల్లోనైతే వేరేవాళ్లకు అవకాశమే ఉండదని, తండ్రి.. లేకుంటే కొడుకే అధ్యక్షుడవుతారన్నారు.

నెహ్రూతోనే వెనుకబడిన కులాల అభివృద్ధి

దేశంలో వెనుకబడిన కులాల అభివృద్ధికి విత్తనం నాటిందే నెహ్రూ అని జగ్గారెడ్డి అన్నారు. ఆర్థికంగా బలహీనంగా ఉన్న కులాల అభివృద్ధికి నెహ్రూ, ఇందిరలు ప్రోత్సాహాన్ని అందించారని చెప్పారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.

కాళోజీ బతుకంతా తెలంగాణ కోసమే: కేసీఆర్

హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణ రావు జయంతి సందర్భంగా ఆయన సేవలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు. ప్రజాపక్షాన నిలిచి ధిక్కారమే జీవితంగా స్ఫూర్తివంతమైన జీవితాన్ని గడిపిన మానవతావాది కాళోజీ అని కొనియాడారు. కాళోజీ జయంతి సందర్భంగా విడుదల చేసిన పత్రికా ప్రకటనలో కేసీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. బతుకంతా తెలంగాణ కోసమే అర్పించిన అక్షర తపస్వి కాళోజీ అంటూ కేసీఆర్ కీర్తించారు. తెలంగాణ సాధన కోసం తాను బయలుదేరిన నాడు నిండు మనసుతో కాళోజీ దీవించారని కేసీఆర్ గుర్తుచేసుకున్నారు. కాళోజీ స్ఫూర్తి కొనసాగే దిశగా ఆయన జన్మదినాన్ని తెలంగాణ భాషా దినోత్సవంగా నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించిందన్నారు.

మీ విజయాన్ని వర్ణించేందుకు మాటలు రావడంలేదు

» రేవంత్‌పై కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు

హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): 'మొన్నటిదాకా 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ర్యాంకింగుల్లో అగ్రస్థానంలో ఉన్న తెలంగాణ అట్టడుగు స్థానానికి చేరుకుంది. ఈ పరిస్థితికి చేరుకోవడంలో మీరు సాధించిన విజయాన్ని వర్ణించేందుకు మాటలు రావడం లేద'ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. సీఎం రేవంత్ రెడ్డిపై ఆదివారం ఎక్స్ వేదికగా వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ స్థానానికి రావడానికి స్వచ్ఛ్ బయో, వాల్స్ కర్రా లాంటివి అవసరమని, తదుపరి దావోస్ సదస్సులో 'న్యూక్లియర్ చైన్ రియాక్షన్' గురించి రేవంత్ రెడ్డి వివరించాలని ఆయన ఎద్దేవా చేశారు.

రుణమాఫీపై బీఆర్ఎస్ విష ప్రచారం

» రైతులను ఆందోళనకు గురిచేసే యత్నం

» రుణమాఫీ, రైతు భరోసాపై స్పష్టమైన విధానంతో ప్రభుత్వం ముందుకెళుతోంది

» ఒకే విడతలో 22లక్షల మందికి 18వేల కోట్ల మాఫీ చేసి మాట నిలబెట్టుకుంది

» రైతులకు బీఆర్ఎస్ నాయకులు క్షమాపణ చెప్పి పాపాలకు ప్రాయశ్చిత్తం చేసుకోవాలి


» వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



హైదరాబాద్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): గడిచిన పదేళ్లలో ఏ ఒక్క పథకాన్నీ సక్రమంగా అమలు చేయని పెద్దలు.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి పది నెలలైనా గడవక ముందే మైకుల ముందుకొచ్చి గొంతు చించుకుంటున్నారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. వారు రుణమాఫీపై విషప్రచారంతో రైతులను ఆందోళనకు గురిచేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం, డిప్యూటీ సీఎంతో పాటు మంత్రులందరిదీ ఒకటే మాట అని, రుణమాఫీ, రైతు భరోసాపై స్పష్టమైన విధానంతో ముందుకెళుతున్నామని ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. గత ప్రభుత్వం మాదిరిగా లక్ష రూపాయల రుణమాఫీకి 4 వాయిదాలు తీసుకోలేదన్నారు. తెలంగాణకు, ముఖ్యంగా రైతులకు ద్రోహం చేసిందెవరో, ఏ ఊరిలో ఏ గడపకెళ్లి అడిగినా తెలుస్తుందన్నారు. కర్రు కాల్చి వాత పెట్టినట్లు ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పారని తుమ్మల పేర్కొన్నారు. కుటుంబం యూనిట్‌గా, రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకుని 2018లో బీఆర్ఎస్ ప్రభుత్వం 20.84 లక్షల మందికి రుణమాఫీ ఎగ్గొట్టిన విషయం నిజం కాదా? అని ప్రశ్నించారు. సగం మందికే చేసిన రుణ మాఫీలో సైతం 2.26 లక్షల మందికి సంబంధించి రూ.1,419 కోట్లు తిరిగి ప్రభుత్వ ఖజానాకు వచ్చినా, వాటిని రైతులకు చెల్లించే ప్రయత్నం చేశారా అని నిలదీశారు. ఒకరిద్దరు కాదు, 2018లో రుణమాఫీ కాని 20 లక్షల మంది రైతుల పేర్లు ఇవ్వగలమని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలా ఐదేళ్ల పాటు సాగదీయలేమని, ఈ పంట కాలంలోనే రుణమాఫీ పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15 కల్లా సరైన వివరాలున్న అన్ని ఖాతాలకు 2 లక్షల్లోపు రుణమాఫీ వర్తింపజేశామన్నారు. మొదటి పంటకాలంలోనే ఒకే విడతలో 22 లక్షల మందికి రూ.18 వేల కోట్ల రుణమాఫీ చేశామన్నారు. కుటుంబ నిర్ధారణ కాని వారి వివరాలను వ్యవసాయాధికారులు సేకరిస్తున్నారని, ఇప్పటికే 2.65 లక్షల మంది వివరాలు సేకరించారని పేర్కొన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు బుద్ధి తెచ్చుకొని, అసత్య ప్రచారాలు మానుకోవాలన్నారు. వడ్డీ మాఫీ చేయకుండా వదిలేసిన 22 లక్షల రైతు కుటుంబాల దగ్గరకు బీఆర్ఎస్ నాయకులు వెళ్లి క్షమాపణ అడిగి పాపాలకు ప్రాయశ్చిత్తం చేసుకోవాలని మంత్రి తుమ్మల హితవు చెప్పారు.

నేడు ఐఐహెచ్‌టీ ప్రారంభం

చేనేత రంగంలో నూతన పద్ధతుల్లో శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)ని సోమవారం పబ్లిక్ గార్డెన్స్‌లోని లలిత కళాతోరణంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని మంత్రి తుమ్మల తెలిపారు. నేతన్నకు చేయూత పథకం కింద 36,133 మందికి రూ.290కోట్లు సీఎం పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన టీపీసీసీ చీఫ్ మహేశ్, కుటుంబ సభ్యులు

సీఎంను కలిసిన టీపీసీసీ కొత్త చీఫ్

హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీకి నూతన చీఫ్‌గా నియమితుడైన మహేశ్ కుమార్ గౌడ్ సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం కుటుంబ సమేతంగా తనను కలిసిన మహేశ్‌గౌడ్‌కు సీఎం శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనతో కలసి వినాయక పూజలో పాల్గొన్నారు. తర్వాత మహేశ్ గౌడ్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నివాసానికి వెళ్లి ఆయన్ను కలిశారు. అనంతరం.. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీని, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కూడా కుటుంబ సమేతంగా వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్‌ను వారు అభినందించారు. ఇక ఆదివారం కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు మహేశ్‌గౌడ్‌ను ఆయన నివాసంలోనూ, న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని ఆయన కార్యాలయంలోనూ కలిసి అభినందనలు తెలిపారు. మహేశ్‌గౌడ్‌ను కలిసిన వారిలో ఎంపీ చామల, ఎమ్మెల్యేలు బీర్ల అయిలయ్య, మల్‌రెడ్డి రంగారెడ్డి, దానం, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, తేజస్వినీ రెడ్డి తదితరులున్నారు. అనంతరం మహేశ్ గౌడ్.. మంత్రి శ్రీధర్‌బాబు నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల ఆయన వెంట ఉన్నారు.

బహుభాషా కోవిదుడు నలిమెల భాస్కర్‌కు
కాళోజీ సాహితీ పురస్కారం

(మొదటి పేజీ తరువాయి)

మానేరు రచయితల సంఘం, సిరిసిల్ల సాహితీ సమితి, రాజన్న సిరిసిల్ల జిల్లా కవులు, రచయితలు అభినందనలు తెలిపారు. ప్రజా కవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఏటా సెప్టెంబరు 9న ప్రభుత్వం ఈ అవార్డును ప్రదానం చేస్తుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో జన్మించిన నలిమెల భాస్కర్ అధ్యాపకుడిగా, సాహిత్య రంగంలో ఎనలేని కృషి చేస్తూ కరీంనగర్‌లో స్థిరపడ్డారు. ఆయనకు తెలుగు, హిందీ, ఆంగ్లం, తమిళం, కన్నడం, మలయాళం, బెంగాలీ, అస్సామీ, ఒరియా, గుజరాతీ, పంజాబీ, ఉర్దూ, సంస్కృతం, మరాఠీ భాషల్లో పట్టుంది. తెలుగు అధ్యాపకుడిగా 2011లో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. తెలంగాణ పదకోశాన్ని రూపొందించిన భాస్కర్ పలు భారతీయ భాషల కథలను తెలుగులోకి అనువదించారు. మలయాళ నవల 'స్మారక శిశిగల్'ను స్మారక శిలలు పేరిట తెలుగులోకి అనువదించిన ఆయనకు 2013 సంవత్సరానికి గాను కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం దక్కింది. 1998 నుంచి 1999 వరకు 35 వారాల పాటు 'ఆంధ్రజ్యోతి' ఆదివారం అనుబంధంలో 'సాహితీ సుమాల' పేరుతో వ్యాసాలు రాశారు. కాగా కాళోజీ పురస్కారానికి ఎంపికవడం చాలా సంతోషంగా ఉందని డాక్టర్ నలిమెల భాస్కర్ 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు. ఈ పురస్కారంతో తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. కాళోజీ విశ్వమానవుడని, ఆయనలో అనేక పార్శ్వాలు కనిపిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ తెలంగాణ భాషా సరస్వతి రుణం తీర్చుకోవాలని కోరారు.

చోరీ బయటపడుతుందని నేలకేసి బాదాడు

- షాద్‌నగర్‌లో ఎనిమిదేళ్ల బాలుడి దారుణ హత్య

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో ఓ ఎనిమిదేళ్ల బాలుడు హత్యకు గురయ్యాడు. పందులను దొంగలించేందుకు వచ్చిన ఓ వ్యక్తి ఆ బాలుడి తలను నేలకేసి బాది ఉసురు తీశారు. పోలీసుల కథనం ప్రకారం.. దుర్గయ్య-శాలమ్మ దంపతులు షాద్‌నగర్ శివారు హాజీపల్లి రోడ్డులో గుడిసె వేసుకుని పందులు పెంచుకుంటున్నారు. దుర్గయ్య దంపతులకు కట్టప్ప(8) అనే కొడుకు ఉన్నాడు. వీరి గుడిసె పక్కనే మరో గుడిసెలో నివాసముండే ఎల్లప్ప శుక్రవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో దుర్గయ్యకు చెందిన పందుల దొంగతనానికి యత్నించాడు. ఆ సమయంలో మరో ఇద్దరు పిల్లలతో కలిసి అక్కడే ఉన్న కట్టప్ప తనని గమనించడాన్ని ఎల్లప్ప చూశాడు. దీంతో దొంగతనం సంగతి బయటపడుతుందోనని భావించి కట్టప్ప కాళ్లు పట్టుకొని తలను నేలకేసి బలంగా కొట్టాడు. దీంతో కట్టప్ప మరణించగా.. ఎల్లప్ప పారిపోయాడు. ఈ దాడిని చూసి భయంతో పరుగెత్తిన విగిలిన పిల్లలు జరిగిన విషయాన్ని కట్టప్ప తల్లిదండ్రులకు చెప్పారు పోలీసు దర్యాప్తు కొనసాగుతోంది.

ఆపరేషన్ కగార్‌తో నరమేధం

- సీపీఐ(మావోయిస్టు) అధికార ప్రతినిధి జగన్

వరంగల్, కరకగూడెం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మావోయిస్టు పార్టీని నిర్మూలించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఆపరేషన్ కగార్‌తో నరమేధం సృష్టిస్తున్నాయని ఆ పార్టీ అధికార ప్రతినిధి జగన్ ఓ ప్రకటనలో ఆరోపించారు. ప్రజా పాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం హంతక పాలన సాగిస్తోందని అన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచే నెత్తుటేరులు పారిస్తోందని ఆరోపించారు. రఘునాథపాలెం ఎన్‌కౌంటర్‌ను ఖండిస్తూ మావోయిస్టు పార్టీ ఈ నెల 9న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చిందని, దాన్ని విజయవంతం చేయాలన్నారు.

కూరెళ్ల శిష్యుడిని కావడం నా అదృష్టం

- హైకోర్టు న్యాయమూర్తి కూనూరు లక్ష్మణ్



రామగిరి(నల్లగొండ), సెప్టెంబరు 8: పద్మశ్రీ అవార్డు గ్రహీత కూరెళ్ల విఠలాచార్యకు శిష్యుడినికావడం అదృష్టంగా భావిస్తున్నానని హైకోర్టు న్యాయమూర్తి కూనూరు లక్ష్మణ్ అన్నారు. తన ఇంటినే గ్రంథాలయంగా మార్చిన విఠలాచార్య 2.15 లక్షల పుస్తకాలను సేకరించారని తెలిపారు. నల్లగొండలో కూరెళ్ల విఠలాచార్యకు ఆదివారం పౌరసన్మానం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి మాట్లాడుతూ.. కూరెళ్ల 1954లోనే గ్రంథాలయం ఏర్పాటుచేసి దానికి శంభులింగేశ్వర అని నామకరణం చేశారని గుర్తు చేశారు. తెలుగు భాష, సాహిత్యం అమ్మలాంటివని చెప్పారు. విఠలాచార్య మాట్లాడుతూ తన సన్మాన కార్యక్రమానికి తన శిష్యుడే ముఖ్య అతిథిగా రావడం మరపురాని అనుభూతి అన్నారు.

రూ.25 లక్షలతో వెండి వినాయక విగ్రహం

- మానుకోటలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన గణనాథుడు



మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 8 : వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో 'శ్రీలక్ష్మి బాలాజీ గణపతి సేవా ట్రస్టు' ఆధ్వర్యంలో వెండితో తయారు చేసిన వినాయక విగ్రహాన్ని మండపంలో శనివారం ఏర్పాటు చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన సోమ రత్నశేఖర్, జంగాల కిరణ్‌కుమార్, ఈగ శ్రీనివాస్, వోలం విద్యాసాగర్, వేములపల్లి శ్రీనాథ్‌తో పాటు మరికొంత మంది కలిసి ఈ ఏడాది శ్రీలక్ష్మి బాలాజీ గణపతి సేవా ట్రస్టును ఏర్పాటు చేశారు. ఈ ట్రస్టు ఆధ్వర్యంలో తొలిసారిగా వినాయక చవితి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో వెండి వినాయక విగ్రహాన్ని తయారు చేయించాలని నిర్ణయించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తెనాలిలో నెల క్రితం లక్ష్మీప్రియ జ్యూవెల్లరీలో ఆర్డర్ ఇచ్చారు. వారు రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో రూ.25 లక్షల విలువ గల 18 కేజీల వెండి వినాయక విగ్రహాన్ని తయారు చేయించారు. ఈ విగ్రహాన్ని ఈనెల 2వ తేదీన అక్కడ నుంచి ప్రత్యేక వాహనంలో మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి తీసుకువచ్చారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో ఏర్పాటు చేసి ట్రస్ట్‌సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు.

సదరు వెండి వినాయక విగ్రహం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆ విగ్రహాన్ని చూసేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు.

నిలిచిన వైద్యవిద్య ప్రవేశాలు!

- హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో అప్పీల్‌కు.. నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం
- సుప్రీంకోర్టు తీర్పుపైనే ఆశలు
- అనుకూలంగా వస్తే వెంటనే కౌన్సెలింగ్
- వ్యతిరేకంగా వస్తే మరింత ఆలస్యం



హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్యవిద్య ప్రవేశాల ప్రక్రియ నిలిచిపోయింది. స్థానికత వివాదంపై హైకోర్టు తీర్పు నేపథ్యంలో కౌన్సెలింగ్ ప్రక్రియకు బ్రేకులు పడ్డాయి. తెలంగాణలో శాశ్వత నివాసితులైన విద్యార్థుల స్థానికతను నిర్ధారించేందుకు కొత్త మార్గదర్శకాలను రూపొందించాలని న్యాయస్థానం ప్రభుత్వానికి సూచించింది. నిజానికి వీటి రూపకల్పనకు చాలా సమయం తీసుకునే అవకాశంది ఉంది. ఇప్పటికిప్పుడు స్థానికతపై మార్గదర్శకాలు రూపొందించి, ముందుకెళ్లడం ఇప్పట్లో జరిగే పనికాదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే ఇస్తే వైద్యవిద్య ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియ సులభతరం అవుతుందని అధికారులు భావిస్తున్నారు. స్థానికతపై రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో-33 ఆధారంగా నోటిఫికేషన్ ఇచ్చారు. అందుకు సంబంధించిన ప్రక్రియను కాళోజీ వైద్య విశ్వవిద్యాలయం పూర్తి చేసింది. సుప్రీంకోర్టులో అనుకూలంగా తీర్పు వస్తే.. రెండు రోజుల్లోనే మొదటివిడత ఎంబీబీఎస్ ప్రవేశాల కౌన్సెలిగ్ ప్రక్రియను చేపట్టేందుకు సిద్ధమైంది. ఇప్పటికే పొరుగు రాష్ట్రాల్లో ఒక ట్రెండ్రోజుల్లో మొదటివిడత సీట్ల భర్తీ ముగియనుంది.

వ్యతిరేక తీర్పు వస్తే ఆలస్యమే?

ఒకవేళ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు సమర్థిస్తే మాత్రం తెలంగాణ సర్కారు కొత్త కష్టాలను ఎదుర్కొవాల్సి ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అదే జరిగితే.. హైకోర్టు సూచించినట్లుగానే స్థానికతపై మార్గదర్శకాలు రూపొంచాల్సి ఉంటుంది. అందుకోసం ప్రభుత్వం ఒక కమిటీని వేయాల్సి ఉంటుంది. ఆ కమిటీ అధ్యయనం చేసి.. ప్రభుత్వానికి నివేదిక ఇచ్చాకే.. వాటి ఆధారంగా మార్గదర్శకాలు సిద్ధమవుతాయి. ఆ తర్వాత.. రెవెన్యూ శాఖ ఆ మార్గదర్శకాలకు అనుగుణంగా విద్యార్థులకు స్థానిక ధ్రువీకరణ పత్రాలను ఇవ్వాల్సి ఉంటుంది. ఆ ధ్రువపత్రాలను విద్యార్థులు వైద్య విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తే.. కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈ పరిణామాలతో.. వైద్యవిద్య ప్రవేశాల ప్రక్రియ ఎప్పటికి మొదలవుతుందో చెప్పలేని పరిస్థితులు నెలకొంటాయని వైద్యవర్గాలు చెబుతున్నాయి.

విద్యార్థుల్లో ఆందోళన..

ఎంబీబీఎస్ ప్రవేశాలు నిలిచిపోవడంతో విద్యార్థుల్లో ఆందోళన నెలకొంటోంది. గత ఏడాది సరిగ్గా ఇదే సమయానికి రెండోవిడత కౌన్సెలింగ్ ముగిసింది. ఈ ఏడాది తీవ్ర జాప్యం నెలకొనడంతో.. మన దగ్గర సీటు రాకుంటే పొరుగు రాష్ట్రాలకు వెళ్దామనుకునేవారికి ఆ అవకాశం ఉండదు. ఈ ఏడాది కన్వీనర్ కోటా సీట్ల కోసం 17,654 మంది తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోగా, యాజమాన్య కోటా, సీ-కేటగిరి కింద మరో 6,468 మంది దరఖాస్తు చేసుకున్నారు.

రాష్ట్రంలో ఎంఏ, ఎంఎస్సీ, ఎంకామ్ వంటి పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) సీట్ల భర్తీ కోసం నిర్వహిస్తున్న సీపీగెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా ఆదివారం 21,505 మందికి సీట్లు కేటాయించారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఈ నెల 13వ తేదీ లోపు ఫీజు చెల్లించి ఆయా కాలేజీల్లో రిపోర్ట్ చేయాలి. కాగా, రెండో విడతలో 512 మందికి బీఈడీ సీట్లను ఆదివారం కేటాయించారు. సీట్లు పొందిన అభ్యర్థులు 12వ తేదీలోపు కాలేజీల్లో చేరాలి.

Printed and Published by ***Koganti Venkata Seshagiri Rao*** *on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor:* ***K. Srinivas.*** *Ph. No. (0870) 2100480/84,*
RNI No:APTEL/2003/9741, ***Managing Director : Vemuri Radha Krishna*** *Founder: K.L.N.Prasad.*